
శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 07, సంచిక: 178 | గురువారం | 30-05-2024 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 8+8 | వెల రూ. 5.00


### విత్తనాలు, ఎరువులకు కొరత లేదు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ప్రతిపక్షాలవి అనవసర రాద్ధాంతం



03

# తుది దశకు ‘రాష్ట్ర గీతం’



- సిద్ధమైన ‘తెలంగాణ రాష్ట్ర చిహ్నం’
- జూన్ 2న ‘జయ జయహే తెలంగాణ’ గీతం ఆవిష్కరణ
- ప్రస్తుత చిహ్నంలో కాకతీయ తోరణం, ఇతర రాచరిక ఆనవాళ్లు తొలగింపు
- రాష్ట్ర గీతం, చిహ్నంపై సిఎం సమీక్ష

ప్రజాపక్షం / హైదరాబాద్

‘తెలంగాణ రాష్ట్ర గీతం’ రూపకల్పన తుది దశకు చేరుకుంది. ‘జయ జయహే తెలంగాణ’ గీతం రూపకల్పనపై బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కవి అందెశ్రీ, సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ ఉద్యమ రథ సారథి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, అద్దంకి దయాకర్‌తో పాటు పలువురు ప్రముఖులు, నేతలు పాల్గొన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ గీతాన్ని సంగీత దర్శకుడు కీరవాణి బృందం పాడి వినిపించింది. గీతం నిడివి, స్వరకల్పన, గాయకులను ఖరారు తరువాయి 2లో



### మరో 24 గంటల్లో
# కేరళకు నైరుతి

ప్రజాపక్షం/హైదరాబాద్

మరో 24 గంటల్లో కేరళకు నైరుతీ రుతుపవనాలు రానున్నట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. గురువారం నుంచి వర్షాకాలం ప్రారంభంకానున్నట్లు తెలుస్తోంది. వివిధ వాతావరణ అంశాల ఆధారంగా నైరుతీ తరువాయి 2లో



### 25 వారాల గర్భ విచ్ఛిత్తికి
# సుప్రీంకోర్టు తిరస్కరణ

**న్యూఢిల్లీ:** ఒక మహిళ తన 25 వారాల గర్భాన్ని తొలగించుకోవడానికి అనుమతిం చాల్సిందిగా దాఖలు చేసుకున్న పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. అయితే, నివేదికలో ఉన్న సమాచారాన్ని, పిటిషనర్ గోప్యతను దృష్టిలో ఉంచుకొని వెల్లడించడానికి నిరాకరించింది. తాను గర్భవతిననే విషయం చాలా ఆలస్యంగా, ఈనెల 17వ తేదీన తెలిసిందని, అందుకే తరువాయి 2లో

### రాష్ట్ర అవతరణ వేడుకలకు
# ముమ్మర ఏర్పాట్లు

- దాదాపు 20 వేల మందికి పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లు
- సభా ప్రాంగణంలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు
- 2న సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల నిర్వహణకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరయ్యే ఈ ఆవిర్భావ వేడుకల నిర్వహణకు సికిందరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో వివిధ శాఖలు పెద్దఎత్తున ఏర్పాట్లను చేపట్టాయి. జూన్ 2వ తేదీన ఉదయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గన్‌పార్క్‌లో అమరవీరుల స్థూపానికి పూల మాలలు సమర్పించి నివాళులు అర్పించిన అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే దాదాపు 20 వేల మంది పట్టే భారీ తరువాయి 2లో





# ఎండలో మండిన ఢిల్లీ !
### రికార్డుస్థాయిలో 52.3 డిగ్రీలు ఉష్ణోగ్రత
### 79 ఏళ్ళలో అత్యధికం

**న్యూఢిల్లీ :** రాజధాని ఢిల్లీలో మునుపెన్నడు లేని రీతిలో వడగాలితో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నగర చరిత్రలోనే మొదటి సారిగా పలు ప్రాంతాలలో పగటి ఉష్ణోగ్రత 50 డిగ్రీలు దాటింది. మంగేశ్‌పూర్ ప్రాంతంలోనైతే బుధవారం ఏకంగా 52.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. ఢిల్లీ ప్రాథమిక వాతావరణ కేంద్రం సఫ్దర్‌జంగ్‌లో 46.8 డిగ్రీల ఉష్ణోగత్ర నమోదవ్వగా, ఇది 79 ఏళ్ళలో అత్యధికమని అధికారులు పేర్కొన్నారు.

### కోర్టు పరిగణనలోకి ఇడి అనుబంధ ఛార్జ్‌షీట్



**న్యూఢిల్లీ :** ఢిల్లీ మద్యం కేసులో భాగంగా మనీ లాండరింగ్ కేసులో, బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత సహా ఇతర నిందితులపై ఇడి దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్‌ను రౌస్ అవెన్యూ కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈనెల 10న మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అనుబంధ ఛార్జ్ షీట్ దాఖలు చేసిన ఇడి, కవిత, చరణ్ ప్రీత్, దామోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, అరవింద్ సింగ్‌లను నిందితులుగా పేర్కొంది. ఇడి అరెస్టుతో ప్రస్తుతం జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న కవిత, చరణ్‌జీత్‌లకు రౌస్ అవెన్యూ కోర్టు, ప్రొడక్షన్ వారెంట్లు జారీ చేసింది. దామోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, అరవింద్ సింగ్‌ను అరెస్టు చేయకపోవడం వల్ల, వచ్చేనెల 3న కోర్టుకు హాజరుకావాలని సమన్లు జారీ చేసింది. తదుపరి విచారణ జూన్ 3కి వాయిదా వేసింది.

# తవ్వేకొద్దీ.... కీలక విషయాలు

### 56 మంది సిబ్బందితో 1200 మంది ఫోన్‌లు ట్యాప్
### ఫోన్ ట్యాపింగ్ కేసు రోజుకో మలుపు



ప్రజాపక్షం/హైదరాబాద్

సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. దర్యాప్తు అధికారుల విచారణలో తవ్వే కొద్దీ కీలక విషయాలు బయటకు వస్తున్నాయి. తాజాగా బహిర్గతమైన మాజీ ఎస్ఐబి డిఎస్‌పి ప్రణీత్‌రావు వాంగ్మూలంలో పలు కీలక విషయాలు పోలీసులకు వివరించాడు. ఎస్ఐబికి 2019లో బదిలీ అయ్యానని తెలిపారు. అక్కడ ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఎస్ఐలు, ఇద్దరు ఏఎస్ఐలు, ముగ్గురు కానిస్టేబుళ్లతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను తనకు అందించారని చెప్పారు. ఎస్ఐబిలో తరువాయి 2లో

# ‘పార్సిల్ స్కామ్’

### రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
### రూ.కోట్లలో నష్టపోతున్న బాధితులు



ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలో సైబర్ నేరాలు, ఆన్ లైన్ మోసాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. కొత్త కొత్త పద్ధతులతో మోసగాళ్లు చెలరేగిపోతున్నారు. ప్రజలను నమ్మించి, కొన్ని సందర్భాల్లో బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇప్పుడు కొత్తగా పార్సిల్ స్కామ్ అనేది వెలుగులోకి వచ్చింది. దీని బారిన పడి అనేక మంది కోట్ల రూపాయలు పొగొట్టుకున్నారు. ఈ పార్సిల్ స్కామ్ బాధితులు అంతకంతకూ పెరిగిపోవడంతో ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఎవరి నుంచి అయినా ఇటువంటి కాల్స్ వస్తే సైబర్ క్రైమ్ వెబ్‌సైట్లో ఫిర్యాదు చేయాలని కోరింది.

**పార్సిల్ స్కామ్ అంటే..**

స్కామ్ లో భాగంగా మోసగాళ్లు ఒక నంబర్ నుంచి బాధితుడికి కాల్ చేస్తారు. లేదా వాట్సాప్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ద్వారా సంప్రదిస్తారు. తాము వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు చెందిన అధికారులని చెబుతారు. బాధితుడి పేరు మీద ఒక పార్సిల్ వచ్చిందని, దానిలో డ్రగ్స్, నకిలీ పాస్‌పోర్టు, ఇతర నిషిద్ధ వస్తువులు ఉన్నాయని భయపెడతారు. వాటితో తనకు సంబంధం లేదని బాధితుడి తెలిపినా వినరు. ఒక్కోసారి బాధితుడి బంధువు తమ కస్టడీలో ఉన్నాడని భయాందోళనకు గురిచేస్తారు. పోలీసు స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాల మాదిరిగా కనిపించేలా సెట్టింగ్ వేసి, వాటిలో ఉండి వీడియో కాల్స్ చేస్తారు. వాటిని చూసిన తర్వాత అదంతా నిజమేనని బాధితుడు నమ్మే అవకాశం ఉంటుంది.

**డబ్బుల డిమాండ్..**

బాధితుడు భయపడిన తర్వాత డబ్బులు డిమాండ్ చేస్తారు. ఆ కేసును వదిలేయాలంటే డబ్బులు ఇవ్వాలని అడుగుతారు. లేకపోతే భారీగా శిక్షలు పడతాయని, జైలుకు వెళ్లాల్సి ఉంటుందని బెదిరిస్తారు. ఇంటర్నేషనల్ ఫండ్ ట్రాన్స్ ఫర్, బంగారం, క్రిప్టోకరెన్సీ, ఎటిఎం తదితర విధానాలలో డబ్బులు వేయాలని కోరారు. ఈ విధానంలో కొందరు బాధితులు డిజిటల్ అరెస్ట్‌కి కూడా గురవుతారు. అంటే చెల్లింపులు చేసే వరకూ బాధితుడు వీడియో కాల్‌లో స్కామర్లతో ఉండాలి.

**ప్రభుత్వం చర్యలు..**

పార్సిల్ స్కామ్‌లు ఎక్కువైన నేపథ్యంలో దేశం వెలుపల నుంచి వచ్చే స్పూఫ్ కాల్‌లను నిరోధించడానికి ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్, డిపార్ట్మెంట్ ఆఫ్ టెలికాం దళాలు కలిశాయి. మోసగాళ్లు తాము నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), చట్టాలను తరువాయి 2లో



### లోయలో పడిన బస్సు..
# 28 మంది మృతి

**కరాచి :** పాకిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకొంది. బస్సు లోయలో పడిపోవడంతో 28 మంది ప్రాణాలు కోల్పోయారు. టర్బాట్ నుంచి బలూచిస్థాన్ రాజధాని క్వెట్టాకు బయలుదేరిన బస్సు కనుమ మార్గంలో ప్రయాణిస్తుండగా అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 28 మంది అక్కడికక్కడే మృతి చెందగా.. 22 మందికి తీవ్రంగా గాయాలయ్యాయి.

### పంజాబ్‌ను వీడని
# డ్రగ్స్ సమస్య



### రోజురోజుకూ పెరుగుతున్న మాదకద్రవ్యాల ముప్పు : రాహుల్

**న్యూఢిల్లీ :** పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్య నేటికీ ఉందని, అది రోజురోజుకు పెరుగుతుందని కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ సమస్యపై కఠిన చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆప్ అధికారంలో ఉన్న పంజాబ్‌లో మాదకద్రవ్యాల అంశాన్ని లేవనెత్తిన కాంగ్రెస్ రెండవ వ్యక్తి రాహుల్‌గాంధీ. అంతకు ముందు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఈ సమస్యపై గళం విప్పారు. లూధియాన కాంగ్రెస్ అభ్యర్థి అమరిందర్‌సింగ్ రాజాకు మద్దతుగా బుధవారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ పాల్గొని మాట్లాడారు. మహాలక్ష్మి పథకం, రైతు రుణాలు మాఫీ, పంటలకు మద్దతు చట్టం సహా కాంగ్రెస్ హామీలపై రాహుల్ మాట్లాడారు. కాగా, ర్యాలీలో డ్రగ్స్ ముప్పు గురించి ప్రస్తావించారు. రాష్ట్రంలో డ్రగ్స్ సమస్య నేటికీ ఉందని, అది మరింత పెరుగుతోందన్నారు. పంజాబ్‌లో లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీలైన కాంగ్రెస్, ఆప్ విడివిడిగా పోటీ చేస్తున్నాయి. అయితే బిజెపి ప్రభుత్వంపై రాహుల్ విమర్శలు గుప్పిస్తూ, ఎన్నికల్లో గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని, రద్దు చేస్తామని తొలిసారి బిజెపి, ఆ పార్టీ నేతలు చెప్పారన్నారు. రాజ్యాంగం కేవలం పుస్తకమే కాదని, అది ప్రజల గళం అని రాహుల్ పేర్కొన్నారు. రిజర్వేషన్లైనా, ప్రభుత్వ రంగమైనా, పేదల హక్కులైనా.. ఏది లభించినా అది రాజ్యాంగం నుంచి తరువాయి 8లో

### పెరిగిన రాజకీయ
# పార్టీలు

**2009తో పోలిస్తే 2024లో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన వారి సంఖ్య 104 శాతం పెంపు**

**న్యూఢిల్లీ :** ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలో పోటీ చేస్తున్న పార్టీ సంఖ్య భారీ పెరిగింది. 2009తో పోలిస్తే 2024లో ఆ సంఖ్య 104 శాతానికి దూసుకెళ్లింది. ఈ మేరకు అసోసియేషన్ ఫర్ డెమాక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) విశ్లేషణ ద్వారా వెల్లడయింది. 2019లో జరిగిన ఎన్నికల్లో 677 పార్టీలు పోటీ చేస్తే 2024లో 751 బరిలో నిలిచాయి. 2014లో 464, 2009లో 368 రాజకీయ పార్టీలు పోటీ చేశాయి. అయితే తరువాయి 8లో



# కొలంబియాలో ఇక బుల్ ఫైటింగ్ నిషేధం

## పార్లమెంటులో వామపక్ష ప్రభుత్వం తీర్మానం



**బోగోటా :** దక్షిణ అమెరికాలో అత్యంత ఆదరణగల బుల్ ఫైటింగ్‌ను కొలంబియా దేశం నిషేధించింది. ఈ మేరకు ఆ దేశ పార్లమెంటు ఒక తీర్మానం ఆమోదించింది. ఐతే దశలవారీగా దేశంలో ఈ బుల్ ఫైటింగ్‌ను తొలగించి ప్రజలను నిరుత్సాహపరచాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రీడ పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాలకు సహాయం చేస్తామనీ, వా రు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకునే వరకూ మూడు సంవత్సరాలపాటు ఈ క్రీడ కొనసాగుతుందని ప్రభుత్వం ప్రటించింది. కొలంబియాలో మొదటిసారి అధికారంలోకి వచ్చిన వామపక్ష ప్రభుత్వం దేశంలలో చేపట్టిన సంస్కరణల్లో భాగంగా ఈ చర్యకు పూనుకుంది. జంతువులతో చెలగాటం ఆడకూడదని, వాటి హక్కులు రక్షించాలని కూడా ప్రభుత్వం తీర్మానించింది. ఆ ఆట ఒక పెద్ద కమర్షియల్ జూదంగా మారింది. ఈ ఆటను సమర్థించేవారిపై పై చేయి సాధించడంతోపాటు జంతు హక్కుల రక్షణలో ఈ నిషేధ తీర్మానం ఒక గొప్ప ముందు అడుగుగా,ఒక విజయంగా ప్రభుత్వం ప్రకటించింది. దిగువసభ కాంగ్రెస్‌లో 93మంది తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయగా, కేవ లం ఇద్దరు మాత్రమే వ్యతిరేకంగా ఓటు వేశారు. దేశాధ్యక్షుడు గస్టవో ఫ్రా న్సిస్కో పెట్రో ఉర్రెగో దీనిపై ఎక్స్ వేదికగా స్పందిస్తూ, బుల్ ఫైటింగ్‌ల ద్వా రా చావులు కళ్ళారా చూసే విషాద ఘటనలకు ఇక చెల్లు చీటీ ఇచ్చామని, ఇది సెలబ్రేషన్స్ చేసుకోవాల్సిన సమయమనీ ఆయన పిలుపు ఇచ్చారు.

# మెక్సికోలో చరిత్రాత్మక అధ్యక్ష ఎన్నికలు

## తొలిసారి మహిళ ఎన్నికకు ఓటర్లు సన్నద్ధం



**మెక్సికో సిటీ :** మెక్సికోలో జూన్ 2వ తేదీ ఆదివారం జరిగే సార్వత్రిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లూ చేశారు. దేశంలో మొట్టమొదటిసారి ఇద్దరు మహిళలు రెండు రాజకీయ కూటముల తరపున అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నారు. ఒక మహిళను అధ్యక్షురాలుగా మొట్టమొదటిసారి ఎన్నుకునేందుకు దేశంలో ఓటర్లు సన్నద్ధమవుతున్నారు. ఈ ఎన్నికలతో దేశంలో ఇంతవరకూ కొనసాగిన పురుషాధిక్యతకు తెర పడుతుంది. ఈ కారణంగాఈసారి మెక్సికోలో ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగా, చరిత్రాత్మకంగా మారాయి. అధికార మొరేనా పార్టీ అండగా ఉన్న మహిళా అధ్యక్ష అభ్యర్థి లోపెజ్ ఒబ్రెడార్, ప్రతిపక్ష కూటమి పార్టీల తరపున సెనేటర్ గ్జోచిట్ గాల్వెజ్ నువ్వా నేనా అనే రీతిలో పోటీ పడుతున్నారు. అదేవిధంగా సిటిజన్స్ మూమెంట్ పార్టీకి చెందిన మాజీ కాంగ్రెస్ మెన్ జార్జ్ ఆల్వరెజ్ మేనెజ్ కూడా అధ్యక్ష పదవి పోటీలో ఉన్నారు.




# రఫాలో ప్రాణాంతక దాడితో ఏకాకైన ఇజ్రాయిల్

**టెల్ అవీవ్ :** సెంట్రల్ గాజాలో టెంట్లు వేసుకుని బతుకుతున్న అమాయకులైన పాలస్తీనా ప్రజలపై బాంబుదాడులు చేసిన ప్రాణాలు బలిగొన్న ఇజ్రాయిల్‌పై యావత్ ప్రపంచం తీవ్ర ఆగ్రహావేశాలతో ఉంది. అదేవిధంగా యుద్ధ నేరాలపై విచారణ చేస్తున్న ఐసిసి ప్రాసిక్యూటర్‌ను కూడా ఇజ్రాయిల్ గూఢచారి విభాగం బెదిరించి హెచ్చరికలకు దిగడం కూడా పెద్ద చర్చనీయాంశంగా మారింది. అదేవిధంగా అంతర్జాతీయస్థాయిలో గతవారంలో వెలువడిన రెండు కీలకమైన తీర్పులు కూడా ప్రపంచదేశాలను రెండుగా విభజించాయని నిపుణులు పేర్కొన్నారు. జో బైడెన్, రిషి సునాక్, నేతన్యాహూలు ఒకవైపు, ప్రపంచం మరోవైపు అన్నట్టుగా పరిస్థితులు ఉండగా యూరోపియన్ యూనియన్ ప్రయోనాల విషయంలో కూడా ఆ దేశాల మధ్య విభజన వస్తున్నది. 2023 అక్టోబరు 31 నుండి గాజాపై యుద్ధం చేస్తున్న ఇజ్రాయిల్ ఏడు నెలలపాటు చేసిన ఘోరతప్పిదమైన యుద్ధం ఒకెత్తైతే, మే 26వ తేదీన రఫాలో శరణార్థుల టెంట్లపై చేసిన బాంబు దాడులతో 45 మంది అమాయకుల ప్రాణాలు బలి తీసుకోవడం మరొక మహాపరాధంగా మారింది. ఈ చర్యను ఇజ్రాయిల్ ప్రధామంత్రి బెంజిమన్ నేతన్యాహూ కూడా పొరపాటుగా, ఒక తప్పిదంగా అంగీకరించినప్పటికీ ప్రపంచ దేశాలు, ఐక్యరాజ్యసమితి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ విషయంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో బుధవారంనాడు ఆల్జీరియా దేశం ఒక తీర్మానం ప్రతిని సభ్యదేశాలకు పంపిణీ చేసింది. ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. ఇకనైనా అంతర్జాతీయ న్యాయస్థానం ఉత్తర్వును ఇజ్రాయిల్ పాటించాలని డిమాండ్ చేయగా మరోవైపు లండన్, పారిస్, బెర్లిన్, ఇస్తాంబుల్, మనీలా, ట్యునీషియా, న్యూయార్క్ తదితర అనేక దేశాలలోని నగరాలలో పాలస్తీనాకు సంఘీభావంగా భారీ ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా తాజాగా ఉద్ధృతం చేసిన యుద్ధంవల్ల మరో 21 మంది పాలస్తీనా ప్రజలు మరణించారు. దక్షిణ గాజాలో ఇంటర్నెట్, టెలికమ్యూనికేషన్లను ఇజ్రాయిల్ స్తంభింపజేసింది. సెంట్రల్ గాజాలోకి ఇజ్రాయిల్ యుద్ధ టాంకులు, డ్రోన్లు, ప్రవేశించాయి. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో మరో 24 మంది పాలస్తీనియన్లను ఐడిఎఫ్ సైన్యం అరెస్టు చేసింది.






### ప్రజలను ఆకలితో మాడ్చేయడమే నేతన్యాహూ యుద్ధ వ్యూహం

రఫా క్రాసింగ్‌ను తక్షణం తెరవాలనీ, ఆకలితో అలమటిస్తున్న ప్రజలకు ఆహార సరఫరాకు ట్రక్కులనను అనుమతించాలనీ ప్రపంచవ్యాప్తంగా దేశాలన్నీ విజ్ఞప్తులు చేస్తుండగా, యుద్ధం ఆపేదిలేదని, ఎవరికీ లొంగేది లేదనీ నేతన్యాహూ తాజా ప్రకటన చేశారు. అమెరికా దీనిని పరోక్షంగా సమర్థిస్తున్నది. గడచిన మూడువారాలుగా 10లక్షలమంది పాలస్తీనా ప్రజలు అక్కడి నుండి కూడా బాంబు దాడుల భయంతో మరోచోటకు పారిపోయారనీ ఐక్యరాజ్యసమితి రిలీఫ్ అండ్ వర్కర్స్ ఏజన్సీ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ) ప్రకటించింది. గాజాలో ఆహారం నిల్వలు నిండుకున్నాయనీ, ఇక ప్రజలు తిండి లేక మల మల మాడిపోతారనీ 20 అంతర్జాతీయ సంఘాలు ఉమ్మడిగా రాసిన ఒక లేఖలో నేతన్యాహూకు హెచ్చరిక చేశాయి. ప్రజలను మల మల మాడ్చేయడమే నేతన్యాహూ యుద్ధవ్యూహంగా మారిందని అంతర్జాతీయ సంస్థలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి.

ప్రపంచం

# దక్షిణాఫ్రికాలో భారీగా ఓటింగ్

### జూన్ 2న తుది ఫలితాలు వెల్లడి

**జోహన్నెస్‌బర్గ్ :** దక్షిణాఫ్రికా పార్లమెంటు దిగువసభ నేషనల్ అసెంబ్లీకి, పలు రాష్ట్రాల అసెంబ్లీలకు దేశవ్యాప్తంగా 23,292 పోలింగ్ కేంద్రాలలో ఉదయం ఏడు గంటల నుండి రాత్రి తొమ్మిది గంటల వరకూ ప్రజలు ఓటుహక్కు ఉపయోగించుకున్నారు. ఎన్నికల్లో ఎవరు గెలిచేదీ పాక్షిక ఫలితాలు పోలింగ్ ముగిసిన కొద్ది గంటల్లోనే వెలువడే అవకాశాలు ఉండగా, తుది ఫలితాలు మాత్రం జూన్ 2వ తేదీ ఆదివారంనాడు వెలువడతాయి. ఓటర్లు పెద్ద సంఖలో పోలింగ్ కేంద్రాలవద్ద బారులు తీరారు. దేశంలో 2.80 కోట్లమంది అర్హులైన ఓటర్లు ఉండగా వీరిలో అత్యధికంగా యువకులే ఉన్నారు. 70 రాజకీయపార్టీలు, 11 మంది ఇండిపెండెంట్లు సహా మొత్తం 14,889 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ పడ్డారు. దక్షిణాఫ్రికాలో 1994 నుండీఈనాటి వరకూ తిరుగులేని అధికారం చెలాయిస్తున్న ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్‌పార్టీ ఈసారి ఒడిదొడుకులకు గురైంది. ఆ పార్టీ నాయకుడు, దేశాధ్యక్షుడు రామఫోసాకు ఈ ఎన్నికలు అగ్నిపరీక్షలా మారాయి. దేశంలో ప్రధాన ప్రతిపక్షం డెమొక్రటిక్ అలయెన్స్ (డిఎ) నాయకుడు స్టీన్ హసేన్ (48) దేశాన్ని ఎ ఎన్ సి నుండి విముక్తి చేయాలని భారీ ఎత్తున ప్రచారం చేశారు. కాగా దేశ మాజీ అధ్యక్షుడు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ ఎ ఎన్ సి నుండి బయటకు వచ్చి ఎం కె పార్టీ (ఉమ్ ఖోంటో సిజ్వే) పెట్టిన నాయకుడు జాకబ్ జుమా, ఎకనామిక్ ఫ్రీడమ్ పార్టీకి చెందిన నాయకుడు జూలియస్ మలేమా (43), ఇంకతా ఫ్రీడమ్ పార్టీ (ఐఎఫ్‌పి) నాయకుడు వెలెంకోసినీ హ్లాబిసా జాతీయ అసెంబ్లీలో పోటీ దారులుగా ఉన్నారు. దేశంలోనిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం ప్రధానాంశాలుగా ఎన్నికల ప్రచారంలో రాజకీయపార్టీలు అధికారపార్టీపై తీవ్రస్థాయిలో విమర్శల దాడి చేశాయి.





# ఎవరెస్ట్ ఎక్కిన భారత్ టీనేజర్ కామ్యాకు నేపాల్ సత్కారం



**కఠ్మండు :** ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన భారత్‌కు చెందిన 16 ఏళ్ళ యువతి కామ్యా కార్తికేయన్‌కు నేపాల్ ప్రధాన మంత్రి పుష్పకమల్ దహల్ (ప్రచండ) బుధవారంనాడు ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ ఎవరెస్టు దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం ఈ స త్కార కార్యక్రమాలను నేపాల్ ప్రభుత్వం నిర్వహిస్తుంది. కామ్యా కార్తికేయన్ తో సహా పలువురు ఎవరెస్టు విజేతలను ఆయన ఘనంగా సత్కరించారు. నేపాల వైపు నుండి మే 20వ తేదీన ఎవరెస్టు శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించి కార్తికేయన్ ఘనత సాధించారు. 8,848.86 మీటర్లు ఎత్తున గల ఎవరెస్టు శిఖరాగ్రానికి ఆయన చేరుకున్నారు. నేపాల్‌కు చెందిన టెన్జింగ్ నార్గే, న్యూజిలాండ్‌కు చెందిన ఎడ్మండ్ హిల్లరీ ఇద్దరూ 1953లో మొట్టమొదటిసారి ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి రికార్డు సృష్టించారు.వారు ఈ రికార్డు సృష్టించి 71 సంవత్సరాలు పూర్తయింది. కేవలం 16.9 ఏళ్ళ వయసులోనే కామ్యా కార్తికేయన్ ఎవరెస్టును అధిరోహించారు. ఐతే ఏడు సంవత్సరా ల క్రితమే ఆమె ఎవరెస్టు బేస్ క్యాంప్ నుండి ట్రెక్కింగ్ చేశారు. ‘‘ఈ ప్రాం తంలో తాను ఎవరెస్టు అధిరోహణకు వెళ్ళినప్పుడు స్థానిక ప్రజలు తనపట్ల ఎంతో ప్రేమాభిమానాలు చూపించారు’’ అని ఆమె కృతజ్ఞతలు తెలియజేశా రు. కాగా ఈ ఏడాది డిసెంబరులో కామ్యా కార్తికేయన్ అంటార్కిటికాలోని మౌంట్ విన్‌సన్‌ను అధిరోహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. కామ్యాతోపాటు 30 సార్లు ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన మరో మహిళ కామీ రితా షెర్పా, అదేవిధంగా కేవలం 14గంటల 31నిమిషాల్లో ఎవరెస్టును అధిరోహించిన ఫుంజో లామాలను కూడా ప్రచండ ఘనంగా సత్కరించారు.

# సుప్రీంకోర్టు తిరస్కరణ

(మొదటి పేజీ తరువాయి)

దుబాయ్ నుంచి భారత్‌కు తిరిగి వచ్చానని ఒక మహిళ సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొంది. ఆర్థిక పరిస్థితులతోపాటు, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా తనకు అబార్షన్ అవకాశాన్ని కల్పించాలని కోరింది. అయితే, మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటిపి) చట్టాన్ని అనుసరించి 24 వారాల అనంతరం గర్భ విచ్ఛిత్తి నేరం. ఏవైనా ప్రత్యేక సందర్భాల్లో, మెడికల్ బోర్డు సూచన మేరకు లేదా గర్భస్థ శిశువు వల్ల తల్లి ప్రాణానికి ముప్పు ఏర్పడినప్పుడు అసాధారణ గర్భ విచ్ఛిత్తికి అనుమతిస్తారు. కాగా, దుబాయ్ నుంచి వచ్చిన మహిళ పిటిషన్‌పై నివేదిక ఇవ్వాల్సిందిగా ఎయిమ్స్‌ను జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం కోరింది. ఈనెల 24న ఎయిమ్స్ నివేదికను సమర్పించగా, ధర్మాసనం బుధవారం తీర్పును వెల్లడించింది. ఎయిమ్స్ నివేదికను అనుసరించి, గర్భ విచ్ఛిత్తికి అనుమతించలేమని పేర్కొంటూ, సదరు మహిళ పిటిషన్‌ను కొట్టివేసింది. వ్యక్తిగత గోప్యతను పరిరక్షించేందుకు, ఎయిమ్స్ నివేదికను వెల్లడించడం లేదని తెలిపింది. అయితే, ఆ నివేదికను సీల్డ్ కవర్‌లో ఉంచి, రికార్డుల్లో ఉంచనున్నట్టు ప్రకటించింది.

# కేరళకు నైరుతి (మొదటి పేజీ తరువాయి)

ఆగమనంపై ఐఎండి ప్రకటన చేసింది. ఆరేబియా సముద్రంపై నైరుతీ పవనాలు బలపడినట్లు అంచనా వేశారు. దీంతో తేమశాతం పెరిగింది. మే 31నాటికి కేరళకు నైరుతీ రుతుపవనాలు చేరుకుంటాయని మొదట ఐఎండి అంచనా వేసింది. కానీ ఒకరోజు ముందే వర్షాలు కేరళకు చేరుకోనున్నట్లు తాజాగా ఐఎండి తెలిపింది.గత ఏడాది జూన్ 8న నైరుతీ కేరళ తీరాన్ని తాకింది. 2022లో కూడా మేనెలలోనే కేరళకు నైరుతీ చేరుకుంది. ఆ ఏడాది మే 29న ప్రకటన చేశారు. వాస్తవానికి ఇప్పటికే తిరువనంతపురంలో భారీవర్షాలు కురిశాయి. దీంతో ఆరెంజ్ అలర్ట్‌ను జారీచేశారు.

**రాగల రెండురోజులు పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం..**

నైరుతి రుతుపవనాలు రాగల 24 గంటల్లో కేరళలోకి ప్రవేశించటానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించింది. గురువారం, శుక్రవారం రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందన్నారు. శనివారం రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రాగల రెండు రోజులు పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు చెప్పారు. పశ్చిమ, వాయువ్య దిశల నుంచి రాష్ట్రంలో కిందిస్థాయి గాలులు వీస్తున్నట్లు తెలిపారు.

# ‘పార్సిల్ స్కామ్’ (మొదటి పేజీ తరువాయి)

అమలు చేసే ఇతర ఏజెన్సీల అధికారులను నమ్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో I4C అధికారిక లోగోలను దుర్వినియోగం కాకుండా నిరోధించడానికి మైక్రోసాఫ్ట్ సహాయాన్ని ప్రభుత్వం కోరింది. పార్సిల్ స్కామ్ విషయంలో పౌరులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం కోరింది. ఇలా కాల్స్, వాట్సాప్ మెసేజ్ లు, యూఆర్ ఎల్ లను గుర్తిస్తే సైబర్ క్రైమ్ వెబ్‌సైట్లో ఫిర్యాదు చేయాలని కోరింది.

**జాగ్రత్తలు తీసుకోండి..** స్కామ్ ల బారిన పడకుండా పౌరులు అప్రమత్తంగా ఉండాలని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) ప్రకటన జారీ చేసింది. ఇందుకోసం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. మనకు వచ్చిన కాల్స్‌ను ధ్రువీకరించుకోవాలి. అనవసరంగా కంగారు పడకూడదు. డబ్బులు డిమాండ్ చేసినా, మీ వ్యక్తి గత వివరాలు అడిగినా చెప్పకూడదు. అనుమానాస్పద కాల్స్, వాట్సాప్ మెసేజ్‌లు వస్తే వెంటనే సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌కు నివేదించండి. వెంటనే అధికారులు ఆ మోసపూరిత కార్యకలాపాలను ట్రాక్ చేస్తారు. వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం మానుకోండి. ఫోన్లో వ్యక్తిగత, ఆర్థిక వివరాలు ఎవ్వరికీ చెప్పకూడదు.

అనేక రూపాలలో కొత్తగా స్కామ్లు జరుగుతున్నాయి. అప్రమత్తంగా ఉన్నంత వరకూ ఎలాంటి నష్టం జరగదు. ఒకవేళ అలాంటి కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు తెలియజేయండి.

# తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సిద్ధమవుతున్న ట్యాంక్ బండ్

## ఏర్పాట్లను సమీక్షించిన వివిధ విభాగాల ఉన్నతాధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ట్యాంక్ బండ్ ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ట్యాంక్‌బండ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతోంది. రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాలతో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 2వ తేదీన సాయంత్రం ట్యాంక్ బండ్ పై పండుగ వాతవరణాన్ని తలపించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ట్యాంక్ బండ్ పరిసరాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సిలు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. సందర్శకులను ఆకట్టుకునే ప్రదర్శనలు, ఆట వస్తువులు, ఫుడ్‌స్టాల్స్ ఏర్పాటు, వివిధ జిల్లాలకు చెందిన పలు సాంస్కృతిక కళా బృందాలతో కార్నివాల్ ప్రదర్శనలు, ప్రధాన వేదిక పై పలు శాస్త్రీయ, జానపద, దక్కనీ సాంస్కృతిక కార్యక్రమాలు, తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతం 'జయ జయహే తెలంగాణ'పై పోలీసు సిబ్బందితో ప్రదర్శనతోపాటు మిరుమిట్లు గొలిపే బాణాసంచాలు లేజర్‌షోలతో ఉత్సవ వాతవరణాన్ని అణుభూతి పొందేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను బుధవారం వివిధ విభాగాల ఉన్నతాధికారులు ట్యాంక్‌బండ్ వేదిక వద్ద పరిశీలించారు. వేదిక అలంకరణ, వేడుకలకు హాజరయ్యే అతిధులకు, పాల్గొనే ప్రజలకు సీటింగ్, బ్యారికేడింగ్, పార్కింగ్, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, పోలీస్ బందోబస్తు తదితర ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలుసూచనలు ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో పాల్గొనే ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సభా ప్రాంగణంలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నారు. సమాచారపౌర సంబంధాలశాఖ ఆధ్వర్యంలో ఎల్ఈడీ స్క్రీన్‌లతో కార్యక్రమ లైవ్ ప్రసారానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఎండి సుదర్శన్‌రెడ్డి, జిహెచ్‌ఎంసి కమీషనర్ రోనాల్ రోస్, పంచాయత్ రాజ్ శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, హెచ్‌ఎండిఎ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ ఆమ్రపాలి, సిటీ పోలీస్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్ డిజి శివధర్‌రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాట్లను సమీక్షించారు.



# కొండగట్టు జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు

## ఏర్పాట్లకు ఇద్దరు ప్రత్యేక అధికారుల నియామకం

## దేవాదాయ కమిషనర్ హనుమంత రావు

**ప్రజాపక్షం / హైదరాబాద్:** కొండగట్టు హనుమాన్ దేవాలయంలో జూన్ 1వ తేదీన జరిగే హనుమాన్ జయంతి ఉత్సవాల ఏర్పాట్లను బుధవారం దేవాదాయ కమిషనర్ హనుమంతరావు సంబంధిత అధికారులతో సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దేవాలయంలో జరిగే ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక అధికారులను కూడా నియమించారు. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్లు రామకృష్ణ, వినోద్‌రెడ్డిలను ఉత్సవాల ఏర్పాట్ల కోసం స్వయంగా పర్యవేక్షించేందుకు బాధ్యతలు అప్పగించారు. కొండగట్టు జాతరకు ప్రతి సంవత్సరం లక్షలాది హనుమాన్ భక్తులు హాజరవుతారని, ఈ నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా టార్పాలిన్ కార్పెట్లు, మహిళలకు, వృద్ధులకు, పిల్లలకు ప్రత్యేక క్యూలైన్లు, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, మొబైల్ టాయిలెట్లు, ప్రత్యేక మెడికల్ అంబులెన్సులు, ప్రసాదం కౌంటర్ల వద్ద తగిన సిబ్బందిని నియమించడం, పోలీస్ భద్రతా, భక్తులకు పార్కింగ్ సదుపాయం, తదితర ఏర్పాట్లపై దేవాదాయ కమిషనర్ హనుమంతరావు సమీక్షించి తగు ఆదేశాలు జారీ చేశారు. రాష్టంలో వివిధ ప్రాంతాల నుండే కాకుండా మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి వేల సంఖ్యలో వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని అవసరమైన మేరకు ఆర్‌టిసి బస్సులను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ జాతరలో పాల్గొనే ముఖ్యలకు, ప్రజాప్రతినిధులకు, భద్రత సౌకర్యం ఏర్పాటు చేసున్నారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలకు అస్కారం లేకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు వివరించారు.

# తవ్వేకొద్దీ.... కీలక విషయాలు

(మొదటి పేజీ తరువాయి)

రోజువారీ కార్యకలాపాలు కాకుండా ఎవరికీ చెప్పని పనులు తనకు చెప్పేవారని ఆయన పేర్కొన్నారు. ఎస్ఐబీ కార్యాలయంలో మొదటి అంతస్తులో ప్రభాకర్‌రావు ఛాంబర్ పక్కనే తనకు రెండు గదులు కేటాయించారన్నారు. ఇందులో ఎస్ఐబి ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండు లాగర్‌రూమ్‌లో సుమారు 56 మంది సిబ్బందితో పని చేసినట్లు పోలీసులకు వాంగ్మూలంలో వెల్లడించారు.

### ‘రావు’లకే పోస్టింగ్‌లు ..

ఆ రెండు గదుల్లోని సిబ్బందికి 17 కంప్యూటర్లు, ప్రత్యేక సర్వర్లు ఏర్పాటు చేసినట్లు వాంగ్మూలంలో ప్రణీత్‌రావు తెలిపారు. ముఖ్యంగా ప్రభాకర్‌రావు రాజకీయ సంబంధమైన ప్రొఫైల్స్‌ను క్రియేట్ చేసే పనిని తమకు అప్పగించారన్నారు. బిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఉన్న ప్రతిపక్ష పార్టీల నాయకుల ప్రొఫైల్స్ క్రియేట్ చేయమని చెప్పేవారని తెలిపారు. ఇందుకోసం స్నేహితుడు, సామాజిక వర్గానికి చెందిన ఇన్‌స్పెక్టర్ గుండు వెంకట్రావు, చిన్ననాటి స్నేహితుడు బాలే రవి కిరణ్‌ను కూడా ప్రభాకర్‌రావు సాయంతో ఇంటిలిజెన్స్‌కు బదిలీ చేసుకున్నట్లు చెప్పారు. హెడ్ కానిస్టేబుళ్లు రఫీ, యాదయ్య. కానిస్టేబుళ్లు హరీశ్, సందీప్, మధుకర్ రావు ఉన్నారన్నారు.

ప్రత్యేక ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకుని వాటి ద్వారా సుమారు 1000 నుంచి 1200 మంది ప్రొఫైల్‌లను క్రియేట్ చేశానని ప్రణీత్‌రావు వెల్లడించారు. అధికారికంగా మూడు, వ్యక్తిగతంగా మరో ఐదు చరవాణులను ఉంచుకొని ప్రభాకర్‌రావు చెప్పిన వారిని ట్రాక్ చేసినట్లు చెప్పారు. 2022లో ప్రభాకర్‌రావు పదవీకాలం ముగియగా తెలంగాణ ప్రభుత్వం అతనని జూన్ 2023వరకు ఎస్ఐబి చీఫ్‌గా మళ్లీ నియమించిందన్నారు. బిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఉండే వారి ప్రొఫైల్‌ను క్రియేట్ చేసి వారిని ట్యాప్ చేస్తూ మా బృందంతో కలిసి డబ్బులు సీజ్ చేశామన్నారు.

# ముమ్మర ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. వేసవి ఉండడంతో హాజరయ్యే ప్రజలకు, ప్రముఖులకు ఏమాత్రం ఇబ్బందులు లే కుండా ఉండేందుకు తాను జాగ్రత చర్యలు చేపడుతున్నారు. సభాప్రాంగణంలో ప్రత్యేక మెడికల్ క్యాంపుల ఏర్పాటు కూడా చేస్తున్నారు. తాగునీరు, టాయిలెట్ల సౌకర్యాలు కూడా ఏర్పా టు చేస్తున్నారు. సమాచార పౌర సంబంధాలశాఖ ఆధ్వర్యం లో ఎల్ఈడి స్క్రీన్‌లు, కార్యక్రమ లైవ్ ప్రసారానికి ఏర్పాట్లు చేశారు.

**ట్యాంక్ బండ్ పై కనులపండగగా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ...** జూన్ 2వ తేదీన సాయంత్రం ట్యాంక్ బండ్‌పై పలుసాంస్కృతిక కార్యక్రమాలు, కార్నివాల్, బాణాసంచా లేజర్‌షో, ఫుడ్, గేమింగ్ స్టాళ్ళను ఏర్పాటు చేశారు. ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన పలుసాంస్కృతిక కార్యక్రమాలకు ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరవుతారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన పలు సాంస్కృతిక కళా బృందాలచే కార్నివాల్ ప్రదర్శనలు ఉంటాయి. ప్రధాన స్టేజీపై పలుశాస్త్రీయ, జానపద, దక్కనీ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతం 'జయ జయ హే తెలంగాణ'పై జాతీయ జెండాలతో మార్చ్‌ఫాస్ట్ చేస్తారు.

**మిరుమిట్లు గొలిపే ఫైర్ వర్క్స్ ప్రదర్శన...**

ట్యాంక్ బండ్‌పై దాదాపు 80 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ స్టాళ్లలో రాష్ట్రంలోని హస్త కళలు, స్వయం సహాయక బృందాలు తయారు చేసే వస్తువులు, చేనేత ఉత్పత్తులు, నగరంలోని పలు ప్రముఖ హోటళ్ళచే స్టాల్స్, చిన్న పిల్లలకు గేమింగ్‌షోల ఏర్పాటు చేశారు.

# తుది దశకు ‘రాష్ట్ర గీతం’

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. మార్పులు, చేర్పులను కవి అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణి వివరించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉర్రూతలూగించిన అందెశ్రీ గీతం ‘జయ జయహే తెలంగాణ’ను ఇప్పటికే ప్రభుత్వం రాష్ట్ర గీతంగా ప్రకటించగా, ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి స్వరకల్పన చేశారు. అయితే ఇందుకు తగిన సమాచారం ఎక్కడా బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావం దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లను చేస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర గేయం, చిహ్నంలో చిన్న చిన్న మార్పులు చేయనుంది. ఈ మార్పుల తర్వాత జూన్ 2న నూతనంగా ఆవిష్కరించనున్నారు.

**రాష్ట్ర చిహ్నంపై తుదిరూపు సిద్ధం...**

‘తెలంగాణ రాష్ట్ర చిహ్నం’ తుదిరూపు సిద్ధ మైంది. పోరాటం, త్యాగాలను ప్రతిబింబించేలా రాష్ట్ర చిహ్నం ఉంటుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కళాకారుడు రుద్ర రాజేశం రూపొందించిన చిహ్నంపై బుధవారం ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత చిహ్నంలో రాచరికం గుర్తులు ఉన్నం దున ప్రజాస్వామ్యం, ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించేలా కొత్తగా తయారు చేసే దిశగా కసరత్తు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కొత్త చిహ్నం కోసం 12 నమూనాలు తయారు చేయించారు. కొత్త చిహ్నంపై ఇటీవల సిపిఐ, సిపిఐ(ఎం) నేతలతో పాటు ఉద్యమకారులు, పార్టీ నేతలు, కొందరు అధికారులతో సిఎం చర్చించారు. ప్రస్తుత చిహ్నంలోని కాకతీయ తోరణాన్ని తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అంతర్జాతీయ గుర్తింపు ఉన్న చార్మినార్, మూడు సింహాలు, జాతీయ జెండాలోని మూడు రంగులను కొనసాగిస్తూనే పోరాటం, త్యాగాలను ప్రతిబింబించేలా మరో గుర్తు పెట్టాలని కొన్ని రోజులుగా పలువురు సూచించినట్లు సమాచారం. రెండు రోజుల క్రితం రుద్ర రాజేశంతో సిఎం చర్చించి కొన్ని మార్పులను సూచించారు.



# ‘గ్రూప్ 1 ప్రిలిమినరీ’ ఏర్పాట్లలో టిజిపిఎస్‌సి నిమగ్నం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రూప్ 1ప్రిలిమినరీ పరీక్షల ఏర్పాట్లను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిపిఎస్‌సి) ప్రారంభించింది. జూన్ 1 మధ్యాహ్నం 2 గంటల నుంచి అభ్యర్థులు తమ హాల్ టికెట్లను టిఎస్‌పిఎస్‌సి వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని టిఎస్‌పిఎస్‌సి సూచించింది. జూన్ 9న ఉదయం 10:30 గంటల నుంచి మధాహ్నం 1గంట వరకు పరీక్షను నిర్వహించనున్నారు. పరీక్ష సమయంలో అభ్యర్థులు ఎటువంటి పొరపాట్లు , అయోమయానికి గురికాకుండా టిఎస్‌పిఎస్‌సి పలు సూచనలు జారీ చేసింది. ఈ మేరకు టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి డాక్టర్ ఇ.నవీన్ నికోలాస్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గ్రూప్ 1ప్రిలిమినరీ పరీక్ష సమాయానికి అరగంట ముందే ఉదయం 10గంటలకు పరీక్ష కేంద్రం ద్వారాలను మూసివేయనున్నట్టు టిఎస్‌పిఎస్‌సి వెల్లడించింది. బయోమెట్రిక్ విధానం ద్వారా అభ్యర్థుల హాజరునమోదు చేయనున్నారు. అయితే ఉదయం 9:30గంటల నుంచే బయోమెట్రిక్ హాజరును నమోదు చేయనున్నారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు అయోమయానికి గురికాకుండా ముందస్తుగానే వెబ్‌సైట్ నుంచి మోడల్ ఒఎంఆర్ షీట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ప్రాక్టీస్ చేయాలని సూచించింది. అభ్యర్థుల సౌకర్యార్థం ఇప్పటికే టిఎస్‌పిఎస్‌సి వెబ్‌సైట్‌లో ఒఎంఆర్ షీట్‌ను అందుబాటులో పెట్టిన విషయంతెలిసిందే. పరీక్ష సమాయం ముగిసినత తర్వాతనే అభ్యర్థులను పరీక్ష కేంద్రం నుంచి బయటికి పంపిస్తారు. ఆలోపు పరీక్ష ముగిసినప్పటికీ అభ్యర్థులను బయటికి అనుమతించబోరు. ఒఎంఆర్ ఆన్సర్ షీట్ పత్రాలు, హాల్‌టికెట్లలో అభ్యర్థులు చేసే పొరపాట్లకు టిఎస్‌పిఎస్‌సి ఎటువంటి బాధ్యత వహించబోదని వెల్లడించింది. పరీక్షకు ఒక రోజు ముందే పరీక్ష కేంద్రాన్ని చూసుకుంటే మంచిదని, చివరి నిమిషంలో ఖంగారు పడాల్సిన అవసరం ఉండబోదని టిఎస్‌పిఎస్‌సి సూచించింది.

**పరీక్షకు చెప్పులతోనే రావాలె**

పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సాధారణ చెప్పులతోనే రావాలని, బూట్లను ధరించి వస్తే అనుమతించబోమని టిఎస్‌పిఎస్‌సి స్పష్టం చేసింది. అలాగే అభ్యర్థులు తమ చేతులకు మెహందీ,ట్యాటూస్ తదితర వాటిని పెట్టుకోవద్దని సూచించింది. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి క్లాక్ రూమ్/ స్టోరేజ్ రూమ్‌లను ఏర్పాటు చేయబోమని తెలిపింది. కాగా అభ్యర్థులు తమ వెంట ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి ఇవ్వబోమని, ఆభరణాలను, ప్యాడ్స్‌ను, లాగ్‌బుక్స్‌ను తదితర వాటిని అనుమతించబోమని వెల్లడించింది.

# జూన్ 3న ‘టిఎస్ లాసెట్, పిజిఎల్‌సెట్ -2024’ పరీక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ‘టిఎస్ లాసెట్, పిజిఎల్‌సెట్ 2024’ పరీక్షలను జూన్ 3న మూడు సెషన్‌లలో నిర్వహించనున్నారు. మూడు సంవత్సరాలు లాసెట్‌ను ఉదయం 9గంటల నుంచి 10:30గంటల వరకు, మధ్యాహ్నం 12:30గంటల నుంచి 2గంటల వరకు,అలాగే సాయంత్రం 4గంటల నుంచి 5:30గంటల వరకు మూడు సెషన్‌లో పరీక్షలు జరగనున్నాయి. మూడు సంవత్సరాల లాసెట్‌లో 36,079మంది, ఐదు సంవత్సరాల కోర్స్‌లో 10,197 మంది, పిజిఎల్‌సెట్‌లో 4408 మంది మొత్తం 50,684 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మొత్తం 186 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులు https:// lawcet. tsche.ac. in/.వెబ్‌సైట్ ద్వారా తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ‘టిఎస్ లాసెట్, పిజిఎల్‌సెట్ 2024’ కన్వీనర్ ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి బుధవారం ఒక ప్రటనలోపేర్కొన్నారు.

# ప్లాస్టిక్ రహిత జోన్‌గా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ : శాంతికుమారి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూలై నెలాఖరులోగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ను పూర్తిగా ప్లాస్టిక్ రహిత జోన్‌గామార్చేందుకు కార్యా చరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ను ప్లాస్టిక్ ఫ్రీ జోన్గా మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బుదవారం సచివాలయంలో అటవీ, పంచాయతీ రాజ్, కాలుష్యనియంత్రణ మండలి అధికారులతో సిఎస్ సమావేశమై చర్చించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై నిషేధం అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. కాగితపు సంచులు, గుడ్డ/జనపనార సంచులు, విస్తరాకులు మొదలైన పర్యావరణ అనుకూల ఉత్పత్తుల వినియోగం పై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నివారించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడానికి అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో అదనపు చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో ప్రచారంతో పాటు పంచాయతీలలో, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు తెలియజేశారు. టైగర్ రిజర్వ్ ఏరియాలో ప్లాస్టిక్ వాడకంపై నిషేధం గురించి హైవే వెంట ఉన్న స్థానిక వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు.అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని నాలుగు ఆవాసాల్లో నివాసముంటున్న ప్రజలను తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. మహబూబ్నగర్ జిల్లాలోని మైసమ్మ దేవాలయంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని ఎండోమెంట్‌శాఖ అధికారులను సిఎస్ కోరారు.అటవీశాఖ ముఖ్యకార్యదర్శి వాణీ ప్రసాద్, పంచాతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పిసిసిఎఫ్ ఆర్.యం. డోబ్రియాల్, టిఎస్‌పిసిబి సభ్య కార్యదర్శి బుద్ధ ప్రకాష్ జ్యోతి, కమిషనర్ ఎండోమెంట్స్ హనుమంతరావు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ ఒక సిల్లీ ఇష్యూ

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:**ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని సిల్లీ ఇష్యూగా పక్కనపెట్టామని, లీకు వార్తలు ఇలాగే కొనసాగితే లీగల్‌గా ముందుకెళ్తామని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. సినిమా సంగతి ఏమో గానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యూస్ రీల్స్ ఎక్కువయ్యాయని ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేకాటలో జోకర్ల తరహాలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తెర మీదకు తెస్తున్నారని,కానీఇంతవరకుప్రభుత్వం,లేదాముఖ్యమంత్రి, మంత్రులు అధికారిక ప్రకటన చేయలేదని చెప్పారు. లీకులతో వార్తలు రాయించి సూత్రధారులు, పాత్రధారులను నిర్ధారిస్తున్నారని, అభియోగాలు ఎప్పుడూ చట్టప రిధిలో అంగీకరించబడవని, ఏ ఉత్తర్వులు, ఏ ప్రాతిపదికన జరిగాయన్నది, కోర్టులో నిర్ధారణ అవుతుందని చెప్పారు. కొన్ని రోజులు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పైన అబద్దాలను ప్రచారం చేశారని, కేవలం రాజకీయ దుగ్ధతోనే అభాండాలు మోపారన్నారు. ఇప్పుడు మల్లన్న సాగర్ నుండి మూసీకి, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ కు ఏడు టిఎంసిలను తీసుకొస్తామని చెబుతున్నారని, కాళేశ్వరంవిఫల ప్రాజెక్టుఅయితే మరి నీళ్లను ఎలా ఇస్తారని ప్రశ్నించారు.కెసిఆర్, నేతలను బద్నాం చేయడమే లక్ష్యంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నడుస్తున్నదని ఆరోపించారు. మాజీ ఎంఎల్‌ఎ మదన్‌లాల్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# 1న బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రదర్శన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ముగింపు ఉత్సవాల సందర్భంగా జూన్ 1న హైదరాబాద్‌లోని గన్ పార్క్ అమరవీరుల స్థూపం నుంచి సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్తూపం వరకు ప్రదర్శన నిర్వహిస్తున్నామని బిఆర్‌ఎస్ మాజీ ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్ అన్నారు. గన్‌పార్క్‌వద్ద బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు నివాళ్లు అర్పిస్తారన్నారు.తెలంగాణభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.2న జాతీయ జెండా,బిఆర్‌ఎస్ పార్టీ జెండాను తెలంగాణ భవన్ లో ఎగురవేస్తామని తెలిపారు.

# విత్తనాలు, ఎరువులకు కొరత లేదు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా

ప్రతిపక్షాలవి అనవసర రాద్ధాంతం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువులకు ఏలాంటి కొరత లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో అవసరమైన విత్తనాల సరఫరా తగినంతగా ఉండేలా విత్తన కంపెనీలతో గత ఫిబ్రవరి, మార్చి నెలల్లోనే వరుస సమావేశాలు నిర్వహించి అన్ని చర్యలు తీసుకున్నామనితెలిపారు. 2023/24 సంవత్సరంలో 44.92 లక్షల ఎకరాల పత్తి పంట సాగుకాగా, ఈ వానాకాలానికి 55 లక్షల ఎకరాలలో పత్తి పంట సాగుకాగలదని అంచనా వేసి 1.24 కోట్ల పత్తివిత్తన ప్యాకేట్లను రైతులకు అందుబాటులో ఉంచడాని మార్చిలోనే ప్రణాళిక సిద్ధం చేశామని, ఇందుకు అనుగుణం బుధవారం నాటికి 51,40,405 పత్తి ప్యాకేట్లు వివిధ జిల్లాలలోరైతులకు అందుబాటులో ఉంచగా, 10,39, 040 వివిధ కంపెనీలకు చెందిన ప్యాకేట్లు రైతులు కొనుగోలు చేశారన్నారు. ప్రతిరోజు అన్ని జిల్లాలల నుండి కంపెనీలు, రకాల వారిగా అందుబాటులో ఉంచిన పత్తి ప్యాకేట్ల వివరాలు, అదేవిధంగా రైతులు కొనుగోలు చేసిన వివరాలను తెప్పించుకొని వ్యవసాయశాఖ నిరంతరం పర్యవేక్షించేలా ఆదేశాలు ఇచ్చామని తెలపారు. గత రెండు మూడు రోజులుగా ఒకటి, రెండు జిల్లాలలో పత్తి ప్యాకేట్లు దొరకలేదని కొరత వల్ల రైతు కేవలం రెండు పత్తి ప్యాకెట్లు మాత్రమే ఇస్తున్నారని వివి ధ పత్రికలలో వార్తలు వచ్చాయన్నారు, అయితే ఆయా జిల్లాలలో కొన్ని ప్రాంతాల రైతులు ఒక్క కంపెనీకి చెందిన ఒకే రకం పత్తి విత్తనాలే కావాలంటుండడంతో అవి సరిపోను లేకపోవడంతో రైతులందరికి అందాలనే ఉద్దేశంతోమాత్రమేరైతుకురెండుచోప్పున విత్తన ప్యాకెట్లు ఇవ్వడం జరిగింది తప్పితే ఆ జిల్లాల్లో పత్తి విత్తనాలకు ఏలాంటి కోరత లేదని మంత్రి స్పష్టంచేశారు. రైతులను వరుసగా ఉంచే సందర్భంలో వారి మీద లాఠి ఛార్జి జరిగిందని ప్రతిపక్ష నాయకులు ప్రచారం చేయడం రైతుల నైతికస్థైర్యాన్ని దెబ్బతీయడమేనని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయవిశ్వవిద్యాలయశాస్త్రవేత్తలు చెప్పినట్లు మేలైన యాజమాన్యపద్ధతులు పాటిస్తే అన్ని రకాల పత్తి హైబ్రిడ్‌లు అటు ఇటుగా ఒకేరకంగా దిగుబడి వస్తుందని, రైతు సోదరులు కేవలం ఒక కంపెనీ, ఒక రకానికి చెందిన విత్తనాల కోసమే పోటిపడకుండా మార్కెట్లో అందుబాటులో ఉన్న గత సంవత్సరాలలో మంచి దిగుబడులు ఇచ్చిన రకాలను కూడా కొనుగోలు చేయాల్సిందిగా మంత్రి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఈ ఖరీఫ్ కాలంలో నకిలీవిత్తన విక్రేయించిన వారిపై కూడా ప్రభుత్వంకఠినంగా వ్యవహరిస్తోందని,ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్లకు, ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడమేకాకుండా ఇప్పటికే 188.29 క్వింటాళ్ళ 2.49 కోట్ల విలువగల నకిలి పత్తివిత్తనాలు స్వాధినం పరుచుకొని 33 మందిని అరెస్టు చేయడం చేసినట్లు మంత్రి వెల్లడించారు.

**పచ్చిరొట్ట విత్తనాలు**

గత ప్రభుత్వం 2023 వానాకాలంలో 66.81 కోట్ల సబ్సిడీ విలువతో 1.27 లక్షల క్వింటాళ్ళ పచ్చిరొట్ట విత్తనాన్ని పంపిణీ చేయగా, గత ఏడాది మే 29వరకుకేవలం 24,898 క్వింటాళ్ళు మాత్ర మే రైతులకు అందజేశారనితుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 2024వానాకాలంలో తమ ప్రభుత్వం 109.15 కోట్ల సబ్సిడి విలువతో 1.95 లక్షల క్వింటాళ్ళ పచ్చిరొట్ట విత్తనాన్ని పంపిణీచేయాలని ప్రతిపాదించి, ఇప్పటి వరకు 79,261క్వింటాళ్ళుపంపిణీ చేశామని, అందులో 54,162 క్వింటాళ్ళు రైతులు కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. గత ఏడాదితో పోల్చుకుంటే 29వేల క్వింటా ళ్ళు ఈపాటికే అధికంగా రైతులకు అందించగలిగామని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్న కూడా ఎన్నికల కమిషన్ అనుమతులు తీసుకొని టెండర్ల ప్రక్రియ పూర్తిచేయడమే కాకుండా, గత ప్రభుత్వ హయాంలో పంపిణీదారులకు చెల్లించకుండా ఉన్న బకాయిలను ప్రభుత్వం విడుదల చేసి సరఫరాలో ఎక్కడా ఆటంకాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.అయినప్పటికికొన్నిసొసైటిల పరిధిలలో రైతులకు ముందుగానే విత్తనాలు వచ్చాయని, వస్తున్నాయని కొంతమంది సమాచారం ఇచ్చి గందరగోళ పరిస్థితులకు కారణమైనట్లు తెలిసిందన్నారు. రైతులలో గందరగోళ పరిస్థితులను సృష్టించే వారిని ఇకముందు ఉపేక్షించదని, ఎరువులకు సంబంధించి కూడా ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుందని మంత్రి తెలిపారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించే విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని,అయినప్పటికీ ప్రతి పక్షాలు అనవసర రాద్దంతం చేయడం హాస్యస్పదమని, ఇందుకు కింద ఇచ్చిన లెక్కలే నిదర్శనమని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

**ఎరువుల లభ్యత (మెట్రిక్ టన్నులు):**

| ఎరువుల రకాలు | గత ఏడాది మే 29నాటికి | ఈ ఏడాది మే 29 నాటికి |
|---|---|---|
| యూరియా | 4,24,160 | 6,88,382 |
| డి.ఏ.పి | 1,19,888 | 79,376 |
| కాంప్లెక్స్ | 3,76,897 | 4,21,718 |
| ఎం.ఓ.పి | 8,729 | 24,984 |
| ఎస్.ఎస్.పి | 17,993 | 13,997 |
| మొత్తం | 9,47,667 | 12,28,457 |

# బహిరంగంగా విత్తనాలు, ఎరువుల వివరాలివ్వండి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఖరీప్ సీజన్‌లో రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువుల వివరాలను బాహటంగా ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పత్తి విత్తనాల కోసం, పచ్చిరొట్టె విత్తనాల కోసం రైతుల ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో విత్తనాలు, ఎరవుల కోరత లేదని రైతులకు ప్రభుత్వం వెంటనే భరోసా కల్పించాలని కోరింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ బుధవారం వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందర్‌రావు, డైరెక్టర్ బి.గోపికి వేర్వేరుగా లేఖ రాశారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో 24 లక్షల పత్తి విత్తనాల ప్యాకెట్లు అవసరం కాగా, ఒక రైతుకు తన ఆధార్‌కార్డు పై కేవలం రెండు పాకెట్స్ మాత్రమే సరఫరా చేస్తున్నారని, ఒక ఎకరాకు మాత్రమే ఈ రెండు పాకెట్స్ సరిపోతాయని, మిగతా ఎకరాలలో విత్తనాలు ఎట్లా అని తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆమె లేఖలలో వివరించారు. అదేవిధంగా 659 రాశి పత్తి రకం విత్తనం అందుబాటులో లేదని ఈ సమస్యలన్నింటిపై రైతులు ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తోందని తెలిపారు. వచ్చి రొట్టె విత్తనాలు కూడా దొరకటం లేదని రైతాంగం ఆందోళనలో ఉందని, కొన్ని జిల్లాలలో నకిలీ విత్తనాల ఎరువుల అక్రమ రవాణాను అమ్మకాలను అరికట్టటానికి నకిలీ విత్తన సరఫరాదారులపై దాడులు చేసి కేసులు నమోదు చేసినప్పటికీ వీరిపై కఠినమైన శిక్షలకు గురిచేసే విధంగా పిడి యాక్ట్ లాంటి చట్టాలను ప్రయోగించడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పశ్య పద్మ లేఖలో పేర్కొన్నారు. వ్యవసాయ సీజన్‌కు సంబంధించి విత్తనాల ఉత్పత్తి, జిల్లాల అవసరాలు ఒక ప్రణాళిక రూపంలో ఏప్రిల్ నెలలోనే విడుదల చేయాల్సి ఉందని, ఖరీఫ్ సీజన్‌కు అందుబాటులో ఉంచిన విత్తనాల, ఎరువుల వివరాలను బాహటంగా ప్రకటించాలని రైతులందరికీ సమాచారం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేస్తోందని పశ్య పద్మ అన్నారు. ఈ వివరాల ఆధారంగా రైతులు ఆందోళన పడకుండా విత్తనాలు ఏ మేరకు అందుబాటులో ఉన్నాయో ఒక అంచనాతో సాగు చేసుకోవటానికి అవకాశం ఉంటుందని, వ్యవసాయ అధికారులు కూడా విస్తృతంగా భూములను బట్టి ఏ తరహా పంటలు వేసుకోవాలో ప్రచారం చేయాలని, అసలు విత్తన ఉత్పత్తి ఎంత ఉందో సమాచారాన్ని బహటంగా ప్రకటించాలని కోరారు. విత్తన కంపెనీలు, డీలర్లు విత్తన కొరతను సృష్టించి రైతులను నాసిరకం విత్తనాలు కొనేలా చేస్తున్నారన్నారు. బిటి పత్తి విత్తనాల అమ్మకాల మీద రాయల్టీ ద్వారా ఒకే బహుళ జాతి కంపెనీ ప్రతి సంవత్సరం రూ. 400 కోట్లు సంపాదిస్తోందని, కానీ నాణ్యతతో పాటు కృత్రిమ కొరతపై జవాబుతారితనం మాత్రం వహించటం లేదని పేర్కొన్నారు. నాసిరకం నకిలీ విత్తనాలు సరఫరా చేసిన కంపెనీలు విధిగా విత్తనాలకు సంబంధించిన నష్టపరిహారమే కాక సాగు ఖర్చులు రైతు కుటుంబ ఖర్చులు కూడా నష్టపరిహారంగా ఇవ్వటానికి వీలుగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు ఆందోళనకు గురికాకుండా అన్ని జిల్లాలలో విత్తనాలను, ఎరువులను అందుబాటులో ఉంచాలని పశ్య పద్మ లేఖలో అధికారులను కోరారు.

# డొనేషన్ల దోపిడీ పట్టదేమి?



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డొనేషన్ల పే రుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, బి‘కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రిని కోరిం ది. ఈమేరకు ఎఐఎస్ఎఫ్ అధ్యక్ష,కార్యదర్శి మణికంటరెడ్డి, పుట్ట లక్ష్మ ణ్ మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఛాంబర్‌లో ప్రొఫెసర్ లింబాద్రిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మణికంటరెడ్డి, పుట్ట లక్ష్మ ణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు అధిక ఫీజుల దోపిడి చేస్తున్నాయని, యాజమాన్యకోట సీట్లను లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నారని విమర్శించారు. డిమాండ్ ఉన్న కోర్సులకు ఇష్టానుసారంగా భారిగా ఫీజులు పెంచుతున్నారని, సీట్లను బ్లాక్ లో పెడుతూ మెరిట్ విద్యార్థులకు ఇవ్వకుండా లక్షల రూపాయల ఫీజులను చెల్లించేవారికే సీట్లు కేటాయిస్తున్నారని విమర్శించారు. ఇంజనీరింగ్ కళాశాలలు యాజమాన్య సీట్ల భర్తీలో భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారని, అనేక ఇంజనీరింగ్ కళాశాలలు నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, రాష్ట్ర నాయకులు ఎండి అన్వర్, హరీష్, నరేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రస్తుత ఏడాదిలో కొత్తగా లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగులోకి తీసకురావాలని ఉద్యాన వన శాఖ లక్ష్యంగా నిర్దేశించుకున్నది.ఈ మేరకు రాష్ట్రంలో ఆయిల్ పామ్2024/25 సాగు ప్రణాళికను ఉద్యాన శాఖ సిద్ధం చేసింది. ఈ ఏడాది ఆయిల్ పామ్ సాగును మరో లక్ష ఎకరాలకు విస్తరించడంతో పాటు రైతులకు మరిన్ని ప్రోత్సాహకాల అందించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారులకు ప్రభుత్వం దిశా నిర్దేశనం చేసింది. ఆయిల్ పామ్ పంటకు సరైన ధర ఇతర ప్రోత్సహాలను ఇచ్చేందుకు గాను ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక కమిటిని ఏర్పాటు చేయడంతో పాటు ఆ కమిటీ అందజేసిన నివేదికను ఉద్యాన శాఖ కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. ఉద్యానవన సంచాలకులు హైదరాబాద్‌లో ఉన్నతాధికారులు, ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. జిల్లా ఉద్యాన అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి 2024/25 సంవత్సరానికి సంబంధించి ఆయిల్ పామ్ సాగు ప్రణాళికపైన శానిర్దేశం చేశారు. ప్రధానంగా 6 అంశాలను ఖచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకుని ఆయిల్ పామ్ సాగు రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడంతో వారికి నమ్మకం కల్పించేలా సాగు ప్రణాళికలను అధికారులు సిద్ధం చేశారు.

**ఆయిల్ పామ్ సాగుతో తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలిక లాభాలు**

రాష్ట్రంలో పెరిగిన పంట మార్పిడి ఆవశ్యకత దృష్ట్యా, తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలక లాభాలను ఇచ్చే ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అనేక రకాల రాయితీలనిఇస్తూ పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో 1992/93 నుండి 2023/24 వరకు వివిధ పథకాల కింద 2.03 లక్షల ఎకరాలను ఆయిల్ పామ్ సాగు కిందకు తీసుకువచ్చింది. ఈ మొత్తం విస్తీర్ణం లో, 2021/22 సంవత్సరం నుండి ఎడిబుల్ ఆయిల్స్ కోసం జాతీయ మిషన్ ఆయిల్ పామ్(ఎన్ఎంఇఎం– ఒపి) పథకం కింద తీసుకువచ్చిన విస్తీర్ణం 1.56 లక్షల ఎకరాలు కాగా, 202425 సం. కి గాను, మరో లక్ష ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు ప్రణాళికలను అధికారులు సిద్ధంచేశారు. ఈ లక్ష ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు సరిపడా మొక్కలు ఆయిల్ పామ్ నర్సరీ లలో సిద్ధం చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 18వేల రైతులు 67500 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు నిమిత్తం నమోదు చేసుకున్నారు. ఆయిల్ పామ్ నర్సరీలను నిరంతరం పర్యవేక్షించి, రైతులకు నాణ్యమైన మొక్కలు మాత్రామే అందేలా తగు చర్యలు తీసుకోవలని సమావేశం ఆదేశించింది. ఇందులో ప్రధానంగా నర్సరీ నిర్వహణ లో ఐఎంపిఆర్ సూచించిన నాణ్యతా ప్రమాణాలు విధిగా పాటించడంతో పాటు నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధతోనాణ్యత లేని మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించి, చీడ పీడలు రాకుండా అన్నీ చర్యలు తీసుకోవాలని అధికారులు ఆయిల్ పామ్ కంపెనీలకు సూచించారు. మొక్కల వయస్సు, పెరుగుదలను బట్టి ఒక క్రమ పద్ధతిలో అమర్చుకుని రైతులకు నాణ్యమైన మొక్కలను మాత్రమే సరఫరా చేయలనిఉద్యాన వన శాఖ తెలిపింది. రైతులకు ఈ పథకంపట్ల నమ్మకం ఏర్పడేలా అన్ని కంపెనీలు తమ ఫ్యాక్టరీ జోన్‌లలో ఆయిల్ మిల్లులను ఏర్పాటు చేయడానికి స్థలాలను సేకరించి, తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది.

# ఒడిశ్శాకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

రాహుల్ గాంధీతో కలిసి ఎన్నికల ప్రచారం

**ప్రజాపక్షం / హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఒరిస్సాలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి భువనేశ్వర్‌కు చేరుకుంటారు. గురువారం ఉద యం భువనేశ్వర్ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి భద్రలోక్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. గత వారం రోజులపాటు పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్ కోట్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ప్రచారం నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు చేరుకున్న డిప్యూటీ సిఎం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. తుది దశకు చేరుకున్న రాష్ట్ర గీతంపై సమీక్ష చేశారు. పంజాబ్ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి ముందు ఒరిస్సా, కేరళ రాష్ట్రాల్లోను డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ప్రచారం నిర్వహించారు. ఓవైపు ప్రచారం నిర్వహిస్తూనే మరో వైపు రాహుల్ గాంధీ, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేల భారీ సభలను సమన్వయం చేస్తున్నారు. ఆ రాష్ట్రాల్లో స్థానిక నేతలతో కలిసి మీడియా సమావేశాలు నిర్వహించారు. పార్టీ సోషల్ మీడియా విభాగాలు పనిచేయవలసిన తీరుపైన పార్టీ శ్రేణులను ఆయన సమాయత్తం చేస్తున్నట్లు, అందరికీ దిశానిర్దేశనం చేస్తున్నట్టు డిప్యూటీ సిఎం కార్యాలయం ఒక ప్రకటనలో వివరించింది.

# కార్మికవర్గం శ్రమదోపిడీకి కుట్ర

కేంద్ర లేబర్ కోడ్‌లను తెలంగాణ ప్రభుత్వం అమలు చేయొద్దు

ఎఐటియుసి డిమాండ్




**ప్రజాపక్షం/ హైదరాబాద్:** స్వాతంత్ర్యానికి పూర్వం, తర్వాత అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను పూర్తిగా సవరించి పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు మేలు చేసేందుకు తీసుకువచ్చిన 4 కోడ్‌లను రద్దు చేయాలని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. దేశవ్యాపితంగా 10 కార్మిక సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు యధావిధిగా 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 27 సార్లు దేశవ్యాపిత సమ్మెలు చేసి కార్మికవర్గం ఆందోళనలు, ప్రదర్శనలు, నిరసన కార్యక్రమాలు ఒక ప్రక్క కొనసాగుతుంటే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికలో ప్రకటించటం సిగ్గచేటు అని ఆయన విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తామన్న ప్రకటనను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరింహకుని బహిరంగంగా కార్మిక వర్గానికి క్షమాపణ చెప్పాలని, లేనట్లయితే ఎఐటియుసి ఇతర కార్మికసంఘాలతో కలిసి పెద్దఎత్తున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. దేశవ్యాపితంగా వివిధ రాష్ట్రాలలో ఉన్న బిజెపి ప్రభుత్వాలు కూడా ఈ 4 లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు సిద్ధంగా లేవని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అమలు చేస్తామని ప్రకటించటం కార్మికవర్గాన్ని మోసం చేయడమేనన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కనీస పరిజ్ఞానం లేకుండా 4 కోడ్‌లను అమలు చేస్తామనడం 47 కోట్ల కార్మికవర్గం నోట్లో మట్టికొట్టడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక కోడ్‌లు ప్రకారం యాజమాన్యాలకు పండుగ, కార్మికులకు దండుగా అనే పద్ధతిలో ఉన్నాయని, ప్రస్తుతం ఉన్న 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచ టం ద్వారా కార్మికుల ప్రత్యక్ష శ్రమను యాజమాన్యాలు దోచుకునేందుకు కుట్ర జరుగుతున్నదని ఆయన అన్నారు.

# ‘అపెక్స్’ బ్యాంక్ జిఎం వాణిబాల సస్పెన్షన్

వాణిబాల కనిపించడంలేదని పోలీసులకు అధికారుల ఫిర్యాదు

రూ.200 కోట్లతో బిచాణ ఎత్తివేసిన వాణిబాల భర్తకు చెందిన ఫైనాన్స్ సంస్థ

డిపాజిట్ల డబ్బులో మూడు కంపెనీలు నెలకొల్పిన వైనం

ఇంకా పరారీలోనే వాణిబాల కుటుంబం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డిపాజిట్ దారులకు రూ. 200 కుచ్చుటోపి పెట్టి బిచాణా ఎత్తివేసిన శ్రీప్రియాంక సంస్థ కేసులో కొత్త కోణం వెలుగు చూసింది. తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్ జనరల్ మేనేజర్ వాణిబాలను అధికారులు సస్పెండ్ చేశారు.ఈమె భర్త మేక నేతాజి, కుమారుడు మేక శ్రీహర్షలు డైరెక్టర్లుగా ఉన్న ప్రియాంక సంస్థ బిచారణ ఎత్తివేయడంతో వీరితో పాటు వాణిబాల కూడా పరారీలో ఉన్నారు. తాను పని చేస్తున్న బ్యాంక్‌కు వచ్చే డిపాజిటర్లను తన భర్త నెలకొల్పిన ప్రియాంక సంస్థకు తరలించేది వాణిబాల. దీంతో వాణిబాలపై కూడా సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. పక్షం రోజుల నుంచి వాణిబాల విధులకు హాజరుకాకపోవడం, నోటీసులు అందించిన సమాదానాలు పంపకపోవడంతో క్రమశిక్షణ చర్యగా ఆమెను సస్పెండ్ చేస్తూ బ్యాంక్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. విజయవాడకు చెందిన వాణిబాల తండ్రి విష్ణు వర్ధన్‌రావు కూడా ఇదే బ్యాంక్‌లో పనిచేయడం వల్ల వాణిబాలపై బ్యాంక్ అధికారులు, సిబ్బంది నమ్మకం పెంచుకున్నారు. ఈ నమ్మకాన్ని ఆమె క్యాష్ చేసుకుని తన భర్త స్థాపించిన ప్రియాంక ఫైనాన్స్ కంపెనీలో పెట్టుబడులు పెట్టించింది. తన సొంత బ్యాంక్ ఉద్యోగులు వారి బంధువులు ప్రియాంక సంస్థలో రూ.200 కోట్లకుపైగా డిపాజిట్లు పెట్టారు. 40 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ప్రియాంక సంస్థ డిపాజిట్ దారులకు సక్రమంగానే ఏడాదికి 18 శాతం వడ్డీ చెల్లిస్తూ వచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరి వరకు కూడా ఖాతాదారులకు సక్రమంగా వడ్డీ చెల్లించారు. మార్చి నుంచి వడ్డీ చెల్లించడం మానివేయడంతో డిపాజిట్ దారులు కార్యాలయానికి వచ్చి చూడగా తాళం వేసి ఉంది. అలాగే సైదాబాద్‌లోని వారింటికి వెళ్లి చూడగా తాళం వేసిఉంది. తాము మోసపోయామని గ్రహించిన బాధితులు సిసిఎస్ పోలీసులకు ఈ నెల 20న ఫిర్యాదు చేయడంతో వాణిబాల, ఆమె భర్త నేతాజి, కుమారుడు శ్రీహర్షలపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

**డిపాజిటర్ల సొమ్ముతో మూడు కంపెనీలు..**

ప్రియాంక సంస్థలో డిపాజిట్ రూపంలో వచ్చిన డబ్బుతో వాణిబాల, నేతాజి దంపతులు 15 ఏళ్ల క్రితం మూడు కంపెనీలు నెలకొల్పినట్లు తెలిసింది. ప్రింటింగ్ ప్రెస్‌లకు సిరాను సరఫరా చేసేవాళ్లని తెలిసింది.సిరా తయారు చేసేందుకు కావాల్సిన ముడి సరుకుని వీరు దిగుమతి చేసుకునేవారు. తయారు చేసిన సిరాను ఎపి, తెలంగాణ రాష్ట్రాలలోని ప్రింటింగ్ ప్రెస్‌లకు సరఫరా చేసారని తెలిసింది. విజయవాడలో ఒక కంపెనీ, తెలంగాణలో రెండు కంపెనీలు వీరు నెలకొల్పినట్లు సమాచారం. అలాగే ఆయా జిల్లాలలో వ్యవసాయ క్షేత్రాలు, ఫ్లాట్లు ఖరీదు చేసినట్లు సమాచారం.

ప్రజాపక్షం
గురువారం, మే 30

# ఎన్నికల క్షేత్రంలో రాజ్యాంగం

భారతదేశ స్వాతంత్ర్యానంతర ప్రజాస్వామిక ఎన్నికల ప్రస్థానంలో తొలిసారి రాజ్యాంగం పోటీదారుగా నిలబడింది. జూన్ 1వ తేదీ ఏడవ, చివరి విడత పోలింగ్‌తో 18వ సార్వత్రిక ఎన్నికలు పరిసమాప్తమవుతాయి. జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపులో ఏ పార్టీ లేదా కూటమి గెలు పొందినప్పటికీ అసలు విజేత రాజ్యాంగమే అవుతుంది. రాజ్యాంగ పత్రం గూర్చి సామాన్య ప్రజలకేంతెలుసు – రాజ్యాంగ నిర్మాతగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు ఆయన పుట్టిన రోజున అభిమానంకొద్దో, ఓట్లు అవసరంకొద్దో, అవకాశవాదంతో ఒక పూలమాల వేసి దండంపెట్టే రాజకీయ గణమే ఎక్కువగా ఉన్నదేశంలో పార్లమెంటరీ బండ మెజారిటీతో తమ కురచబుద్ధులు నెరవేర్చుకోవాలనుకున్న పార్టీ అధినేతలకు రాజ్యాంగం పెద్ద సవాలుగా ఎదురునిలిచింది. సామాన్యులు అమాయకులుగా కనిపించినా రాజ్యాంగ చైతన్యం ఎంతలోతుగా ఉందో వెల్లడైంది. రాజ్యాంగం అందులోని ఆదేశాల స్ఫూర్తితో పరిపాలన కోసం ఆమోదించే ఇతర చట్టాలవంటిది కాదని, తమ ప్రాథమిక హక్కులకు రక్షాకవచమన్న గ్రహింపు ప్రజల్లో ఉంది. అందువల్లనే రాజ్యాంగ మౌలిక సూత్రాలకు మితవాదశక్తులు ఎసరుపెట్టే ప్రయత్నం చేసినపుడల్లా ప్రజల అండతో ప్రజాస్వామిక శక్తులు ఆ దాడిని వమ్ముచేశాయి.

స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ రచన నాటినుండే ఈ రాజ్యం స్వభావం, లక్షణంపై లోతైన, తీవ్రమైన చర్చలు జరిగాయి. మన దేశం నుండి పాకిస్థాన్ మతం ప్రాతిపదికపై బ్రిటిష్ వారి సహాయంతో విడిపోయినందున భారతదేశాన్ని హిందూమతరాజ్యం చేయాలని హిందూ మహాసభ, ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంస్థలు, నాయకులు, కాంగ్రెస్‌లోని మితవాదులు రాజ్యాంగ నిర్ణాయకసభలో గట్టి ప్రయత్నాలు చేశారు. అయితే గాంధీ–నెహ్రూ నాయకత్వంలోని జాతీయవాదులు దేశ ఐక్యత దృష్ట్యా భిన్నత్వంలో ఏకత్వాన్ని బలపరుస్తూ లౌకిక, ప్రజాతంత్ర రాజ్యాంగాన్ని ఈ దేశానికి ఇచ్చారు. దానికి తూట్లు పొడిచే, ధ్వంసంచేసే అవకాశాలకోసం హిందూ మతోన్మాదశక్తులు ఆనాటి నుంచే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. రాజ్యాంగానికి ఎన్ని సవరణలైనా చేసుకోండి, దాని పీఠికలోని మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం పార్లమెంటుకు లేదని సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం కేశవానంద భారతి కేసులో స్పష్టంచేయటం ఆ శక్తుల గొంతులో వెలక్కాయ పడినట్లయింది. అయినా హిందూత్వశక్తులకు దొరికిన తొలి అవకాశంలో –1998 లో వాజ్‌పేయి ఎన్‌డిఎ ప్రభుత్వం రాజ్యాంగ సమీక్ష కమిషన్‌ను నియమించింది. దాని నివేదిక వచ్చే లోపు ఆ ప్రభుత్వ పడిపోయింది. 2014 లో నరేంద్రమోదీ నాయకత్వంలో బిజెపికి దాదాపు మెజారిటీతో ఎన్‌డిఎ రెండవ ప్రభుత్వం అధికారంలోకి రావటం, కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీల రూపంలోని లౌకిక శక్తులు తమ స్వయంకృతా పరాధాలవల్ల బలహీనపడటంతో బిజెపి– ఆర్‌ఎస్‌ఎస్ వాదుల కన్ను తమ ఆది ఎజండా–హిందూ రాష్ట్రపై పడింది. ఆ ధైర్యం సమకూర్చుకోవటానికి పదేళ్లు కావల్సివచ్చింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో '400లకుపైగా సీట్లు గెలుపును' లక్ష్యంగా ప్రకటించింది. ఎందుకయ్యా అంత బండ మెజారిటీ అని ప్రశ్నిస్తే హిందూ రాజ్య స్థాపనకు రాజ్యాంగాన్ని మార్చటానికని కొందరు నాయకులు తమ కడుపులో మాట బయటపెట్టారు. ఇది కార్చిచ్చులా దేశం నలుమూలలకు వ్యాపించింది. అంతకుముందే మోదీ నియంతృత్వాన్ని నివారించేందుకు, ప్రజాస్వామ్యాన్ని , రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు బిజెపిని ఓడించాలని ప్రతిపక్ష 'ఇండియా' కూటమి పార్టీలు దేశ ప్రజలకు పిలుపు ఇచ్చాయి. ఎన్నికల తొలి దశలు గడిచాక రాజకీయ చర్చ రిజర్వేషన్‌ల రక్షణపైకి మళ్లింది. బిజెపి డిఫెన్స్‌లో పడింది. రాహుల్‌గాంధీ తదితరులు రాజ్యాంగ గ్రంథం చేతబట్టి ప్రతి బహిరంగ సభలో దాని మనుగడకు బిజెపి నుంచి తలెత్తిన ప్రమాదాన్ని వ్రేలెత్తి చూపారు. ఆ చర్చను పక్కదారిపట్టించేందుకు తాము మతపరమైన రిజర్వేషన్‌లకు వ్యతిరేకమంటూ ప్రధానమంత్రి మొదలు వీధినాయకులవరకూ చర్చను ముస్లింలకు వ్యతిరేకంగా మళ్లించే ప్రయత్నం చేశారు. ప్రధానమంత్రి దిగజారి హిందువుల ఆస్తులు, మంగళసూత్రాలు లాక్కొని ముస్లింలకు పంచుతారని, అయోధ్య రామాలయాన్ని కూల్చి బాలరాముణ్ణి తిరిగి గూడారంలో పెడతారని 'ఇండియా' కూటమి నాయకులపై నిందారోపణలకు దిగారు. రాజ్యాంగంపై చర్చ నుండి దృష్టి మరల్చటానికి ఎన్ని కుయుక్తులుచేసినా రాజ్యాంగం నిటారుగా ప్రజల మనసుల్లో నిలబడింది. తాను దైవాంశ సంభూతుడినని చెప్పుకునేంతవరకు నరేంద్రమోదీ దిగజారారు. కాని రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు – వారి ప్రతినిధులే పాలకులు.

# ప్రధానిగా పరమాత్మ ప్రతినిధి!?


సంగిరెడ్డి హనుమంత రెడ్డి
9490204545

ప్రజాస్వామ్య దేశాలలో పార్లమెంటు సభ్యులు, ప్రధానులు, అధ్యక్షులు ప్రజా ప్రతినిధులు. మన ప్రధాన సేవకుడు మోదీ పరమాత్మ ప్రతినిధి. ఒక వార్తా సంస్థతో, నేను జీవసంబంధితుణ్ణి కాదు. దైవదత్తశక్తివంతుణ్ణి. దేవుడు నన్ను ప్రత్యేక పనికి పంపాడు. 2047కు వికసిత భారత్ సాధించేవరకు ఆయన నన్ను పిలవడు. అప్పటి దాకా నేనే ప్రధానిని అన్నారు. తనతో ప్రదర్శన నటప్రచారం చేసి, తనకే పుట్టలేదంటే అమ్మ హీరాబెన్ ఆత్మ ఎంత బాధపడిందో! 2047కు భారత్ వికసించకపోతే మోదీయే ప్రధానిగా కొనసాగుతారా?

జీవిత, పాలన కాలాలను వేలవేల ఏళ్ళుగా పురాణాల్లో కవులు అతిశయించారు. పురాణ రచనాకాలంలో మనిషి ఆయుస్సు తక్కువ. 1947 లో మనకు స్వాతంత్ర్యం వచ్చినపుడు భారతీయుని సగటు జీవితకాలం 32 ఏళ్ళు. ఇప్పుడు 70. ఐక్యరాజ్యసమితి లెక్కలో ప్రపంచ మనిషి సగటు ఆయుస్సు 73 ఏళ్ళు. అభివృద్ధిచెందిన విజ్ఞాన, వైద్య శాస్త్రాలు, ఆధునిక యాంత్రిక పరిశోధన, పరీక్ష, చికిత్స సాధనాలు, పద్ధతులు మనిషి ఆయుస్సును పెంచాయి. వందేళ్ళ వరకు దేశాన్ని ఏలుతాననడం మోదీ ఎన్నికల ప్రచార అతిశయోక్తి. దేవుడు పంపాడన్న పిచ్చి మాటకు ఆధ్యాత్మికులు కూడా ఆశ్చర్యపోతున్నారు.

పురుషహంకార, ఆధిపత్య వర్ణ, వర్గ పురాణకర్తల ప్రవచనాల ప్రకారం పౌరాణిక కల్పనలను, దేవున్ని, దేవదూతలను ప్రశ్నించరాదు, సమస్యలను పరిష్కరించమని అడగరాదు. ఆనాటి ఆచారాలైన కుంతీసంతానం, ద్రౌపది దాంపత్యాలను ప్రశ్నించకుండా అవి వరాలని సర్దుకున్నాం. నేటి మోదీ దేవదూత సూత్రాన్ని నమ్మి ఆయన్ను ఏమీ అడగరాదు. రైతులతో సహా ప్రజలకు మోదీ బాధ్యుడు కాడు. దేవునికే జవాబుదారు. ఏమి, ఎలా, ఎవరికి ఇవ్వాలో, ఇవ్వరాదో దేవుడే మోదీకి చెపుతాడు. సూచనలు, మార్గదర్శకాలు ఇస్తాడు. మోదీ పార్లమెంటులో రాజదండంతో అలాగే చేస్తారు. దేవునికే సమాధానం చెప్తారు. ప్రజలకు చెప్పరు. ఆయన వారి ప్రతినిధే కాదు. మోదీని వైదిక దేవుడు పంపాడు. ముస్లింలు, క్రైస్తవులు, అవిశ్వాసులు ఆయన్ను ఏమీ అడగరాదు. దేవదూతపై వామపక్షీయులు గొడవచేస్తారని మోదీ అన్నారు. ఈ విషయాన్ని వారు పట్టించుకోలేదు. దీంతో ప్రజాసమస్యలు పక్కదారిపట్టడం వారికి ఇష్టంలేదు.

నెహ్రూ తనను ప్రథమ సేవకునిగా ప్రకటించారు. కొంతమేరకు ఆయన అలా ప్రవర్తించారు. అనుకరణల అసత్యాల చక్రవర్తి మోదీ నేను ప్రధాన సేవకుడినన్నారు. దేవదూత ప్రజల ప్రధాన సేవకుడయితే దేవునికే అవమానం. మోదీ తన దైవత్వ సూత్రీకరణను చాలా సార్లు చేశారు. లేని రైల్వేస్టేషన్ లో చాయ్ అమ్మానన్నారు. బాల్యంలో మొసలితో పోరాడానన్నారు. 2013 కేదార్నాథ్ వరదల్లో భక్తులను దివ్యశక్తితో రక్షించి రాత్రికిరాత్రి తిరిగొచ్చారు. కనీసం మాతృభూమి గుజరాత్‌లో నేటి ఘోర ప్రమాదాలను దేవదూత ఎందుకు ఆపరు? బిజెపికి ఓటేసినవారికి తన సుకర్మల పుణ్యం (మానభంగ, నరమేధాలు పుణ్యాలా?) దక్కుతుందని ఇటీవల ప్రచారాలలో అన్నారు. దైవత్వానికి ఓటేయడానికి వైదికవాదులు మొగ్గుచూపుతారని మోదీ నమ్మకం.

దొంగ బాబాలందరూ తప్పుదారి పట్టించే తమ మోసపూరిత కొత్త పేర్లకు ముందు భగవాన్, పేర్ల తర్వాత స్వామి అన్న విశేషణాలను తగిలిస్తారు. నేను నాస్తికునిగా మారడానికి కారణమైన గంగిరెడ్డి తన పేరును మోక్షానంద స్వామిగా మార్చుకున్నాడు. సరస్వతేంద్రులందరూ స్వాములే. భగవాన్ సత్యసాయి, భగవాన్ (ఇటీవలే) రాందేవ్ మరి కొన్ని ఉదాహరణలు. నీకిది నాకది సూత్ర ఆచరణలో తన సహాయసహకారాలతో, మోసాలతో ఎదిగిన రాందేవ్ భగవాన్ అయితే భగవాన్ల తయారీదారు మోదీ బృహత్ భగవాన్, కనీసం దైవ ప్రతినిధి, ప్రవక్త అయినా కావాలి! గొర్రెలుగా దిగజారిన సంఘ్ భక్తులకు ఇది ప్రాయోజిత ప్రచార అవసరం.

దేవుడు దుష్టశిక్షణకు మన దేశంలోనే అవతారాలెత్తాడు. ఇతర దేశాల్లో దేవుడవతరించలేదు. దుష్టులు, పాపులు ఇక్కడే ఉన్నారా? దేవదూత మోదీ అందుకే ఇటొచ్చారా? పరమతస్తులను, తనతో ఏకీభవించని సొంతపార్టీవారిని, తోటి నాయకులను, ప్రశ్నించిన తన అభివృద్ధికారకులను, గురువులను పక్కనపెట్టడం, అవమానించడం పాపం కాదా? ఈ పాపులు శిక్షార్హులు కాక దేవదూతలు, ప్రాణ ప్రతిష్టాపకులు, పూజారులు ఎలా అవుతారు?

మనుషులు, ఒంటరిగా సాధ్యంకాకపోతే, గుంపుకట్టి సమస్యలను పూర్తిగా పరిష్కరించుకుంటారు. దేవుడు కొన్నిసార్లు ప్రత్యక్షంగా, కొన్నిసార్లు అవతారిగా లోక సమస్యల పరిష్కారానికి దిగాడు. ఆయన తొలిసారే సమస్యను శాశ్వతంగా తొలగించాలి. అలా కాలేదు. దేవుడు పదిసార్లు అవతారం ఎత్తాల్సి వచ్చింది. అది



సాధనాలులేని కాలం అనుకుందాం. సకల సౌకర్యాలు, అధికార, ఆర్థిక, అంగ, ఉపాంగ దైవబలాలున్న మోదీ అన్ని సమస్యలను హాంఫట్ అని ఎందుకు రూపుమాపలేదు? 2047 లోగా భారత్ ను స్వర్గతుల్యం చేయమని దేవుడు ఆయన్ను 2024 లోనే తన దూతగా పంపాడా? ఇంతకుముందు అనేక సందర్భాల్లో పలు రూపాల్లో దేశమంతా తిరిగి మౌనముద్రలో, విశేష ధర్మికార్యాలతో భగవదేచ్ఛను నెరవేర్చారు. రామాలయం కట్టారు. ప్రధాన పూజారి పాత్ర పోషించారు. భార్యలేకుండానే బాలరామునికి ప్రాణంపోశారు. నేటి మోదీయం దైవ దౌత్యమా? స్వీయరక్షణకెత్తిన పదకొండవ అవతారమా!?

రూ.15 లక్షల నల్లధనాన్ని ప్రజలకు పంచకపోవడం, పెద్ద నోట్ల


జర్మని రక్షకునని వాగ్దానిస్తున్న హిట్లర్


వైదికమత మాంత్రిక పూజారిగా మోదీ

రద్దు, కేంద్ర ఆదాయాన్ని పెంచుకునే సెస్సులు, సర్చార్జీలు, రాష్ట్రాల ఆదాయాలకు గండికొట్టే వస్తుసేవల పన్ను, రాష్ట్రాలపై కేంద్ర ఖర్చులను రుద్దడం, నిరుపాధి, ఆకలి, పేదరికం, ద్రవ్యోల్బణం, అధిక ధరలు, అమానవీయత, సంపన్నుల అభివృద్ధి, సామాన్యుల ఇబ్బందులు, నల్ల చట్టాలు, ప్రజాస్వామ్యం రాజ్యాంగ ఉల్లంఘనలు, సామాజిక కాషాయీకరణ, దేశ మతపర చీలిక దైవాజ్ఞలేనా? చేయవలసినవి చేయకపోయినా, చేయగూడనివి చేసినా దేవదూతను, తమ ప్రతినిధి కాని పవిత్ర ప్రవక్తను, దేవకుమారున్ని ప్రజలు ప్రశ్నించరాదు. కోపగించరాదు. దైవాజ్ఞగా భావించి, భరించి, సహించి, ఓటేసి పరమాత్మ ప్రాతినిధ్యాన్ని కొనసాగించాలి. నేను పరమాత్మకే జవాబుదారున్ని. ప్రజలకు కాదు. ప్రశ్న గిశ్న పరమాత్మ విధి అని ఈ నవభారత నిర్మాత, మతోన్మాద నాజీ ఫాసిజాల సృష్టికర్త, అవతారి అభిప్రాయం. రాజయోగులను అణగదొక్కే ఉపాయం. మోదీ భగవదీకరణతో మోదీ భక్తులు దాసులవుతారు. పరమాత్మ ప్రతినిధిని ఓడిస్తే దేవునికి అపచారంచేసినట్లేనని ప్రచారంచేస్తారు. మోదీయాన్ని నియంత్రించాల్సిన భాగవత్ భంగపడాల్సిందే. ప్రత్యామ్నాయమవుదానుకున్న గడ్కరి గిరికీలు కొట్టాల్సిందే. రెండో హిట్లర్ అమిత్ షా ఆమోదించాల్సిందే. మూడో హిట్లర్ యోగి నోరు మూసుకోవాల్సిందే. మోదీకి గుడి కట్టి బంధించాలని వీరనవచ్చు. ఇలాంటి అపఖ్యాతి ఉదంతం చరిత్రలో హిట్లర్ లో కనిపిస్తుంది. హిట్లర్ పార్టీ విధేయులతో, మిత్ర మాధ్యమాలతో, ప్రచురణకర్తలతో తనబాల్య అసత్య దివ్యత్వ ధైర్యసాహస కథనాలను స్తుతిగీతాలుగా మోసప్రచారం చేయించుకున్నాడు. జర్మని రక్షకుడని పొగిడించుకున్నాడు. విక్టర్ వాన్ కోర్బర్ పేరుతో తానే రాసుకున్న జీవిత చరిత్రలో తాను క్రీస్తునని రాసుకున్నాడు. హిట్లర్ పురాతన హిందు చిహ్నం స్వస్తిక్ తో ఎగిసిపడి, ప్రజాస్వామ్యాన్ని నియంతృత్వంగా మార్చి జర్మనీని నాశనంచేశాడు. నేడు భారత్ వంతు.

**సంగిరెడ్డి హనుమంత రెడ్డి,**
(ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి, నాగపూర్ నుండి )
9490 20 4545

# ప్రైవేటు బడుల ఫీజుల్లో మోత..

ప్రాథమిక విద్య బలంగా ఉంటే? ఎంతటి ఉన్నత విద్యనైనా అలవోకగా అభ్యసించవచ్చు. ఇష్టపడి నేర్చుకున్న విషయం ఏనాటికి మరపు రాదు. విద్య బాల బాలికలందరి హక్కు. విద్యతోనే బాల బాలికలకు విజ్ఞానం దక్కుతుంది. విశ్వ సౌభాగ్యానికి విద్యార్థి పట్టుకొమ్మ.. మన దేశంలో విద్య ఉమ్మడి జాబితాలో ఉంది. నిధుల కేటాయింపు కూడా ఆ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెచ్చిస్తాయి. అలాగే విద్య ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ రంగాలచే అందించబడుతుంది. ప్రభుత్వ అజమాయిషి కొరవడి 'రెంటికి చెడ్డ రేవడిలా' రెండు రంగాల్లోనూ కూనరిల్లి పోతుంది. రాజ్యాంగంలో పొందుపరిచిన ఉచిత నాణ్యమైన విద్య, సమాన అవకాశాలు అందని ద్రాక్షగా మారుతోంది.. ప్రభుత్వ విద్యా రంగంలో పాఠశాలల్లో ఉచిత విద్యతోపాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు, వర్కు బుక్కులు తదితర సౌకర్యాలు అందించబడుతున్నాయి. అయినా ఏ ఏడాదికి ఆ ఏడాది ప్రభుత్వ రంగంలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య పడిపోతున్నది. దీనిలో అనేక మేనేజ్మెంట్లలో కుల, మత, లింగ బేధాలతో గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు ప్రభుత్వ రంగంలోనే ఒక దానికి మరో సంస్థ పోటీగా ఏర్పడినవి. మౌలిక వసతులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కొరతతో ప్రభుత్వ విద్య కొనసాగుతుంది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక ప్రధానంగా కేజీ టు పీజీ వరకు ఉచిత నాణ్యమైన విద్య అందిస్తామని, అటెండర్ పిల్లల నుంచి కలెక్టర్ పిల్లల వరకు సర్పంచ్ పిల్లల నుండి సిఎం పిల్లల వరకు అంతా ఒకే బెంచీ(తరగతి గది)లో చదివేలా 'కామన్ స్కూల్' తీసుకొస్తామన్న మాటలు దశాబ్ద కాలం గడిచినా అమలుకు నోచుకోలేదు. అంగన్‌వాడీలను సర్కారు బడుల్లో విలీనం చేయక పోగా, 6సం. నిండిన వారినే చేర్చుకోవాలన్న నిబంధనలు శాపంగా మారినాయి. ప్రభుత్వ విద్యను పరిరక్షించడంలో పాలకుల ఉదాసీనతతో ప్రైవేటు విద్యాసంస్థలకు వరంగా మారింది. తల్లిదండ్రులకు స్తోమత లేకపోయినా భారీగా ఫీజులు పెంచినా భరిస్తూ పంపుచున్నారు. ఇలా ప్రభుత్వాలు విద్యా పరిరక్షణకు నిధులు పెంచడంలో, ప్రజల్లో నమ్మకం కల్పించడంలో విఫలమయ్యారని విద్యావేత్తలు భావిస్తున్నారు. మన రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ బడుల్లో ఫీజుల మోత ఆకాశాన్ని అంటుచున్నది. ప్లే స్కూల్, ఎల్కేజీ, యూకేజీ మొదటి తరగతి నుంచి పదోతరగతి వరకు డొనేషన్లు, అభివృద్ధి చార్జీలతో పాటు పాఠ్య పుస్తకాలు, దుస్తులు, బూట్లు, బెల్టుల పేరిట తల్లిదండ్రుల జేబులకు భారీగా చిల్లులు పడుతున్నాయి. పాఠశాలకు ఉన్న డిమాండ్ ను బట్టి ఫీజులను ఇష్టానుసారంగా పెంచేస్తున్నారు. ప్రభుత్వం రుసుములు పెంచడంపై నియంత్రణ పాటించక పోవడం వాటికి అనుకూలంగా మారింది. 2024 25 విద్యా సంవత్సరం నుంచి కొన్ని పాఠశాలలు ఏకంగా 25 శాతం వరకు ఫీజులను పెంచేశాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలతో పాటు నగరాల్లో ఇదే పరిస్థితి ఉంది. నగరాల్లో పలు కార్పొరేట్ పాఠశాలలు 45 నుంచి 50శాతం పెంచేస్తున్నాయి. ఇలా ఏటా పాఠశాలల్లో రుసుములు




పెంచడం ఆనవాయితీగా మారిపోయింది. దీనికంటూ నిర్ణీత ప్రాతిపదిక ఏమీ లేదు. మరోవైపు యూనిఫాంలు, పుస్తకాలు, బ్యాగుల ధరలను పెంచేస్తున్నాయి. రూ. 200 లభించే చిన్నారుల బూట్లకు రూ.500 నుంచి రూ.1000 వరకు, 3జతల యూనీఫామ్‌లకు రూ.3000లు, టై రూ.300, బెల్ట్ కు రూ.300చొప్పున ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. తల్లిదండ్రులు వేడుకుంటున్నా వినడం లేదు. ప్రత్యేకంగా తయారు చేయించామని పాఠశాల చిహ్నం ఉన్నందున ఇక్కడే కొనుగోలు చేయాలని ఖరాఖండిగా చెప్తున్నారు. పుస్తకాలు సైతం బయటి మార్కెట్లో కొనడానికి ఒప్పుకోవడం లేదు. తాము చెప్పిన ముద్రణ సంస్థ పుస్తకాలనే కొనాలని అంటున్నాయి. ఇలా పెంచిన రుసుము(ఫీజు)లు అదనపు బాదుడుతో సామాన్య,




మధ్య తరగతుల ప్రజలపై పెను భారం పడుతుంది. కొందరు అప్పులు చేసి మరీ పిల్లల ఫీజు చెల్లిస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల పెంపుదలపై ఎలాంటి నియంత్రణ లేకపోవడం యాజమాన్యాలకు వరంగా మారింది. తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. పాఠశాలల ఫీజుల వసూలు నియంత్రణ చట్టాన్ని తేవాలని 2022 జనవరి 17వ తేదీన జరిగిన మంత్రి మండలి సమావేశంలో అప్పటి మంత్రులు 11 మందితో ఉపసంఘం ఏర్పరిచింది. ఆ సిఫారసులు అమలు కావడం లేదు. కొన్ని పాఠశాలల్లో ప్లే స్కూల్ కు రూ. 1 లక్ష, ఒకటో తరగతికి రూ. 2.5 లక్షలుగా ఆపై తరగతుల వారిగా పెంచుకుంటూ పోతున్నారు. అందరికీ ఉచితంగా అందించవలసిన విద్యను వ్యాపారంగా మార్చారు. మరోవైపు ప్రైవేటు, కార్పొరేట్ బడులు గుర్తింపు, అనుమతి లేని పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వ్యాపారం మొదలు పెట్టినారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఏ ఒకటో రెండో బ్రాంచ్లకు అనుమతులు తీసుకొని వేరువేరు చోట్ల అనేక బ్రాంచ్లను నిర్వహిస్తున్నారు. కనీస రక్షణ లేని బహుళ అంతస్తుల భవనాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వనిబంధనలు. .ఎస్టాబ్లిష్ మెంట్ రికగ్నైజేషన్ అడ్మిషన్ అండ కంట్రోల్ ఆఫ్ స్కూల్ అండర్ ప్రైవేట్ మేనేజ్మెంట్ స్కూల్స్ యాక్ట్ 1993 ప్రకారం నివాస భవనాల్లో తరగతులు నిర్వహించకూడదు. తరగతుల నిర్వహణకు అనుమతులు ఇవ్వకూడదు. ఈ నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ఫైర్ సేఫ్టీ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేవు. ఆట స్థలం లేకపోవడంతో శారీరక వ్యాయామం, మానసిక వికాసం లేక మెజారిటీ పిల్లలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా సైన్స్ ప్రయోగశాలలు మచ్చుకైనా కనిపించవు. తాగునీరు సైతం విద్యార్థులే సమకూర్చుకోవాల్సి వస్తుంది. ఇక మరుగుదొడ్లు, మూత్రశాలలు కంపు కొడుతున్నాయి. ఇలా గుర్తింపు, సౌకర్యాలు లేని పాఠశాలను వెంటనే రద్దు చేయాలి. విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యాశాఖ అధికారులు హడావుడి చేసి మళ్ళీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిపోతుంది. కావున ఈ ఫీజుల దోపిడీని ఆపేలా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను వెంటనే కట్టడి చేయాల్సి ఉంది. ఇటు ప్రభుత్వ అటు ప్రైవేట్, కార్పొరేటు విద్య కూడా అర కొర సౌకర్యాలతోనే నడుస్తున్నది. కానీ ఫీజులు రాబట్టడంలో మాత్రం జలగల్లా పీక్కు తింటున్నారు. ప్రభుత్వం వెంటనే కట్టడి చేయాల్సి ఉంది. విద్య, వైద్యం పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో ఉన్నాయి. అందరికీ ఉచిత నాణ్యమైన విద్య అందేలా చూడాలి. తద్వారా ఎదగడానికి సమాన అవకాశాలు కల్పించబడాలి. విద్య వ్యక్తికి వ్యక్తిత్వాన్ని, జీవనోపాధిని కల్పించాలి. సంస్కారవంతంగా తీర్చి దిద్దబడాలి. ప్రభుత్వం ఉదాసీనత వీడనంత కాలం ఇది సాధ్యపడదు. పేదరికం దూరం చేయనంతవరకు విద్యారంగం ఆశించినంత అభివృద్ధి సాధించలేదు. ఈ విషయంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం అయినా కఠిన చర్యలతో విద్యను ఒకే గొడుగు కిందికి తెచ్చి 'కామన్ స్కూల్' విధానాన్ని ప్రవేశపెట్టాలి. ప్రైవేట్ విద్యను పూర్తిగా ప్రభుత్వాధీనంలోకి తీసుకోవాలి. అప్పుడే పేద, మధ్య తరగతి వాళ్లకు న్యాయం జరుగుతుంది. సమాన అవకాశాలు దొరుకుతాయి..



# అంతరిస్తున్న 'నెగ్రిటో'!

ఫిలిప్పీన్స్ ఆది తెగగా 'నెగ్రిటో'ను పేర్కొంటారు. ఈ తెగను 'ఆటా', 'అయిటా', 'ఆగ్టా' అని కూడా పిలుస్తారు. ఫిలిప్పీన్స్ స్థానిక ప్రజల సమూహమే ఈ గిరిజన తెగ. వీరి పూర్వీకులు సుమారు 20,000 నుంచి 30,000 సంవత్సరాల క్రితం బోర్నియో నుండి వలస వచ్చారని పరిశోధకులు అంటున్నారు. ఆగ్నేయ ఆసియాలోని ఈ సమూహంలోని వారి జట్టు పొట్టిగానూ, గిరిజాలుగానూ ఉంటుంది. నెగ్రిటో జాతి ఎక్కువగా లుజోన్‌లోని పర్వత ప్రాంతాలలో కనిపిస్తుంది. ప్రత్యేకించి పంపంగా ప్రావిన్స్‌లోని జాంబల్స్ పర్వత శ్రేణిలో నెగ్రిటోలు ఎక్కువ. ఒక్కో ప్రాంతంలో సుమారుగా 15 కుటుంబాలు కలిసి నివాసం ఉంటాయి. చాలా సమూసాలు తరచు ఒక చోటి నుంచి మరో చోటికి ప్రయాణిస్తు ఉంటారు. కైంగిన్ అనే స్లాష్ అండ్ బర్న్ విధానంలో వ్యవసాయం చేస్తారు. ఈ తెగ వారికి నేయడంలో, లేపనం చేయడంలో అపారమైన నైపుణ్యం ఉంటుంది. ఇక్కడి స్త్రీలు నూలు లేదా బెరడు వస్త్రాలను ధరిస్తారు. పురుషులు నడుము కింది భాగంలో మాత్రమే దుస్తులు ధరిస్తారు. సంగీతం, కళలను ఆస్వాదిస్తారు. ఆభరణాలు వేసుకోవడం వీరికి ఎంతో ఇష్టం. వివిధ రకాలైన వాద్య పరికరాలతో వీరు అద్భుతమైన సంగీతాన్ని సృష్టిస్తారు. అడవుల్లో సంచరిస్తూ, వేటపై ఆధారపడే నెగ్రిటో జాతి వారికి సహజ వనరులే రక్ష. పర్వతారోహణలో, వేగంగా పరుగులు తీస్తూ వేటాడడంలోనూ వీరిని మించిన వారు ఉండరు. పట్టణాలు, నగరాల నుంచి దూరంగా ఉండే వీరు స్వచ్ఛమైన ప్రకృతిని ఇష్టపడతారు. అయితే, ఫిలిప్పీన్స్‌లో తరచు చోటు చేసుకునే అంతర్యుద్ధాల ప్రభావం క్రమంగా నెగ్రిటోలపైన కూడా పడుతున్నది. ఈ తెగ వారు ప్రాణ భయంతో పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతరించిపోతున్న గిరిజన తెగల జాబితాలోకి వచ్చే నెగ్రిటోల పరిరక్షణకు అంతర్జాతీయ సమాజం నడుం బిగించాలి. వారిని అన్ని విధాలా ఆదుకోవాలి.

# దశాబ్దాలుగా అవే సమస్యలు..

బంకురాలోని రాణిబంద్‌లోని సంతాల్ గ్రామాల నివాసితులకు అలుపెరగని పోరాట స్ఫూర్తి మాత్రమే జీవనాధారంగా కనిపిస్తోంది. ఎందుకంటే, ఇక్కడ ఆవాస్, లక్ష్మీర్ భండార్ లేదా ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుబాటులో లేవు. పచ్చని అడవులలో బ్లాక్‌టాప్ రోడ్లు, కొన్ని ప్రాంతాల్లో సోలార్ స్ట్రీట్ లైట్లు, గృహాలకు మంచి నీటి కనెక్షన్ల రూపంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, ప్రభుత్వ పరంగా అందే ప్రయోజనాలు, పథకాల అసమాన పంపిణీ వల్ల అభివృద్ధి అసంపూర్తిగానే ఉంది. ఈ పరిస్థితి ఘాగ్రా, రౌతెరా, సొనార్ది,హాలుక్దానాలి వంటి పలు సంతాల్ గ్రామాలతోపాటు, పశ్చిమ బెంగాల్‌లోని జంగల్‌మహల్ తదితర ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి కనిపిస్తుంది. సుమారు దశాబ్దం క్రితం ఇక్కడి ప్రాంతాలు మావోయిస్టు కార్యకలాపాల వల్ల ప్రభావితమయ్యాయి. ఇప్పుడు, ఆ సమస్య కొంత తగ్గినప్పటికీ, పథకాల అమలు సక్రమంగా లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. 'కొందరు ఈ ప్రయోజనాలను రెండుసార్లు పొందుతున్నారు, మరికొందరికి అసలే అందడం లేదు' అని స్థానిక రూట్లో అప్పుడప్పుడు బస్సు డ్రైవర్గా పనిచేస్తున్న సుఖ్‌లాల్ మండి పిటిఐతో చెప్పాడు. ఘాగ్రా గ్రామంలో తన నిరాడంబరమైనదేగానీ, ఎంతో అందంగా అలంకరించిన మట్టి ఇంటి ముందు కూర్చొని అతను మాట్లాడుతూ, ప్రభుత్వ 'ఆవాస్ యోజన' కింద తనకు ఎప్పుడూ ఇల్లు అందలేదని వాపోయాడు. రాజకీయ నాయకులు, అభ్యర్థులు ఎన్నికల ముందు మాత్రమే వస్తున్నారని సోనార్ది గ్రామానికి చెందిన శ్యామ్‌లాల్ హేంబ్రామ్ విమర్శించాడు. వృద్ధాప్య పింఛను బ్యాంకులో జమ చేయడం ఆగిపోయిందని రౌతెర గ్రామానికి చెందిన సప్తమతల్లి సుధీర్ తుడు వాపోయాడు. పింఛన్‌ను పునఃప్రారంభించాలని కోరుతూ సంబంధిత అధికారులను సందర్శించినా ఫలితం లేకుండా పోయిందని అన్నాడు. ఘాగ్రా గ్రామ యువకుడు బిజోయ్ ముర్ము మాట్లాడుతూ, తాను వ్యవసాయ సీజన్‌లో వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నట్టు చెప్పాడు. అయితే, సంవత్సరంలో ఎక్కువ భాగం ఏ పనీ దొరక్క, ఖాళీగా కూర్చోవాల్సి వస్తున్నదని అన్నాడు. అన్‌సీజన్‌లో తమకు ఉపాధి కల్పించే చర్యలు తీసుకోవాలని



అధికారులను కోరాడు. అన్ని పార్టీలు ఒకటేనని, తనలాంటి వారికి ఎవరూ అండగా ఉండరని వ్యాఖ్యానించాడు. సంపన్నులు మరింత ధనవంతులు అవుతున్నా పేదల పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదని మండిపడ్డాడు. తమ పేర్లను చెప్పడానికి ఇష్టపడని, సోనార్దికి చెందిన ఇద్దరు మధ్య వయస్కులైన మహిళలు తాము రోజువారీ కూలీలుగా పనిచేస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్మీర్ భండార్ పథకం కింద ఇంకా నిధులు రాలేదని చెప్పారు. అదే గ్రామానికి చెందిన శ్యామ్‌లాల్ హేంబ్రామ్ మాట్లాడుతూ అధికారులు ఈ ప్రాంతాన్ని సందర్శించే రోజుల్లో మాత్రమే తమ గ్రామంలోని నల్లాల నుంచి నీరు వస్తుందని అన్నాడు. వంద మంది జనాభా ఉన్న తమ గ్రామంలో ఒకరికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగం ఉందన్నాడు. హాలుద్‌కంది గ్రామపెద్ద నీలోయ్ హన్స్‌ద్రా మాట్లాడుతూ ప్రయాణికుల కోసం బస్టాప్ నిర్మాణానికి స్థలం ఇస్తామని చెప్పామని, అయితే ఆ ప్రతిపాదనను సంబంధిత అధికారులు ఇంకా చేపట్టలేదన్నాడు. శ్యామ్‌లాల్‌తోపాటు మరికొందరు రెండేళ్ల క్రితం 100 రోజుల ఉపాధి హామీ పథకం కింద ఈ ప్రాంతంలో కాలువ పనులు చేశారని, అయితే ఎలాంటి పారితోషికం రాలేదని వివరించాడు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గిరిజనుల సర్నా మతాన్ని గుర్తించలేదని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు. కొంత మంది నకిలీ ఎస్‌టి సర్టిఫికెట్లు పొందడం వంటి సమస్యలు కూడా ఉన్నట్టు చెప్పారు. అయితే, రాణిబంద్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, సరఫరాల శాఖ సహాయ మంత్రి జోత్స్న మండి పిటిఐతో మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, అవి దాదాపు పూర్తయ్యాయని అన్నారు. గ్రామస్థులు లేవనెత్తిన అంశాలను ప్రస్తావించగా, వారికి మరింత అవగాహన అవసరమని జోత్స్న వ్యాఖ్యానించారు. మండి ప్రాంత నీటి కొరత సమస్యలపై మాట్లాడుతూ వేసవి కాలంలో నీటి మట్టం తగ్గుముఖం పడుతుందన్నారు. నల్లాల ద్వారా నీరు అందిస్తున్నట్టు చెప్పారు. ఆవాస్ యోజన కింద రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్లే గృహ నిర్మాణ సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి ఆరోపించారు. బిజెపి బంకురా నియోజకవర్గ అభ్యర్థి సుభాస్ సర్కార్ పిటిఐతో మాట్లాడుతూ, నరేంద్ర మోదీ ప్రభుత్వం గిరిజనుల కోసం చాలా పనులు చేసిని అన్నారు. అందుకే, ఆదివాసీలంతా తమతో ఉన్నారని చెప్పారు.

# ఖరీఫ్ ప్రణాళిక ఖరారు

**సూర్యాపేట జిల్లాలో సాగు అంచనా 5,83,450 ఎకరాలు, గత ఖరీఫ్ కన్నా 22,688 ఎకరాల పెరగుదల**

**ప్రజాపక్షం/ సూర్యాపేట ప్రతినిధి :** ఖరీఫ్ సీజన్‌కు వ్యవసాయ అధికారులు ప్రణాళికను ఖరారు చేశారు. సూర్యాపేట జిల్లాలో సాగు అంచనా 5,83,450 ఎకరాలు పంటలు సాగు కానున్నాయని ప్రభుత్వానికి నివేదికలు అందజేశారు. గత ఖరీఫ్‌లో 5,60,762 ఎకరాల్లో పంట సాగు కాగ ఈ ఖరీఫ్‌లో గతం కన్నా 22,688 ఎకరాల్లో పంట సాగు పెరగనున్నట్లు తెల్పారు. దీనికి అనుగుణంగా రైతులు ఖరీఫ్ పంట సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

సూర్యాపేట జిల్లాలో గత ఐదేళ్లుగా పంట సాగు విస్తరణ భారీగా పెరిగింది. గతంలో 4లక్షల ఎకరాలకే పరిమితమైన పంట సాగు నేడు 6లక్షల వరకు చేరుకుంది. ఒక పక్క కృష్ణా జలాలు, మరో పక్క గోదావరి జలాలు, ఇంకో పక్క మూసీ జలాలతో కోనసీమను తలపిస్తుంది. ఎక్కడ చూసిన పచ్చని పైరుతో ప్రకృతి కళకళలాడుతుంది. ఈ జలాలతో ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలను నింపడంతో మత్తడి తొక్కుతున్నాయి. బోరు బావుల్లో కూడా నీటి లభ్యత పెరిగింది. కృష్ణా పరివాహక ప్రాంతాలైన కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో అత్యధికంగా వరిసాగు చేయకగా సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గ రైతాంగం గతంలో నీటి లభ్యత లేకపోవడంతో అధికంగా మెట్ట పంటల సాగుకే పరిమితమయ్యారు. గోదావరి జలాల రాకతో ఈ ప్రాంతాల్లో కూడా వరిసాగు గణనీయంగా పెరిగింది. దీంతో జిల్లా వ్యాప్తంగా వరిసాగు భారీగా పెరగడంతో రాష్ట్రంలోనే సూర్యాపేట జిల్లా వరి ఉత్పత్తిలో ప్రథమస్థానికి చేరుకుంది. రైతుల ప్రధాన పంట వరిసాగు కాగా రెండో పంటగా పత్తి సాగు నిలుస్తుంది. అధికారులు ఈ ఏడాది పంట సాగు 5,83,450 ఎకరాలు సాగు కానున్నట్లు అంచన వేశారు. ఇందులో వరి 4,65,500 ఎకరాలు, పత్తి 90వేల ఎకరాలు, మొక్క జోన్న 75, కంది 2400 ఎకరాలు, పెసరా 1500 ఎకరాలు, వేరుశనగ 400 ఎకరాలు, చెరుకు 300 ఎకరాలు, మిర్చి 21వేల ఎకరాలు, ఫాం ఆయిల్ 2200 ఎకరాల్లో రైతులు సాగు చేయనున్నట్లు ప్రభుత్వానికి నివేదికలు అందజేశారు. గతంలో వర్షాభావ పరిస్థితుల వల్ల కృష్ణా పరివాహక ప్రాంతంలో వరి సాగు భారీగా తగ్గింది. ఈ ఏడాది గతం కంటే వర్షాలు ముందస్తుగా భారీగా కురుస్తాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతుండడంతో వ్యవసాయ అధికారులు వరి సాగు గతం కన్న 18,848 ఎకరాల్లో వరి అధికంగా సాగు కానుందని చెప్పడం జరిగింది.



### రైతులకు అందుబాటులో విత్తనాలు.. ఎరువులు

పంట సాగుకు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచారు. ప్రభుత్వం నుండి రాయితీపై వచ్చే విత్తనాల గురించి రైతులకు తెలియపరుస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో వరి విత్తనాలు 75,856 క్వింటాలు, కంది 96 క్వింటాలు, పెసరా 120 క్వింటాలు, జోన్న 6 క్వింటాలు, వేరుశనగ 240 క్వింటాలు, పత్తి 1,80వేల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. అలాగే యూరియా 60,866 మెట్రిక్ టన్నులు కావాల్సి ఉండగా 30,643 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉండగా, డిఎపి 14,996 మెట్రిక్ టన్నులు కావాల్సి ఉండగా 1,849 అందుబాటులో ఉంది. ఎంపివో 9,738 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా 478 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 43,011 మెట్రిక్ టన్నులు కావాల్సి ఉండగా 13,666 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. అలాగే ఎస్ఎస్‌పి 5,859 మెట్రిక్ టన్నులకు గాను 416 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది.

## బిటి రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** నూతనంగా చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు. తుర్కపల్లి మండలంలోని గుజ్జవాణి కుంట తాండ, జంగారెడ్డి తాండ గ్రామాల్లో చేపడుతున్న నూతన నిర్మాణ బీటీ రోడ్డు పనులను బుధవారం పరిశీలించారు. నాణ్యతతో త్వరితగతిన రోడ్డు పనులను పూర్తిచేయాలని గుత్తేదారికి తెలిపారు. అనంతరం జంగారెడ్డి తాండ అమ్మ ఆదర్శ పాటశాలలో చేపడుతున్న పనులను పరిశీలించారు. వేసవి సెలవులు పూర్తయి, పాఠశాలలు ప్రారంభయ్యే నాటికి పనులు పూర్తిచేయాలని సూచించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, ధూప్ సింగ్ నాయక్, తాండ వాసులు తదితరులు ఉన్నారు.

## జిల్లాలో విత్తనాల కొరత లేదు



జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో విత్తనాల కొరత లేదని రైతులు అధైర్యపడవద్దని ఖమ్మంజిల్లా వ్యవసాయ అధికారిణి ఎం. విజయనిర్మల తెలిపారు. బుధవారం రఘునాథపాలెం మండల పరిధిలోని రఘునాథపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాన్ని జిల్లా వ్యవసాయ అధికారిణి విజయ నిర్మల పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలైన జిలుగులు, జనుము, పిల్లి పెసర విత్తనాలు రైతులకు సరిపడ అందుబాటులో ఉన్నాయన్నారు. పచ్చిరొట్ట విత్తనాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు నమోదు చేసి అధికారులు కూపన్లు మంజూరు చేస్తారని ఆ కూపన్ల ద్వారా సొసైటీలో విత్తనాలు పొందవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో విత్తన గిడ్డంగి ఆర్ఎం భిక్షమయ్య, ఏడిఏ శ్రీనివాసరావు, ఏవో టెక్నికల్ ఛాయా దేవి, మండల వ్యవసాయ అధికారి భాస్కర్‌రావు, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, సొసైటీ సిఈవో ఎం. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఊపిరాడక 15 ఆవుల మృతి



పోలీసులే కారణమంటున్న ప్రజలు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన మట్టపల్లి చెక్ పోస్టు వద్ద మంగళవారం రాత్రి సమయంలో 26 ఆవులను కంటైనర్‌లో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆవులు పల్నాడు జిల్లా గురజాలకు చెందినవిగా భావిస్తున్నారు. రాత్రి పట్టుకున్న ఆవుల విషయంలో పోలీసులు సెటిల్‌మెంట్ చేసుకునేందుకు ప్రయత్నాలు జరిగినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.ఈ విషయం జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు తెలియడంతో తప్పనిసరి పరిస్థితులలో మఠంపల్లి పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.పట్టుకున్న కంటైనర్‌లోని ఆవులను కిందికి దించకపోవడంతో మొత్తం 26 ఆవులలో 15 ఆవులు మృత్యువాత పడ్డాయి.మృత్యువాత పడ్డ 15 ఆవులకు పోస్టుమార్టం నిర్వహించి, రెండు ఆవులకు కాళ్లు విరగగా పశువైద్యులు చికిత్స అందిస్తున్నారు.మిగిలిన 9 ఆవులను నల్లగొండ గోశాలకు తరలించినట్లు తెలిసింది. ఆవుల మృత్యువాత పడటానికి ఎస్ఐ రామాంజనేయులు నిర్లక్ష్యమే కారణమంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. మఠంపల్లి ఆవుల మృత్యువాతపై విచారణకు జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే ఆదేశించినట్లు తెలిసింది.

## కబ్జా నుంచి చెరువు భూమిని కాపాడాలి



**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** కబ్జాల నుంచి చెరువు శిఖం భూములను కాపాడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ డిమాండ్ చేశారు. బుధవారం కబ్జాకు గురైన పట్టణంలో గల పందిర్లపల్లి చెరువును ఆయన సీపీఎం నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. సర్వే నెం.118లో సుమారు 203 ఎకరాల్లో చెరువు భూమి ఉందని, సర్వే నెం.114లో 128 ఎకరాల్లో బంచరాయి భూమి ఉందని, ప్రస్తుతం ఈ భూములను కొందరు అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పూడికతీత పేరుతో నిబంధనలకు విరుద్ధంగా అడ్డుఅదుపు లేకుండా ట్రాక్టర్లు, టిప్పర్లతో చెరువు మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే అధికారులు స్పందించి చెరువు కబ్జాలకు గురికాకుండా చర్యలు చేపట్టాలని లేనట్లయితే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రాగిరెడ్డి మంగారెడ్డి, పరుశురాములు, రామ్మూర్తి, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, రామారావు, సీతారాములు తదితరులు పాల్గొన్నారు

## ప్రమాదమా... హత్యా ?

తల్లి, కూతురు మృతిలో మిస్టరీ

ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తల్లీ, ఇద్దరు కూతుళ్ల మృతి ప్రమాదవశాత్తు జరిగిందా లేక చంపేశాడా అన్న సందేహం వ్యక్తమవుతుంది. భర్తే భార్య, కూతుళ్లను హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరించాడని మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తున్నారు. రఘునాథపాలెం మండలంలో మంగళవారం రాత్రి జరిగిన కారు ప్రమాదంలో భర్తకు గాయాలు కాగా భార్య, ఇద్దరు కూతుళ్ల మృతి చెందిన విషయం విధితమే. దీనికి సంబంధించి భార్య, కూతుళ్లను భర్తే చంపి ప్రమాదంగా చిత్రీకరించాడని బంధువులు ఆరోపిస్తున్నారు. రఘునాథపాలెం మండల బావోజీతండా గ్రామానికి చెందిన బోడా ప్రవీణ్‌కు ఏన్కూరు మండలం రంగాపురం తండాకు చెందిన బోడా కుమారితో(28) 2017లో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కూతుళ్ల కృషిక (4), తనిష్కా (3) ఉన్నారు. మంగళవారం ప్రవీణ్ భార్య, కూతుళ్లతో కలిసి మంగళవారం సాయంత్రం కారులో ఖమ్మం వెళ్లి ఇంటికి వస్తుండగా మంచుకొండ, హర్యాతండా మధ్యలో కుక్కను తప్పించబోయి కారు ప్రమాదానికి గురైంది. రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీ కొని ప్రవీణ్‌కు గాయాలు కాగా భార్య కుమారి, కుమార్తెలు కృషిక, తనిష్కాలు మృతి చెందిన విషయం విధితమే. దీనికి సంబంధించి కుమారి తల్లిదండ్రులు, బంధువులు భర్తే హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాడని ఆరోపిస్తున్నారు. బుధవారం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కుమారి తల్లిదండ్రులు, బంధువులు రోదనలు మిన్నంటాయి. తన కుమార్తెను బోడా ప్రవీణ్‌కు ఇచ్చి 2017లో వివాహం జరిపించామని వివాహ సమయంలో రూ. 25 లక్షల కట్నం ఇచ్చినట్లు తెలిపారు. వారికి ఇద్దరు కుమార్తెలు పుట్టిన తర్వాత కుమారుడు కావాలంటూ ప్రవీణ్ భార్యను వేదించ సాగాడు. హైదరాబాద్‌లో ఫిజియోథెరపి వైద్యునిగా పనిచేస్తున్న ప్రవీణ్‌కు వివాహేతర సంబంధం ఉన్నట్లు ఇటీవల కాలంలో ఆమెతో ఇతర ప్రాంతాలకు వెళ్లివచ్చినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. 20 రోజుల క్రితం బావోజీతండాకు వచ్చారని తెలిపారు. ఆధార్ అప్‌డేట్ కోసం ఖమ్మం వచ్చి తిరిగి వెళ్తుండగా కారు ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే ఈ ప్రమాదానికి సంబంధించి ప్రవీణ్‌కు గాయాలు కాగా మృతి చెందిన కుమారి, కృషిక, తనిష్కాల ఒంటిపై ఎటువంటి గాయాలు లేకపోవడం, చిన్న గీతలు కూడా లేవని దాని వల్లే మాకు మృతిపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. తమకు న్యాయం జరిగేంత వరకు పోస్టుమార్టం నిర్వహించవద్దంటూ కొంత సేపు ఆసుపత్రి వద్ద కుమారి బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇరు గ్రామాల పెద్దల సమక్షంలో ఇచ్చిన కట్నంలో కొంత మేర తిరిగి ఇచ్చేందుకు ప్రవీణ్ కుటుంబ సభ్యులు అంగీకరించడంతో కుమారి తల్లిదండ్రులు, బంధువులు పోస్టుమార్టం నిర్వహించేందుకు అంగీకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బావోజీతండాకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## విత్తన విక్రయాలలో మోసపోవద్దు

పలు దుకాణాలను పరిశీలించిన డిఎఒ



**ప్రజాపక్షం/కరీంనగర్ :** సాగు యాజమాన్య పద్ధతుల ప్రకారం మంచి దిగుబడులు ఇచ్చే విత్తనాలనే ఎంపిక చేసుకోవాలని, ప్రత్యేకంగా ఆయా డీలర్లు ఫలానా విత్తనాలనే తీసుకోవాలంటూ మోసగించే ప్రమాదంలో పడవద్దని కరీంనగర్ జిల్లా వ్యవసాయ అధికారి బత్తిని శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఏడిఏ రణదీర్ కుమార్, కరీంనగర్ అర్బన్ ఏవో హరిత, కరీంనగర్ రూరల్ ఏవో సత్యం, కొత్తపల్లి ఏఓ రంజిత్‌లతో కలిసి కరీంనగర్ పట్టణంతో పాటు మండలంలోని పచ్చిరొట్ట విత్తనాల కౌంటర్లలో డీసీఎంఎస్ కరీంనగర్, కెడిసిసిబి కరీంనగర్, పత్తి విత్తనాల కొరకై మహేశ్వర ఆగ్రో ఏజెన్సీస్, మహేశ్వర ఎంటర్‌ప్రైజెస్, గణేష్ ఆగ్రో ఏజెన్సీస్, మాధవ ఏజెన్సీస్, రైతు ఏజెన్సీస్ షాపులను డీఏవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 4500 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలకు గాను 2200 క్వింట్లా విత్తనాలు వచ్చాయని, మరో రెండు రోజుల్లో మిగిలిన మొత్తం విత్తనాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రైతులెవరూ పచ్చిరొట్ట విత్తనాల కొరకు ఇబ్బంది ఉండదని తెలిపారు. ప్రస్తుత వానాకాలం 2024కి గాను 1.20 లక్షల పత్తి విత్తనాల ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయని, కరీంనగర్ జిల్లా విస్తీర్ణానికి 1.10 లక్షల ప్యాకెట్లు అవసరమవుతాయని, కొరత ఉండదని తెలిపారు. ఏ రకం పత్తి అయినా సరే మంచి సాగు యాజమాన్య పద్ధతుల ప్రకారం మంచి దిగుబడులు వస్తాయని, ఒకే రకం పత్తి కొరకు ఆరాట పడవద్దని రైతులను కోరారు. అదే విధంగా వరి, మొక్కజొన్న, కంది, పెసర అన్ని రకాల పంట విత్తనాలు మార్కెట్‌లో సిద్ధంగా ఉన్నాయని తెలియజేశారు.

## మహీంద్ర ఎక్స్‌యువి 3ఎక్స్ఒ పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మహీంద్ర అండ్ మహీంద్ర కంపెనీ నూతన మోడల్ ఎక్స్‌యువి 3 ఎక్స్‌వో మోడల్‌ను 20 మంది వినియోగదారులకు ఖమ్మం ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు అందజేశారు. మహీంద్ర కంపెనీ అధీకృత డీలర్ అయిన వివిసి మెటార్స్ లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు చేతుల మీదుగా 20 మంది వినియోగదారులకు ఎక్స్‌యువి 3 ఎక్స్‌వో వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ ఖమ్మం మార్కెట్‌లోకి వచ్చిన ఎక్స్‌యువి 3ఎక్స్‌వో సేఫ్టీ పరంగా ఆరు ఎయిర్ బ్యాగులు ఉన్నాయని తెలిపారు. ఈ వాహనానికి వినియోగదారుల నుంచి మంచి డిమాండ్ రావడం ఇందులో ఉన్న సేఫ్టీ ఫీచర్స్ అందుబాటు ధరలో ఉండటమే కారణమన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, డ్రైవింగ్ చేసేటప్పుడు సీటు బెల్ట్ ధరించాలని తెలిపారు. వివిసి మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ వర్చ్యువల్ ద్వారా మాట్లాడుతూ మహీంద్ర కంపెనీ తమ వాహనాలలో సేఫ్టీ విషయంలో చాలా అడ్వాన్స్‌గా ఉంటుందన్నారు. సేఫ్టీ, మైలేజీ విషయంలో ఎస్‌యువి వేరియంట్‌లో మహీంద్ర ఎక్స్‌యువి 3ఎక్స్‌వో ముందు వరుసలో ఉందన్నారు. 20 వాహనాలు ఒకే రోజు డెలివరి చేయడం వివిసి మోటార్స్‌కి గర్వకారణమన్నారు. వారంలోనే 100 వాహనాలు బుకింగ్ అయ్యాయన్నారు. అడ్వాన్స్ బుకింగ్ ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలోని వివిసి మోటార్స్‌లో మొదలయ్యాయని తెలిపారు. ఈ వాహనం ద్వారా రూ. 7.49 లక్షల నుంచి రూ. 15.49 లక్షల వరకు ఉందన్నారు. మ్యానువల్, ఆటోమెటిక్ వేరియంట్‌లలో లభ్యమవుతుందని తెలిపారు. సంస్థ ఉద్యోగులు, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

## జిపి కార్మికుల వేతనాలు చెల్లించాలి




**ప్రజాపక్షం/గుండాల :** గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను ప్రభుత్వం సకాలంలో చెల్లించకుండా కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని తక్షణమే జిపి కార్మికుల వేతనాలను అందించాలని సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్నటువంటి కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఇచ్చే తక్కువ వేతనాలు అయిన సకాలంలో ఇవ్వకపోవడంతో కార్మికుల కుటుంబాలు రోజువారి ఖర్చులు వెల్లదీసుకునే పరిస్థితులు లేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల మల్టీపర్పస్ విధానం రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని, పంచాయతీ కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి, పనిభారం తగ్గించాలని అన్నారు. జిపి కార్మికులపై అధికార వేదింపులను ఆపాలని అన్నారు. ప్రత్యేక అధికారుల పాలనలలో పంచాయతీలను నడపడం భారంగా మారిందని, పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆయన కోరారు.

## దోపిడీ చేస్తున్న నకిలీ వైద్యులపై చర్యలు



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** వైద్య పరంగా ఎలాంటి అర్హత లేనప్పటికీ పేద ప్రజల అవసరాలను అవకాశంగా తీసుకొని నిలువు దోపిడీ చేస్తున్న నకిలీ వైద్యులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలంగాణ వైద్య మండలి సభ్యులు డాక్టర్ శ్రీకాంత్ వర్మ, డాక్టర్ శ్రీనివాస్,డాక్టర్ రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లారావు, తెలిపారు. నల్లగొండ పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ వైద్య మండలి సభ్యులు మాట్లాడుతూ ఎలాంటి అర్హతలు లేనప్పటికీ వచ్చీరాని వైద్యం చేస్తూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్న వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎలాంటి విద్యార్హత లేనప్పటికీ ఎంబిబిఎస్ వైద్యుల స్థాయిలో ఆర్.ఎం.పి, పి.ఎం.పి అని బోర్డు పెట్టుకొని స్థాయికి మించి, పరిధి దాటి వైద్యం చేస్తున్న వారిపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా తెలంగాణ వైద్య మండలి సభ్యులు బృందాలుగా విడిపోయి బుధవారం నల్లగొండ,, సూర్యాపేట జిల్లాలలో విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.. తనిఖీలలో భాగంగా పరిధి దాటి వైద్యం చేస్తున్న 55 మంది నకిలీ వైద్యులను గుర్తించి వారిపై ఎన్ఎంసి చట్టం 34, 54 ప్రకారం కేసులు నమోదు చేయడానికి రంగం సిద్ధం చేశారు. తనిఖీల అనంతరం ఎలాంటి విద్యార్హతలు లేనప్పటికీ విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్, ఇంజక్షన్లు వాడుతున్నారని, కొన్ని సెంటర్లలో గర్భవిచ్చిత్తి టాబ్లెట్లు, ఆపరేషన్ థియేటర్లు, రహస్య గర్భవిచ్చిత్తి సంబంధిత పరికరాలను తనిఖీల సందర్భంగా గుర్తించామని తెలిపారు. అడ్డగోలుగా యాంటీబయాటిక్స్ వాడటం వల్ల భవిష్యత్ తరాలకు యాంటీబయాటిక్స్ పనిచేయని పరిస్థితి తలెత్తుతుందని ఇది ఎంతో తీవ్రమైన అంశమని అన్నారు. ఒక వ్యాధికి వాడాల్సిన యాంటీబయాటిక్స్ ను మరో వ్యాధికి వాడుతూ నకిలీ వైద్యులు రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, అలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నకిలీ వైద్యం చేసే వారికి చట్ట ప్రకారం ఐదు లక్షల రూపాయల జరిమానా, ఏడాది జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుందని చెప్పారు. నకిలీ వైద్యుల వచ్చీరాని వైద్యం వల్ల వర్ధన్నపేటలో ఒక చిన్నారి, మంచిర్యాల జిల్లాలలో మరో చిన్నారి మృత్యువాత పడ్డారని, విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వాడడం వల్లే చిన్నారులు ఇద్దరు చనిపోయారని, ఇలాంటి సంఘటనలను అరికట్టడానికే తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టిందని తెలిపారు. నకిలీ వైద్యం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. స్థాయికి మించిన వైద్యం ఎవరూ చేయవద్దని, అలా చేస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీడియా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ ఇమ్రాన్, డాక్టర్ విష్ణు, డాక్టర్ సంతోష్, డాక్టర్ ఫణికుమార్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నీలగిరి బ్రాంచ్ అధ్యక్షురాలు డాక్టర్ అనితారాణి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమేష్ ఉన్నారు. ఈ తనిఖీలలో రాష్ట్ర వైద్య మండలి ఉపాధ్యక్షుడు డాక్టర్ జి శ్రీనివాస్, లీగల్ యాంటీ క్వాకరి బృందం సభ్యులు డాక్టర్ శేషుమాధవ్,ఎఫ్ ఎంజి చైర్మన్ డాక్టర్ శ్రీకాంత్,పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేష్ కుమార్, ఫైనాన్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ రవికుమార్, ఈసీ మెంబర్స్ డాక్టర్ విష్ణు, డాక్టర్ ఇమ్రాన్ అలీ, కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ రాజీవ్ నాయక్, హెచ్ ఆర్ డి ఏ నాయకుడు డాక్టర్ సంతోష్ రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పుల్లారావు, డాక్టర్ దైవాదీనం, డాక్టర్ రమేష్, డాక్టర్ ఫణికుమార్, డాక్టర్ సంతోష్ తదితరులు ఉన్నారు.

# కబ్జా కోరల్లో కటాక్షపూర్ చెరువు

**చూసీ చూడనట్లున్న అధికారులు**

**చెరువును కాపాడాలని వినతి**



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని హౌజ్‌బుజుర్గ్ గ్రామంలో గల కటాక్షపూర్ పెద్ద చెరువు కబ్జా కోరల్లో చిక్కుకున్నది.సుమారు వెయ్యి ఎకరాలలో ఉండాల్సిన చెరువు విస్తీర్ణం కబ్జాదారుల కబంద హస్తాలలో చిక్కుకుని విలవిలలాడుతున్నది.దీంతో చెరువు బక్క చిక్కి రైతుల పంటలకు నీరు అందించని దుస్తితిలో పడిపోయింది. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. కటాక్షపూర్ పెద్ద చెరువు కబ్జాకు పరోక్షంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.మండలంలోని కటాక్షపూర్, మహ్మద్ గౌస్ పల్లి పరిధిలో చెరువు శిఖం కబ్జాకు గురవుతున్నా పట్టించుకున్న నాధుడే లేదని హౌజ్‌బుజుర్గ్ గ్రామ రైతులు వాపోతున్నారు. చెరువు ఆయకట్టు పరిధిలోని హౌజ్‌బుజుర్గ్ ,కటాక్షపూర్, నీరుకుళ్ల, రేలకుంట,నందిగామ,నేరెడుపల్లి, పత్తిపాక, గొల్లపల్లి గ్రామాలకు 1500 ఎకరాలకు గాను రెండు పంటలకు సరిపోయే నీరు ఆయకట్టుకు అందించేదని రైతులు చెబుతున్నారు.అలాంటి చెరువు నేడు కబ్జా కారణంగా పొలాలకు నీరు అందడం లేదని ఆందోళన చెందుతున్నారు. కటాక్షపూర్ చెరువును ఆనుకుని డాక్టర్ ప్రదీప్ రెడ్డి, ఉమేష్ చంద్ర,పంచగిరి భాస్కర్, పంచగిరి కేదారి,వక్కల కిషన్, వక్కల గోపి, సురేందర్ గౌడ్, మంద లింగయ్య, కొప్పులపల్లి లక్ష్మణ రావు చెరువును కబ్జా చేసేందుకు దురుద్దేశంతో చుట్టూ ఉన్న భూమిని కొనుగోలు చేశారని రైతులు ఆరోపిస్తున్నారు.ఇదే అదునుగా వీరంతా సుమారు 50 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారని వారు తెలిపారు. ఈ మేరకు కటాక్షపూర్ చెరువును కబ్జాదారుల నుండి కాపాడాలని కోరుతూ రైతులు మండల తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ రవిందర్‌కు వినతి పత్రం కూడా మంగళవారం అందజేశారు.ఈ సందర్భంగా రైతులు మండల కేంద్రంలో విలేఖరులతో మాట్లాడుతూ చెరువు శిఖం భూమి ఇప్పటికే దాదాపుగా 100 ఎకరాల ఆక్రమణకు గురైందని, ఆక్రమణకు గురైన భూమిని చదును చేసి పంటలు కూడా సగు చేస్తున్నారని వారు తెలిపారు.దీనిపై గతంలో కూడా ఫిర్యాదు చేసినా, పత్రికలలో వార్తా కథనాలు వచ్చినా అధికారులు చర్యలు తీసుకోలేదని అన్నారు. ఇప్పటికైనా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి చొరవ చూపి చెరువును కబ్జాదారుల నుండి కాపాడాలని, అధికారులు, పోలీసులు రెవెన్యూ చట్టం ప్రకరం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.లేని ఎడల జిల్లా కలెక్టర్‌కు తాము ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హౌజ్‌బుజుర్గ్ గ్రామ రైతులు మొగిలిచర్ల వీరస్వామి,షేక్ ఖాసిం, సయ్యద్ మహమూద్, షేక్ సలీం పాషా, పిట్టల రాజు, షేక్ ఉమర్, దినేష్,షేక్ నెమత్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** తెలంగాణ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ పార్లమెంటు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సత్కరించారు. అనంతరం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న దేవాదుల ప్రాజెక్టు పనులపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఎమ్మెల్యే కడియం శ్రీహరి చర్చించారు. నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగునీటిని అందించటానికి దేవాదుల ప్రాజెక్టు పనులను పూర్తి చేయాల్సినవసరం ఉందని కావున ప్రత్యేక చొరవ తీసుకొని చర్యలు చేపట్టాల్సిందిగా మంత్రికి వినతిపత్రం అందచేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దేవాదుల పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

## రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి

**సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**

**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు ,విత్తనాలు అందుబాటులో ఉంచాలని వ్యవసాయాధికారులను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదేశించారు. వానకాలం సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభం కాకముందే జూన్‌లోనే ఎకరానికి రూ. 7500లు రైతు భరోసా నిధులు విడుదల చేయాలని ఉమ్మడి రాష్ట్రంలో ఎరువులు, విత్తనాల కోసం చెప్పులు లైన్‌లో పెట్టినట్టు ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మళ్లి పాస్‌బుక్‌లు లైన్‌లో పెట్టే పరిస్థితి నెలకొన్నదన్నారు. నకిలీ విత్తనాలపై వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే పీడా యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని, రైతులకు సబ్సిడీ పై ఎరువులు ,విత్తనాలు అందించి బ్యాంకుల ద్వారా ఋణాల అందించేలా చర్యలు చేపట్టాలని వనగండ్ల వర్షంతో నష్టపోయిన మామిడి రైతులను వరి దాన్యం తడిసి నష్టపోయిన రైతాంగాన్నికి నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## కాకతీయ తోరణం, చార్మినార్ చిహ్నం తొలగించవద్దు

**మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి**

**ప్రజాపక్షం/పాపన్నపేట :** తెలంగాణ రాష్ట్ర చిహ్నంలో ఉన్నటువంటి కాకతీయ తోరణం, చార్మినార్ చిహ్నం తొలగించాలనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ళ శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ అధికారిక గీతంలో కాకతీయ, చార్మినార్ లాంటి మహా కట్టడాల అద్భుతాలను కీర్తిస్తూ, అధికారిక చిహ్నంలో వాటి గుర్తులను తొలగించాలనే ఆలోచన మూర్ఖత్వపు చర్యని వారు కొనియాడారు. రాష్ట్ర చిహ్నం నుంచి కాకతీయ తోరణం, ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచిన చార్మినార్ లను తొలగిస్తే ప్రజా ఉద్యమం తప్పదన్నారు. కావాలనుకుంటే ఇప్పుడున్న రాష్ట్ర చిహ్నంలోనే మరికొన్ని చిహ్నాలను చేర్చుకుంటే ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.

## మట్టి, ఇసుక వాహనాల పట్టివేత



**ప్రజాపక్షం/బెజ్జంకి :** మండల పరిధిలోని గాగిల్లాపూర్ గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు నుండి అనుమతులు లేకుంగా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను, చీలాపూర్‌పల్లి నుండి బెజ్జంకి గ్రామానికి అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్లను, జేసిబిని మంగళవారం టాస్క్‌ఫోర్స్, పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక,మట్టిని తరలిస్తే వారిపై చట్టపరమైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఆగని మట్టి అక్రమ రవాణా దందా

**చోద్యం చూస్తున్న మైనింగ్, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులు**



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండలంలో మైనింగ్ పర్మిషన్ పేరుతో ప్రైవేట్‌కు మట్టిని అమ్ముకుంటూ రాత్రి, పగలు అనే తేడా లేకుండా హిటాచిల సహాయంలో టిప్పర్‌లలో మట్టిని నింపి అక్రమంగా తరలిస్తున్న మట్టి మాఫియాపై జిల్లా మైనింగ్, రెవెన్యూ, పోలీసులు, ఇరిగేషన్ అధికారులు ఎందుకు వీరిపై చర్యలు తీసుకోవడం లేదంటూ మండల ప్రజలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. మండలంలో మట్టి అక్రమ రవాణా దర్జాగా కొనసాగుతున్నా అధికారులు వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ అక్రమ మైనింగ్ మట్టి మాఫియాకు అధికార పార్టీ నేత ఒకవైపు, అధికారులు మరోవైపు ఉండి ఈ అక్రమ సంపాదనకు అలవాటు పడ్డారా అనే అనుమానం ప్రజల్లో ఆలోచన రేకెత్తిస్తుంది. మండలంలో ఒక వైపు గుట్టను పిండి చేసి సొమ్ము చేసుకుంటుంటే మరోవైపు కెనాల్ కాలువ మట్టిని సైతం వదలకుండా అమ్ముకొని సొమ్ము చేసుకోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా వీరికి మైనింగ్ అధికారులు పర్మిషన్ ఎలా ఇస్తారంటూ పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మైనింగ్, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులు నిద్ర మత్తును వీడి మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి దంపతులతో పాటు కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. భద్రకాళి అమ్మవారికి ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలు సంతోషంగా ఉన్నారని, సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలంతా ఆయూరారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు తెలిపారు.

## 17 ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలు పూర్తి

**కలెక్టర్ భవేష్ మిశ్రా**



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఆరోగ్య ఉప కేంద్రాలు నిర్మాణం తదితర అంశాలపై వైద్య, టిజియండిసి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా 63 ఉప ఆరోగ్య కేంద్రాలు నిర్మాణానికి చర్యలు చేపట్టగా 17 పూర్తి కాగా, 23 పురోగతిలో ఉన్నాయని, 9 నిధులు సమస్య వల్ల ప్రారంభం కాలేదని, 7 ఇంకనూ చేపట్టాల్సి ఉందని, 7 చోట్ల స్థల సమస్య ఉన్నట్లు తెలిపారు. వీటిలో 47 జాతీయ ఆరోగ్య మిషన్ నిధులతో చేపట్టినట్లు తెలిపారు. టెండర్ దాఖలు కాని వివరాలు అందచేయాలని ఆదేశించారు. 6 చోట్ల కేంద్రాలు నిర్మించాల్సి ఉందని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. డిఎంఎఫ్టీ నిధులతో చేపట్టిన భవనాలు నిర్మాణాలు పూర్తి చేయుటకు చర్యలు చేపట్టాలని తెలిపారు. బాగిర్తిపేట, చెన్నాపూర్, చిన్నకోడెపాక, రంగయ్యపల్లి నిర్మాణాల్లో జాప్యానికి కాంట్రాక్టరుకు నోటీసులు జారీ చేయాలని అన్నారు. బుద్దారం, చల్లగరిగలో శిథిలావస్థలో ఉన్న భవనాలు తొలగించి పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్మాణం పూర్తయిన భవనాలకు సంబంధిత మెడికల్ అధికారి నుండి ధృవీకరణలు తీసుకోవాలని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరుపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పర్యవేక్షణ శాఖలు, ఇప్పటి వరకు యంబి నమోదులు, చెల్లించిన బిల్లులు, పెండింగ్ బిల్లులుపై నివేదిక ఇవ్వాలని ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, టిజియండిసి డిఈ నాగిరెడ్డి, పంచాయతీ రాజ్ డిఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ మార్గంలో పయనం

**మంత్రి సీతక్క**



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి :** ప్రతి ఒక్కరు సంత్ సేవాలాల్‌ను అదర్శంగా తీసుకొని ఆయన మార్గంలో నడవాలని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని కొంపెల్లిలో సంత్ సేవాలాల్ మహారాజ్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ సేవాలాల్ మహారాజ్ సంఘ సంస్కర్తగా పనిచేశారని అన్నారు. ఆయన పరమపదించి దాదాపు రెండు వందల సంవత్సరాలు దాటిన కూడా సేవాలాల్ మహారాజ్‌ను దైవంగా భావిస్తున్నారంటే ఆయన చేసిన బోధనలు, అనుసరించిన మార్గం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. అహింసా మార్గాన్ని అవలంబించాలని, అనర్థాలకు కారణమయ్యే మద్యపానానికి దూరంగా ఉండాలని, మహిళలను గౌరవించాలని సేవాలాల్ చేసిన బోధనలు ప్రతి ఒక్కరికి అనుసరణీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. సామాజిక రుగ్మతలను పారద్రోలేందుకు సేవాలాల్ మహారాజ్ గొప్పదనం గురించి, ఆయన చేసిన బోధనలు భవిష్యత్ తరాలకు సైతం అందేలా కృషి చేయాల్సిన బాధ్యతను గుర్తెరిగి ముందుకు సాగాలని మంత్రి సీతక్క సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి రాములు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

**డిఎస్‌పి సంపత్‌రావు**



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** నకిలీ విత్తనాలు సరఫరా జరగకుండా పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి నకిలీ విత్తనాలు, మందులను నియంత్రించాలని భూపాలపల్లి డిఎస్పి సంపత్ రావు అన్నారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో భూపాలపల్లి సబ్ డివిజన్ పరిధిలోని అందరు వ్యవసాయ, పోలీసు శాఖల అధికారులతో డీఎస్పీ సంపత్ రావు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ భూపాలపల్లి సబ్ డివిజన్ పరిధిలో రాబోయే వానాకాలం నకిలీ విత్తనాలు సరపరకాకుండా నియంత్రించడానికి ఈ సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఫర్టిలైజర్ యజమానులు నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సబ్ డివిజన్ పరిధిలో ఉన్న మండలాల్లో వ్యవసాయ పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి నకిలీ విత్తనాల దందాను కట్టడి చేయాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు విధిగా ఫర్టిలైజర్ యజమానులు రసీదు ఇవ్వాలని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు రుజువైతే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్, భూపాలపల్లి టౌన్ సిఐ నరేష్ కుమార్, సబ్ డివిజన్ ఎస్ఐలు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## ముగింపు దశకు ధాన్యం కొనుగోళ్లు

**కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్**



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** ధాన్యం కొనుగోళ్లు ముగింపు దశకు చేరాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్ని త్వరగితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్తబస్తీలో గల ఎంపియుపిఎస్ ఉర్దు మీడియం, శామీర్‌పేటలోని జిల్లా పరిషత్ స్కూల్, ప్రాథమిక పాఠశాల, ఎల్లంల గ్రామంలోని ఎంపిపిఎస్, బాణాపురంలోని ప్రాథమిక పాఠశాలల పనులను పరిశీలించారు. రఘునాథపల్లి మండలంలోని అశ్వరావుపల్లి, వెల్ది గ్రామాల్లోని ఐకెపి, పిఏసిఎస్ సెంటర్లలో ధాన్యం కొనుగోళ్లను తనికీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు వచ్చాయన్నారు. జూన్ 1 నుండి రుతుపవనాలు రానున్న నేపథ్యంలో మరింత వేగంగా ధాన్యాన్ని తరలించాలని ఆదేశించారు. జిల్లాలో 195 ధాన్య కొనుగోళ్ల ఏర్పాటు చేయగా 185 కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలు పూర్తి అయ్యాయన్నారు. ఇప్పటి వరకు 24వేల 559 మంది రైతుల నుండి లక్షా 25వేల 163.360 మెట్రికల్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 23వేల 413 మంది రైతులకు 25 6.18 కోట్ల రూపాయలు చెల్లించడం జరిగిందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు వెంటనే పూర్తి చేయాలని, పాఠశాలలు ప్రారంభించే నాటికి మౌళిక వసతుల లేమీ లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టే పనుల్లో ప్రమాణాలు పాటించాలని, పనుల్లో వేగం పెంచాలని, నిర్దేశిత గడువులోపు పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 291 పాఠశాలల్లో పనులు చేపట్టగా 93 పాఠశాలల్లో మౌళిక వసతుల పనులు పూర్తి అయ్యాయన్నారు. సుందరీకరణ పూర్తి చేయాలని, ప్రధానంగా తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం వంటి ప్రాథమిక అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఓ రాము, డిసిఎస్ఓ రోజారాణి, డిఆర్‌డిఓ మొగులప్ప, ఇఎం సిఎస్ ప్రసాద్, సివిల్ సప్లయ్ డిటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ముంపు ప్రాంతాల రక్షణకు ప్రణాళికలు సిద్ధం చేయాలి



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి :** జిల్లాలోని ముంపు ప్రాంతాల రక్షణకు పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం గోవిందరావుపేట మండలంలోని ప్రాజెక్టు నగర్ గ్రామాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పి షబరీష్‌తో కలిసి సందర్శించి ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలను అంచనా వేసి ప్రాజెక్టునగర్ గ్రామం ముంపుకు గురి కాకుండా ఉండాలంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై గ్రామస్తులతో మాట్లాడారు. వాటికి సంబంధించిన పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేసి తమకు వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ గ్రామస్తులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం వెంటనే పనులు ప్రారంభం ఔతాయని, ఎవరు ఆందోళన చెందవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ కె నారాయణ, గోవిందరావుపేట మండల డిఈసిహెచ్ శ్రీనివాస్, తాడ్వాయి మండల డిఈ సదయ్య, ఏఈ హర్షద్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తం

**జిల్లా వైద్య, ఆరోగ్యశాకాధికారి కళావతి బాయి**



**ప్రజాపక్షం/మహాబాబాబాద్ ప్రతినిధి :** మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాకాధికారి డాక్టర్ కళావతి బాయి, డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ములకలపల్లి, మన్నెగూడెం, కురవిర ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఉప్పరపల్లి ఆరోగ్య ఆయుష్మాన్ మందిరాలు, (సబ్ సెంటర్లు) సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కళావతి భాయి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల నమోదు 12 వారాలలోపు నమోదు చేయాలని, సాధారణ ప్రసవాలను, ప్రోత్సహించాలని, మొదటి రెండు చెకప్‌లు వైద్యాధికారితో పరీక్షలు చేయించాలని, మూడు నాలుగు చెకప్‌లు, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో ఉన్న గైనకాలజీ డాక్టర్ చే పరీక్షలు చేయించుకోవాలని, గవర్నమెంట్ హాస్పిటల్లో లభించే సేవలపైన ప్రజలలో అవగాహన కల్పించాలని, రానున్న వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులు ముఖ్యంగా మలేరియా చికెన్ గునియా, ఫైలేరియా, డెంగు జ్వరాలు, వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. అదే విధంగా సబ్ సెంటర్లో ఉన్న రికార్డులను పరిశీలించినట్టు తెలిపారు. ఎక్స్పెక్టెడ్ డేటాఫ్ డెలివరీ క్యాలెండర్లను మెయింటైన్ చేయాలని, ఐఇసి మెటీరియల్ సబ్ సెంటర్లో అవగాహన కల్పించే విధంగా పోస్టర్స్ అంటించాలని, ఆదేశించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిపిహెచ్ఎన్ఓ మంగమ్మ, వైద్యాధికారి డాక్టర్ కవిత, డాక్టర్ దుర్గాభవాని, ఎం ఎల్ హెచ్ పీలు రచన, ఆరోగ్య కార్యకర్త, రచన, రాఘవమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధి పనుల పరిశీలన

**వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య**



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పాఠశాలల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య అన్నారు. బుధవారం వరంగల్‌లోని మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఇస్లామియా పాఠశాల, క్రిస్టియన్ కాలనీ ప్రభుత్వ పాఠశాల, గ్రెయిన్ మార్కెట్ పాఠశాల, ఎనుమాముల మార్కెట్ వద్ద గల జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలలో జరుగుతన్న అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని త్వరితగతి పూర్తి చేసి పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు అందించాలని సూచించారు. అనంతరం వరంగల్ శివనగర్‌లోని తెలుగుతల్లి మహిళా సమాఖ్య ద్వారా నిర్వహిస్తున్న ఏకరూప దుస్తుల తయారీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. కుదుతున్న దుస్తులను పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఈవో వాసంతి తదితరులు పాల్గొన్నారు.

## గడువులోగా పనులు పూర్తి చేయాలి

**కలెక్టర్ రాహుల్ రాజ్**

**ప్రజాపక్షం/పాపన్నపేట :** పాఠశాల ప్రారంభమై నాటికి అమ్మ ఆదర్శ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని పొడ్చన్‌పల్లి, ఎల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో ఆకస్మికంగా సందర్శించి అమ్మా ఆదర్శ కమిటీల ద్వారా గుర్తించి జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఆయా స్కూళ్ళలో మరమ్మతు పనులు పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలన్నారు. స్కూళ్ళలో నీటి సరఫరా, విద్యుత్ పరికరాల ఏర్పాటు, మరుగుదొడ్ల మరమ్మతు,



నీటి సదుపాయం, పాఠశాలల ఆవరణలో మరమ్మతు తదితర పనులపై ఆయా మండలాలు మున్సిపల్ పరిధిలో ఎన్ని స్కూళ్ళలో పనులు మొదలు పెట్టారు? ఎన్ని పూర్తి అయ్యాయో చర్చించారు. పనులు నాణ్యతతో చేయించాలని, ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనులు గడువులోగా పూర్తి చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, పిఆర్ ఏఈ గోపాల్, నాగరాజు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**సకాలంలో ఏకరూప దుస్తులు అందించాలి**

కుట్టు మిషన్ కేంద్రాలలో తయారు చేస్తున్న విద్యార్థుల ఏకరూప దుస్తులను సకాలంలో విద్యార్థులకు అందించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మండల పరిధిలోని పోడ్చన్‌పల్లి లో మహిళ స్వశక్తి సంఘం ఆధ్వర్యంలో లో నిర్వహిస్తున్న కుట్టు మిషన్ కేంద్రాన్ని బుదవారం కలెక్టరు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు నాణ్యమైన ఏకరూప దుస్తులు తయారు చేసే అందించాలని, పాఠశాల పున ప్రారంభం అయ్యే లోపు ఏకరూప దుస్తులు తయారు చేసే పాఠశాల ప్రారంభం ఆయన తర్వాత విద్యార్థులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, సంబంధిత స్వశక్తి మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## టెండర్ ధాన్యం, సిఎంఆర్ ఇచ్చేందుకు సిద్ధం

**సిద్దిపేట రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమురవెల్లి చంద్రశేఖర్**



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** యాసంగి, రబీ సీజన్‌కు 2023–24 సంబంధించి 1.75 లక్ష ల మెట్రిక్ టన్నుల టెండర్ ధాన్యం సిఎంఆర్ ఇవ్వటానికి సిద్దిపేట జిల్లా మిల్లర్లు సిద్ధంగా ఉన్నార ని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొమురవెల్లి చంద్రశేఖర్ వెల్లడించారు. మిల్లర్లు సిఎంఆర్ ఇచ్చేందుకు సిద్ధంగా లేరని అధికారులు చెప్పటం సమంజసం కాదన్నారు. లారీలు ఎప్పుడు పెట్టిన తాము ధాన్యం లోడ్‌చేసి ఇస్తామని స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లాకు సంబంధించి 150 మిల్లులవి 100 కోట్లు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021–22 తర్వాత ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరగటంతో మిల్లులకు ధాన్యం కెపాసిటి మించి దిగుమతి చేసినట్లు తెలిపారు. అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సఖ్యత లేని కారణంగా మరాడించిన దిగుమతి చేసుకోవటానికి సరిపడు గోడౌన్లు లేక పోవటంతో మిల్లర్ల వద్దనే ధాన్యం ఉండిపోయిందన్నారు. స్థలం భావం ఫలితంగా రబీ సీజన్‌కు సంబంధించి సిఎంఆర్ దిగుమతికి ఒక్కొక్క లారీ దిగుమతి చేసుకోవటానికి మూడు నుండి నాలుగు రోజులు వేచియుండాల్సిన పరిస్థితి ఉందన్నారు. అదే విధంగా 2023 యాసంగి సంబంధించి టెండర్ ధాన్యం నిల్వ ఉంచిన నేపథ్యంలో తరుగు, హామాలి, గోదాం అద్దే కలుపుకొని క్వింటల్‌కు రూ.500 రూపాయిలు చెల్లించాలని ప్రభుత్వానికి ఇప్పటికే పలుమార్లు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. 2019వరకు జిల్లాలో 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉండగా 2024 వచ్చే సరికి 4 లక్షల మెట్రిక్ టన్నులకు చేరిందని అందుకు అనుగుణంగా ప్రభుత్వ గోదాంల సంఖ్య పెరగలేదన్నారు. ధాన్యం కొనుగోలుకు టెండర్ డబ్బులను చెల్లించినప్పటి జిల్లా అధికారులు డిస్పాచ్ లేటర్ ఇవ్వటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తమకు వెంటనే డిస్పాచ్ లేటర్ అందచేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి బుచ్చయ్య, ఉపాధ్యక్షుడు బాలకిషన్‌రావు,సహాయకార్యదర్శి బుచ్చయ్య, సభ్యులు కాశీనాథ్, ఉప్పలభూపతి పాల్గొన్నారు.

# ఉద్యోగుల నియామకంలో రూ.10కోట్ల స్కాం?

గత కలెక్టర్ వర్సెస్ 44 ఉద్యోగులు

రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు ఆనాటి కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, అధికారుల బలి?

హైకోర్టు చుట్టూ బాధితుల ప్రదక్షిణాలు




ప్రజాపక్షం

వేలంపాటల 'పారిశుద్ధ్యం'!

ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధిః**(నిర్మల్,బైంసా మున్సిపల్ ఉద్యోగులనియామకంలో దాదాపు రూ.10కోట్లకు పైగా స్కాం జరిగిందని, 2021లో నోటిఫికేషన్ వేయకుండా గుట్టు చప్పుడు కాకుండా మున్సిపల్ చైర్మన్ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఒక్కొక్క ఉద్యోగానికి రూ.10 లక్షల నుండి 15 లక్షల వరకు వసూలు చేశారనే ఆరోపణలున్నాయి. టిఆర్ఎస్ నాయకులు చేసిన తప్పిదలకు అప్పటి జిల్లా కలెక్టర్‌కు, హైకోర్టుకు వెళ్లి తమకు వేతనాలు ఇవ్వాలని కోరడం, స్థానిక అధికారులకు సామాన్లు జారీ చేయడం దీంతో గత మాజీ కలెక్టర్ ముషారఫ్ పారుఖీ అక్రమంగా పొందిన ఉద్యోగులను తొలగించే వరకు తాను కూడా హైకోర్టుతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధపడడం, నిర్మల్‌లో మారిన రాజకీయ సమీకరణాలు, గత ప్రతిపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి మౌనంగా ఉండడం, రాజకీయ విమర్శలకు భావిస్తుంది. ఈ స్కామ్‌లో నోరుమొధకపోవడం ఏదైనా ఒప్పందం జరిగిందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.)

నిర్మల్ మున్సిపాలిటీలో అక్రమంగా పారిశుద్య కార్మిక ఉద్యోగాలను లక్షల రూపాయలలో అమ్ముకున్నారని గతంలో అనేక సార్లు ప్రజాపక్షం దినపత్రికలో కథనాలు వెలువడిన సందర్భాలు తెలిసిందే.గత రాజకీయ నాయకుల ఒత్తిడికి తలోగ్గి ఉద్యోగులను అడ్డగోలుగా అక్రమాలుగా అందినకాడికి అందుకొని ఉద్యోగ నియామకాలు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రతిపక్ష పార్టీ బిజెపి, కాంగ్రెస్ నాయకులు అనేకసార్లు ధర్నాలు దీక్షలు చేసి ఉద్యోగుల నియామక రద్దుకు డిమాండ్ చేశారు.ఏది ఏమైనప్పటికీ ఆనాటి కలెక్టర్ ముషారఫ్‌కు హైకోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. కలెక్టర్ అరెస్టు అంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పుకు ఒక్కసారిగా నిర్మల్ పట్టణం మొత్తం ఉలిక్కిపడింది. ఇంతవరకు మున్సిపాలిటీలో ఉన్న 44 ఉద్యోగ నియామకాలు రద్దయినట్లు నిర్మల్ మున్సిపల్ పిహెచ్ అండ్ నాన్ పిహెచ్ వర్కర్స్ ఉద్యోగాలపోస్టింగ్‌నెం.ఎన్.యం.సిఎస్/సి1/393 /2021 :2022 సంవత్సరం ఏడో నెల 15న మున్సిపల్ కార్యాలయంలోనోటీసు జారీ చేసిన విషయం తెలియదా..?రాజకీయ నాయకులు చేసిన తప్పులకు కష్టపడి ఉద్యోగాలు తెచ్చుకున్న అధికారులకు హైకోర్టు అరెస్టు ఆదేశాలు ఇవ్వడం ఆశ్చర్యానికి గురి చేసింది.ఆనాటి టిఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మన్,అధికారులు,నాయకులు ఒక్కొక్క మున్సిపల్ పారిశుద్ధ కార్మిక ఉద్యోగాలకై రూ.10 నుండి 15 లక్షల వరకు వసూలు చేసినట్లు ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆందోళన చేసిన విషయం విదితమే. దాదాపు రూ.10 కోట్లకు పైగానే అక్రమంగా మున్సిపల్ లో స్కాం జరిగిందని సమాచారం.ఇది ప్రపంచానికి తెలిసిన విషయం వారికి తెలియదా? ఇంత జరుగుతున్న ఉద్యోగులు ఇంకా కొనసాగుతున్నారంటూ వారికి జీతాలు ఇవ్వాలని ఆనాటి కలెక్టర్ ముషారఫ్ పారుఖీపై చర్యలు తీసుకోవాలని అడ్డగోలుగా ఉద్యోగాలు సంపాదించిన భాదితులు హైకోర్టుకు వెళ్లడంతో ఆనాటి కలెక్టర్‌కు హైకోర్టు సమన్లు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు జరగడంతో టిఆర్ఎస్ ప్రభుత్వం ఓటమి చెందడం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో నిర్మల్‌లో ఉన్న ఆనాటి టిఆర్ఎస్ రాజకీయ నాయకులను ఉక్కిరిబిక్కిరి చేసిందని చెప్పాలి. చివరకు 44 మంది ఉద్యోగాలు ఎక్కడ ఊడిపోతాయో అన్న భయంతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీలో చేరి తమ ఉనికి చాటుకోవాలన్న ప్రయత్నం జరుగుతుందన్నవార్తలు వినవస్తున్నాయి.వారికున్న అవినీతి మరకలను ఈరోజు కాంగ్రెస్ పార్టీకి పుయ్యడమే అవుతుందేమో నిర్మల్‌లో ఉన్న కాంగ్రెస్ నాయకులు దీన్ని గ్రహించకుండా పార్టీలో చేర్చుకున్నారు. తన అవసరాల నిమిత్తమే చేర్చకున్నారా లేక జరిగిన అవినీతిని బయటకుతీస్తారా లేదా అనేది ఇంకా వేచి చూడాల్సిందే. ఈ 44 మంది మున్సిపల్ ఉద్యోగులను వెంటనే తొలగించాలని ఆనాడు కాంగ్రెస్ కూడా ఆందోళన కార్యక్రమా లు చేపట్టింది.ఇ ంత అవినీతి మచ్చ ఉన్న టిఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లో చే ర్చుకోవడం లాభమా నష్టమా అనేది లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత తెలిపోనుంది.44 మున్సిపల్‌ఉద్యోగులనుకాపాడుకునేందుకు కాంగ్రెస్ చుట్టూ తిరుగుతున్నారని నిర్మల్ పట్టణంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అడ్డగోలుగా ఉద్యోగాలు పొందిన భాదితులు తమకు వేతనాలు ఇవ్వాలని హైకోర్టుకు వెళ్లడంతో అటు అధికారులు ఇటు ఉద్యోగులు మధ్య హైకోర్టులో వాదనలు నడుస్తున్నాయి.ఏది ఏమైనా తొలగించిన ఉద్యోగులకు జీతాలు ఎలా ఇస్తామంటూ హైకోర్టులో గత కలెక్టర్ ముషారఫ్ పారుఖీ వాదిస్తున్నారు.

**44 మునిసిపల్ ఉద్యోగుల ఫైలు మాయం?**

నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో 44 ఉద్యోగుల ఫైలు మాయమైనట్లు మున్సిపల్ కమిషనర్ అన్నారు.గతంలో ఉన్న మున్సిపల్ కమిషనర్ మాయం చేశారా లేక ఎలా మాయమైనది తమకు తెలియదని,ఆఫీసులో మాత్రం ఎలాంటి ఫైల్స్‌లేవని మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు. మాయం కావడానికి మున్సిపల్ ఉద్యోగులు కారణమా లేక చైర్మన్ కారణమా అనేది విచారణ చేపడితేనే తేలే అవకాశం ఉందని అంటున్నారు. తమకు ఉద్యోగాలు రావని ఈ కుట్ర చేశారనేది స్పష్టంగా కనిపిస్తుంది.జిల్లా కలెక్టర్ విచారణ జరిపిస్తారా..లేక ఉద్యోగులను కొనసాగిస్తారా అనేది చూడాలి.

**ఒకే సామాజిక వర్గానికి 18 ఉద్యోగాలు!**

ఒకే సామాజిక వర్గానికి చెందిన 18మందిని మున్సిపల్ పారిశుద్ధ కార్మిక ఉద్యోగులుగా నియమించారనే విమర్శలు కూడా లేకపోలేదు. మున్సిపల్ చైర్మన్ వారి సామాజిక వర్గానికి చెందిన వారికే ఉద్యోగం ఇప్పించారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

**విధివిధానాలుపాటించకుండానే పోస్టుల ఎంపిక?**

మున్సిపల్ చైర్మన్,కౌన్సిలర్ల ఒత్తిడి మేరకే నాలుగో తరగతి పోస్టు ఎంపిక ప్రక్రియ కొనసాగింది అనేది అధికారుల మాట.ఇలా ఉంటే ఉద్యోగుల ఎంపిక ప్రక్రియలో విధి విధానాలు పాటించకుండా అసలు ఫైనాన్స్ క్లియరెన్స్ తీసుకోకుండా ఉన్నతాధికారులు తప్పుదోవ పట్టించేలా మున్సిపల్ పారిశుద్ధ కార్మికుల ఎంపిక చేపట్టారు అంటూ సి.డి.ఎం.ఎ సీరియస్‌గా తీసుకొని నిర్మల్, బైంసా కమిషనర్లకు సస్పెన్స్ వేటు వేసింది. దీంతో రెండేళ్ల క్రితం జరిగిన నియామకాలపై తాజాగా స్పందించిన తీరు కూడా చర్చనీయాంశంగా మారింది.ఆనాటి కలెక్టర్, కమిషనర్లకు వ్యతిరేకంగా కోర్టు తీర్పు,దీంతో నిర్మల్ పూర్వ కలెక్టర్ ముష్రాఫ్ అలీకి స్టే ఇవ్వడంతో ఊపిరి పీల్చుకున్నట్లు అయింది.మున్సిపల్‌ఉద్యోగాలపైనోటాఫికేషన్ ఇవ్వకుండా ఎంపిక ప్ర క్రియ చేశారని, హైకోర్టులో గత కలెక్టర్ ముషారఫ్ పారు ఖీ ఉద్యోగాలను రద్దు చేసినట్లు తేదీ 15.07.2022న నోటీసు జారీ చేసినట్లు హైకోర్టుకు నివేదిక ఇచ్చినట్లు తెలుస్తుంది.గత ప్రభుత్వంలో ఉన్న రాజకీయ నాయకుల ఒత్తిడితోనే జరిగిన అక్రమ ఉద్యోగులకు తమను బలి చేయడం సరైంది కాదని మాజీ కలెక్టర్ సంబంధించిన లాయర్ వాదించినట్లు తెలుస్తుంది.

**ఫైళ్లు మాయంపై నిర్మల్ జిల్లా కలెక్టర్ సీరియస్?**

2022లో మున్సిపల్ పారిశుద్ధ కార్మిక ఉద్యోగాల నియమాకాలకు సంబంధించిన ఫైలు మాయం కావడంపై నిర్మల్‌కలెక్టర్‌కూడా దృష్టి పెట్టినట్లు తెలుస్తుంది. ఎంతటి వారైనా తప్పు చేస్తే శిక్ష తప్పదు అంటూ కలెక్టర్ తన కంటూ ప్రత్యేక పేరు తెచ్చుకున్న విషయం తెలిసిందే. మున్సిపల్‌లో జిరిగిన అవినీతి అక్రమాలపై దృష్టి సారించినట్లు సమాచారం. నాయకులు చేసిన తప్పిదాలకు ఐఏఎస్ అధికారి,ఉన్నత అధికారులు బలి కావడం సరి కాదని, కలెక్టర్ సీరియస్ గానే దృష్టి పెట్టినట్లు పలువురు అధికారులు అంటున్నారు.

## నిందితుడు అరెస్ట్



**ప్రజాపక్షం/జైపూర్ :** చోరీలకు పాల్పడుతున్న సల్పల శ్రీనివాస్ అనే నిందితుడిని అరెస్ట్ చేసినట్లు రామగుండం సిపి ఎం. శ్రీనివాస్ తెలిపారు. బుధవారం జైపూర్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నిందితుని వద్ద నుండి 3 తులాల బంగారు నెక్లెస్‌లు, 9 తులాల బంగారు గొలుసులు, 2 బంగారు మాటీలు, 2 ఇయర్ రింగ్స్, మూడు బంగారు ఉంగరాలు, 6 తులాల వెండి కాళ్ళ పట్టీలు, రూ. 2, 62, 600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వేమనపల్లి మండలంలోని కేతనపల్లి గ్రామానికి చెందిన నెందూరి రామన్న తన ఇంట్లో మండలంలోని కల్మలపేట గ్రామానికి చెందిన సల్పల శ్రీనివాస్ దొంగతనానికి పాల్పడ్డాడని అనుమానంతో నీల్వాయి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని, కేసు విచారణలో భాగంగా నీల్వాయి ఎస్ఐ, చెన్నూర్ సిఐలు బృందాలను ఏర్పాటు చేసి చెన్నూరు పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. గాలింపు చర్యల్లో భాగంగా బుధవారం మల్లంపేట గ్రామంలో చేస్తున్న వాహనాల తనిఖీలో నింధితున్ని గుర్తించి అదుపులోకి తీసుకోని అతని వద్ద ఉన్న బ్యాగును పరిశీలించగా బంగారు, వెండి, నగదు లభించిందని తెలిపారు. కోర్టులో హాజరుపర్చడమైందన్నారు. నిందితుడు సల్పల శ్రీనివాస్‌పై గతంలో కూడా వేమనపల్లి మండలంలోని పలు గ్రామాల్లో అక్రమాలకుపాల్పడిన కేసులు నమోదయ్యాయని వెల్లడించారు.

## తాండూరు ఎస్ఐగా కిరణ్‌కుమార్



**ప్రజాపక్షం/ తాండూర్/ బెల్లంపల్లి :** తాండూర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా చిలుముల కిరణ్‌కుమార్ బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.అసాంఘికకార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. నేరాలను అదుపులో ఉంచడానికి, తన వంతు కృషి చేస్తానని, ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

## ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం



**ప్రజాపక్షం/ జైపూర్ :** రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెన్నూర్ ఎంఎల్ఎ గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం చెన్నూరు నియోజవర్గ పర్యటనలో భాగంగా జైపూర్ మండలం లోని ఇందారంలో పర్యటించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా అనేక అభివృద్ధి పనులు నిలిచి పోయాయని తెలిపారు. రైతులకు అండగా ఉండి చెన్నూరు నియోజకవర్గానికి సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు విషయంలో సుల్తానాబాద్, పెద్దపల్లి రైస్ మిల్లర్లతో కలిసి మాట్లాడడం జరిగిందని, జైపూర్ మండలం లోని సుమారు 95 శాతం వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా తరలించినట్టు తెలిపారు. జైపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ ఫయాజుద్దీన్, జైపూర్ మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు ఆసంపల్లి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముక్త శ్రీనివాస్, ఎంపిటిసి సంతోష్, మాజీ ఎంపిటిసి సుంకరి శ్రీనివాస్, నాయకులుపాల్గొన్నారు.

## 98 మంది విద్యార్థులు గైర్హాజరు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** నిర్మల్ జిల్లాలో బుధవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు 98 మంది విద్యార్థులు గైరాహారైనట్లు డి.ఐ.ఇ.ఓ జాదవ్ పరుశురాం తెలిపారు.1214 మంది విద్యార్థులకుగాను 1116 మంది విద్యార్థులు పరీక్ష రాశారని,ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించడం జరిగిందని వారు అన్నారు.

## కళావేదికను పునర్ నిర్మించాలి

**ప్రజాపక్షం/మెట్ పల్లి :** ఖాదీ గ్రామోద్యోగ్ సంస్థ ఆవరణలోని తొలిగించబడిన కళా వేదికను పుఃన నిర్మాణం చేయించాలని లలిత కళా సమితి కళాకారులు అన్నారు. మెట్ పల్లి పట్టణంలో ఖాదీ ఆవరణలో బుధవారం కళాకారులు నిరసన వ్యక్తం తెలియజేశారు. అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. దశాబ్దాల కాలంగా ఖాదీ ప్రతిష్ట ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు మన మెట్ పల్లి క్లబ్ ద్వారా నాటక ప్రదర్శనలకు శాస్త్రీయ జానపద నృత్య ప్రదర్శనలకు నీలమైన మన మెట్ పల్లి పట్టణ కళా రంగ కీర్తి మైభవాన్ని నాలుగు దశాబ్దాల. వ్యాప్తికి ఆధారమైన కేంద్ర బిందువు అయినా కళావేదిక తొలగించబడడం చాలా బాధాకరమని తెలిపారు. ఖాదీ ఆవరణలో పెట్రోల్ బంక్ పక్కన ఖాళీ స్థలంలో కళావేదిక నిర్మాణం చేసి పూర్వ వైభవాన్ని పుఃన ప్రతిష్టించి. భవిష్యత్తు తరాలకు మెట్ పల్లి కళా సాంస్కృతిక వారోత్సవాల వేదికగా అందించగలరని వారు కోరారు.వివిధ కళాసాహిత్యసంస్థల ప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రి విద్యానికేతన్ ప్రభంజనం



**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** ఇండియన్ స్కూల్ టాలెంట్ సెర్చ్‌ఎగ్జామినేషన్,బెంగుళూరు వారు ఇటీవల నిర్వహించిన ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ లో గాయత్రి విద్యానికేతన్ కి చెందిన 6 వ తరగతి విద్యార్థులు అల్లాడి నవదీప్ ఇంటర్నేషనల్ 57 వ ర్యాంక్, పెద్ది సాయి తేజ ఇంటర్నేషనల్ 76 వ ర్యాంక్, ఎం డి రెహాన్ ఇంటర్నేషనల్ 78 వ ర్యాంక్ సాధించి కాంస్య పతకాలు సాధించగా, సముద్రాల అభినవ్ ఇంటర్నేషనల్ 92 వ ర్యాంక్, చాట్ల శ్రీమాన్ ఇంటర్నేషనల్ 111 వ ర్యాంక్ మరియు 8 వ తరగతికి చెందిన ఉట్నూర్ చక్రిక ఇంటర్నేషనల్ 58 వ ర్యాంక్ సాధించగా వారికి పెద్దపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మెడల్స్ తో పాటు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అత్యుత్తమ ఇంటర్నేషనల్ ర్యాంకులు సాధించి మన పెద్దపల్లి జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన విద్యార్థులు మన జిల్లాకే గర్వకారణం అని, మెడల్స్ సాధించిన విద్యార్థులను, ప్రోత్సహించిన గాయత్రి విద్యానికేతన్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ పాఠశాలలో కేవలం విద్యను బోధించడం మాత్రమే కాకుండా ఇలాంటి జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఒలింపియాడ్ ఎగ్జామ్స్ లో విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించి, వారికి పోటీ పరీక్షల పట్ల అవగాహన కల్పించేలా కృషి చేస్తున్నామని, అందులో భాగంగానే ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో మా విద్యార్థులు అత్యుత్తమ ఇంటర్నేషనల్ ర్యాంకులు సాధించడం గర్వకారణమని, ర్యాంకులు సాధించిన విద్యార్థులను, కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్ పాల్గొన్నారు.

## ఎక్కువ ధరకు అమ్మితే చర్యలు



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** విత్తనాల డీలర్లు, దళారులు విత్తనాలను ఎక్కువ ధరకు విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ లోని పలు ఫెర్టిలైజర్ దుకాణాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి విత్తనాల నిల్వలు, ధరల పట్టికలను పరిశీలించారు. ఆయా దుకాణాలలో విత్తనాలు కొనుగోలు చేసిన రైతులను విత్తన ధరలపై వివరాలుఅడిగితెలుసుకున్నారు. విత్తనాల బ్యాగులను, రశీదులను పరిశీలించారు. రైతులు విత్తనాలు నాటిన తరువాత ఆ బ్యాగులను, రశీదులనుభద్రపరుచుకోవాలనిరైతులకు సూచించారు. దళారులు, డీలర్లు విత్తనాలను ఎక్కువ ధరకు విక్రయించినట్లయితే అధికారుల దృష్టికి తీసుకురావాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇం ఛార్జి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి క్రిష్ణారెడ్డి, ఆసిఫాబాద్ ఇంఛార్జి మండల వ్యవసాయ శాఖ అధికారి తిరుమలేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపు సమయంలో అప్రమత్తత తప్పనిసరి

ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్




**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి :** లోక్ సభ ఎన్నికలు 2024లో భాగంగా ఈ నెల 13న జరిగిన పోలింగ్‌కు సంబంధించి జూన్ 4వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి వి. రాములు, ప్రత్యేక ఉప పాలనాధికారి (ఎల్ఏ., ఆర్ఆర్) డి.చంద్రకళతో కలిసి కౌంటింగ్ సూపర్వైజర్లు, సహాయకులు, సూక్ష్మ పరిశీలకులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి (ఎస్సి) పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలో చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్లకు ఈ నెల 13న జరిగిన పోలింగ్‌కు సంబంధిత జూన్ 4వ తేదీన జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలో జరిగిన ప్రతి అంశం భారత ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్వహించవలసి ఉంటుందని, జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోనికి సరైన అనుమతి లేని వారిని, మొబైల్ ఫోన్లను అనుమతించరాదని తెలిపారు. విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బందికి వారికి జారీ చేసిన అనుమతి పత్రాలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని, జూన్ 4వ తేదీన ఉదయం 8 గంలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం అవుతుందని, ఉదయం 7.30 గంల లోపు అధికారులు, సిబ్బంది హాజరు కావాలని తెలిపారు. లెక్కింపు ప్రక్రియ ప్రారంభం అయిన వెంటనే 17సి ప్రకారం కంట్రోల్ యూనిట్‌లో పోలైన ఓట్లను సరి చూసుకోవాలని, సరిగా లేనట్లయితే సహాయ రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకురావాలని తెలిపారు. లెక్కింపు సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థికి సంబంధించి కౌంటింగ్ ఏజెంట్ లేవనెత్తిన అనుమానాలను నివృత్తి చేయాలని తెలిపారు. వి.వి. ప్యాట్ కౌంటింగ్ బూత్‌లలో ఏదైనా 5 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి లెక్కింపు జరుగుతుందని తెలిపారు. లెక్కింపు సమయంలో వెలువరించే ఫలితాల వివరాలను సూక్ష్మ పరిశీలకులు, పర్యవేక్షకులు ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా నమోదు చేసుకోవాలని, కౌంటింగ్ సమయంలో క్రమశిక్షణ పాటించాలని తెలిపారు. జూన్3న 2వ విడత శిక్షణ కార్యక్రమం ఉంటుందని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ఇంటర్నెట్ ఇతరత్రా అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, ఒఆర్ఎస్, వైద్య సిబ్బంది, అవసరమైన మందులను అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్ ఇతరత్రా ప్రతి అంశంపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసి ప్రతి అంశాన్ని పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏకరూప దుస్తుల తయారీ వేగవంతం

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**ప్రజాపక్షం/ప్రతినిధిః** ఏకరూప దుస్తుల తయారినీ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు.బుధవారం పట్టణంలోని మంజులాపూర్‌లో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏకరూప దుస్థులు తయారు చేస్తున్న టైలరింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.కలెక్టర్ మాట్లాడుతూ ఏకరూప దుస్తుల తయారీ ప్రక్రియ అత్యంత నాణ్యవంతంగా చేయాలని ఆదేశించారు. విద్యార్థుల సంఖ్య,ఇప్పటివరకు తయారైన,తయారు కావాల్సిన వాటి వివరాలు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం సోన్ మండలం న్యూవెల్మల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను కలెక్టర్ పరిశీలించి.నిర్ణిత గడువులోగా పాఠశాల మరమ్మత్తు పనులు,ఇతర నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. డీఈవో రవీందర్ రెడ్డి,డీఆర్డీవో విజయలక్ష్మి ,మున్సిపల్ కమిషనర్ రాజు,మేప్మా పీడి సూభాష్,పంచాయతీ రాజ్ ఈఈ శంకరయ్యఉన్నారు.

## చిరు వ్యాపారులపై వేధింపులు తగవు



**ప్రజాపక్షం/ఖానాపూర్:** నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణ కేంద్రంలో, వారసంత, చిరు వ్యాపారులను, మున్సిపల్ సిబ్బంది,చైర్మన్,వేధించడం సబబు కాదని,భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నిర్మల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.ఆర్.ఉపాలి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులకు ప్రకటన విడుదల చేశారు.గత వారం రోజుల నుంచి,చైర్మన్ మున్సిపాలిటీ కార్మికులు,పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ,రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిన్న వ్యాపారులపై నియమ నిబంధనలు పెడుతూ,వేధిస్తున్నారని,వారికి వెసులుబాటు కల్పించాల్సింది పోయి దురసుగా ప్రవర్తిస్తూ వ్యాపారుల పోట కొట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారని,ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ చిరు వ్యాపారులను వేధిస్తున్నారని,ఇది మానుకుని,అందరికీ సమన్యాయం చేయాలని,లేనట్లయితే బీదల బ్రతుకులు చిన్నాభిన్నమయ్యే అవకాశం ఉన్నదని,ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని ఆయన అన్నారు.లేదంటే పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని,ఆయన అన్నారు.

## గ్రూప్-1 పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష



**ప్రజాపక్షం/ కాగజ్ నగర్ :** జూన్ 9వ తేదీన జిల్లాలో జరగనున్న గ్రూప్1 పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. బుధవారం గ్రూప్1 పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలో గల వసుంధర డిగ్రీ, జూనియర్ కళాశాలలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను పరీక్షల ప్రాంతీయ సమన్వయ కర్త లక్ష్మీ నరసింహంతో కలిసి సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 9వ తేదీన జిల్లాలో జరగనున్న గ్రూప్ 1 పరీక్ష నిర్వహణ కొరకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పరీక్ష కొరకు స్ట్రాంగ్ రూమ్ నుండి ప్రశ్నాపత్రాలను పోలీసు శాఖ బందోబస్తు మధ్య పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, పరీక్ష నిర్వహణ కొరకు జిల్లాలో 13 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. బయోమెట్రిక్ విధానం ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షల నిర్వహణ జరుగుతుందని, అభ్యర్థులు పరీక్ష సమయానికి ఒక గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్షా కేంద్రంలోనికి సెల్ ఫోన్, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం జరగదని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు.

## 'చలానాలపై ఉన్న శ్రద్ధ ట్రాఫిక్ నియంత్రణపై లేదేమి?

ఎఐవైఎఫ్‌జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య సూటి ప్రశ్న



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రామగుండం కార్పొరేషన్ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు సందుల్లో దొంగల్లా నిలబడి ఇంట్లో నుండి బయటకు వెళ్లే పౌరులను బండ్ల నాపి డ్రైవింగ్ లైసెన్స్ పేరిట హెల్మెట్ పేరిట వేధిస్తున్నారని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య ఆరోపించారు. నిరంతరం రద్దీగా ఉండే గోదావరిఖని ప్రాంతంలో ప్రజలు ట్రాఫిక్ నియంత్రణ సరిగా లేక ఇబ్బందులు పడతూ ఉంటే దాని నియంత్రించే పనిని వదిలిపెట్టి ట్రాఫిక్ చలానాలు విధించడం, విధించిన ట్రాఫిక్ చలానాలను వసూలు చేయడమే పరమవదిగా ట్రాఫిక్ పోలీసులు పని చేస్తున్నారని ఆయన దూయబట్టారు. జాతీయ ,రాష్ట్ర హైవేలపై బండ్లు ఆపరాదని నిబంధనలు ఉన్నప్పటికీ హైవేలపై ట్రాఫిక్ పోలీసులు అడ్డ వేయడం కాక బండ్లు పట్టుకోడానికి కానిస్టేబుల్స్ పరిగెత్తే క్రమంలో కొంత మంది యువకులు భయపడి వెనుక వచ్చే వాహానాలను చూసుకోకుండా ప్రాణాలకు తెగించి బయటపడుతున్నారు ఇలాంటి సంఘటనలు జరగడం బాధాకరం. కొత్త కూరగాయల మార్కెట్లో గాని లక్ష్మీ నగర్ చౌరస్తా ,ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ , బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పూర్తిగా రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వాహానాలు నిలుపుతున్న వాళ్లపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా సామాన్య ప్రజలపై విరుచుకుపడుతున్న ట్రాఫిక్ పోలీసుల ఆగడాల పైన ఉన్నత అధికారులు దృష్టి సారించాలని ప్రజలను వీరి భారి నుండి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. పిల్లలను స్కూల్లో దింపడానికి కూరగాయలు తీసుకురావడానికి వెళ్లే వాహనదారులను హెల్మెట్ లేదని డ్రైవింగ్ లైసెన్స్ క్యారీ చేయడం లేదని ఫైన్లు విధించడం సరికాదని సూర్య అన్నారు .తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలను ప్రజలు పాటించాల్సిందే కానీ ట్రాఫిక్ పోలీసులు దర్జాగా అడ్డ వేయకుండా సందుల్లో దాక్కొని వాహనదారుడు దగ్గరకు వచ్చిన తర్వాత ఒకే సారి వాళ్ల మీదకు వచ్చి వాహానాన్ని ఆపడం వల్ల ఏదైనా అనర్థం జరిగితే దానికి బాధ్యులు ఎవరని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు చలానాలే కాదు ట్రాఫిక్ ని కూడా నియంత్రిస్తూ రోడ్లపై వాహానాలు నిలిపి ,రోడ్లపై వ్యాపారాలు చేస్తున్న వారిని నియంత్రించాలని సూర్య కోరారు.

## సకాలంలో పాఠశాలల పనులు

కలెక్టర్ అనురాగ్ జయంతి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మరమ్మత్తు పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. తంగళ్లపల్లి మండలం మండేపల్లి, నేరెళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ముస్తాబాద్ మండలం పోత్గల్, చీకోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద విద్యుత్ పరికరాలు, తాగునీటి వసతి ఏర్పాటు, మరుగుదోడ్లకు మరమ్మత్తు ఇతర పనులు కొనసాగుతుండగా, కలెక్టర్ అనురాగ్‌జయంతి,అదనపు కలెక్టర్ పూజా రి గౌతమితోకలిసి బుధవారం పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు.నాణ్యతాప్రమాణాలు పాటిం చాలన్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు.గడువులోగాయూనిఫామ్స్ అందించాలి. గడువులోగా యూనిఫామ్స్ అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. తంగళ్లపల్లి మండలం మండేపల్లి లోని భాగ్యలక్ష్మి మహిళ శక్తి టైలరింగ్ సెంటర్, ముస్తాబాద్ మండలం గూడెం లోని శ్రీ వీరాంజనేయ మహిళ శక్తి టైలరింగ్ సెంటర్ లలో స్కూల్ విద్యార్థులకు యూనిఫామ్స్ కుడుతుండగా కలెక్టర్, అదనపు కలెక్టర్ తో కలిసి పరిశీలించారు. జిల్లాలో 38 మహిళ సమాఖ్యాల పరిధిలోని 536 మంది మహిళలకు ఉపాధి లభిస్తుంది. ఇక్కడ డీఆర్డీఓ శేషాద్రి, డీఈఓ రమేష్ కుమార్, ఆర్అండ్ బీ డీఈ నాగరాజు, డీపీఎం సుధారాణి ఉన్నారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించండి : ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలని ఎఐఎస్‌ఎఫ్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ డిమాండ్ చేశారు. ఎఐఎస్‌ఎఫ్ కరీంనగర్ నగర ఆఫీస్ బేరర్స్ సమావేశం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో బుధవారం జరిగింది. ఈ సంధర్భంగా రమేష్ మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విద్యావ్యాపారం చేస్తున్నారని, పాఠశాలలు, కళాశాలల్లోనే పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థిక దోపిడీ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్పోరేట్ పాఠశాల, కళాశాలల యాజమాన్యాలు అనుమతులు రాక ముందే అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా టెక్నో, ఈ టెక్నో, ఒలంపియాడ్, వరల్డ్ అని ప్రచారం చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలలలకు అనుమతులు ఒక చోట నిర్వహణ మరొక చోట ఉన్నాయన్నారు. కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఇరుకు గదుల్లో తరగతుల నిర్వహణ చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నిర్వహణలో ఉన్న, ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీ చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, అనుమతిలేని విద్యాసంస్థల పేర్లు బహిర్గతం చేయాలని, లేనిచో డిఇఒ, డిఐఇఒ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నాయకులు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, వినయ్, సాయి, పొన్నం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణికి బకాయిలు చెల్లించండి

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య




**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన రూ.29 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. బుధవారం శ్రీరాంపూర్‌లోని ఎస్‌ఆర్‌పి3 గని వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం వైఫల్యంతో సింగరేణి సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, సంస్థకు వచ్చిన లాభాలను రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు దారి మళ్లించడంతో కార్మికులకు జీతాలు చెల్లించే పరిస్థితి లేదన్నారు. సింగరేణి భవిష్యత్తు బాగుండాలంటే నూతన బొగ్గు గనులను తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని చెల్లించవలసిన బకాయిలను చెల్లించాలన్నారు. సంస్థ నూతన యంత్రాల కొనుగోలుతోపాటు, ఈ వార్షిక సంవత్సరం వచ్చిన లాభాలను వెంటనే ప్రకటించి 35శాతం లాభాల వాటాను కార్మికులకు జూన్ నెలలోనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొముర‌య్య, ఫిట్ కార్యదర్శి మురళీ చౌదరి, మైనింగ్ స్టాఫ్ నాయకులు మారుపెల్లి బాబు, బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ కార్యదర్శిలు మోతె లచ్చన్న, రాంచందర్, మల్లికార్జున్, నాగేశ్వరరావు, మల్లేష్, రవి, రామోజీ, ప్రభాకర్, సురేష్, రాజకుమార్ పాల్గొన్నారు.

## అంజయ్య సేవలు మరువలేనివి

సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు



**ప్రజాపక్షం/మోటకొండూరు :** అయిలి అంజయ్య సిపిఐ పార్టీకి, ఇక్కుర్తి గ్రామ ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని, ఆయన లేని లోటు సిపిఐకి, అతడి కుటుంబానికి ఎవరూ తీర్చలేరని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. బుధవారం మోటకొండూరు మండలంలోని ఇక్కుర్తిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అయిలి అంజయ్య చిత్రపటానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, బిఆర్‌ఎస్ ఆలేరు నియోజకవర్గ ఇంచార్జి సూదగాని హరిశంకర్ గౌడ్‌లతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మోటకొండూరు మండల సిపిఐ కార్యదర్శి గాదగాని మాణిక్యం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సంతాప సభలో శ్రీరాములు మాట్లాడుతూ ఆయిలి అంజయ్య ఇక్కుర్తిలో చిన్నతనంలో భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ సాయుధ పోరాటాల స్ఫూర్తితో భూ పోరాటంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి అని, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శిగా అంచలంచలుగా మండల కార్యవర్గ సభ్యులుగా ఎదిగాడన్నారు. ఇక్కుర్తిలో సర్పంచ్‌గా బోడిగ రాజమ్మను గెలిపించుకొని తన సొంత కోడలు అయిలి భార్గవిని ఉప సర్పంచ్‌గా గెలిపించుకున్నాడన్నారు. రెండు నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ చనిపోవడం బాధకరమన్నారు. అంజయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆయిలి సత్తయ్య, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పల శాంతికుమార్, మోటకొండూరు మండల కార్యవర్గ సభ్యులు బోలగాని ఆశోక్, బీరకాయల మధు, జీవకలపల్లి పాండు, ఆయిలి శీను, కుటుంబ సభ్యులు భరత్, దడిగ రాములు, వట్టి రాఘవరెడ్డి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ నాయకుడు ముత్తయ్యకు నివాళి



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** సిపిఐ పట్టణ కార్యదర్శి చుక్క ముత్తయ్య మండల కేంద్రంలో బుధవారం మరణించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ముత్తయ్య పార్థీవదేహానికి ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా గోద శ్రీరాములు మాట్లాడుతూ చుక్క ముత్తయ్య సిపిఐలో, ప్రజానాట్యమండలి కళాజాతలో చేసిన సేవలను గుర్తు చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చేడే చంద్రయ్య, ఉప్పుల ముత్యాలు, మోత్కూర్ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, టౌన్ కార్యదర్శి మల్లేష్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి శేఖర్‌రెడ్డి, సిపిఐ నాయకులు నాగిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి బుర్రు అనిల్‌కుమార్, కాంగ్రెస్, బిజెపి నాయకులు నివాళులర్పించారు

# 2న అరుణాచల్‌ప్రదేశ్ శాసనసభ ఫలితాలు

### లోక్‌సభ కౌంటింగ్‌కు రెండు రోజుల ముందే లెక్కింపు




**ఇటానగర్ :** లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ కంటే రెండు రోజులు ముందుగానే అరుణాచల్‌ప్రదేశ్ శాసనసభ ఎన్నికల కౌంటింగ్ జరగనుంది. ఈ రాష్ట్రంలోని శాసన సభ, లోక్‌సభ నియోజకవర్గాలకు ఏప్రిల్ 19న ఎన్నికలు జరిగాయి. మొత్తం 60 శాసనసభ స్థానాలలో 10 ఏకగ్రీవం కాగా, 50 సీట్లకు పోటీ జరిగింది. శాసనసభ ఎన్నికలకు సంబంధించి జూన్ 2వ తేదీన ఉదయం 6 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని, మధ్యాహ్నానికి ఫలితాలు వెల్లడవుతాయని ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి బుధవారం నాడు వెల్లడించారు. అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీకి, లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19న ఎన్నికలకు జరిగాయి. ఓట్ల లెక్కింపు కోసం 2వేల మంది అధికారులను నియమించినట్లు తెలిపారు. అసెంబ్లీ కౌంటింగ్ జూన్ 2న, లోక్‌సభకు జూన్ 4న కౌంటింగ్ జరుగుతుంది. లోక్‌సభ ఓట్ల కౌంటింగ్ జూన్ 4న ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని ఎన్నికల ప్రధానాధికారి పవన్ కుమార్ సెయిన్ తెలిపారు. శాసన సభకు 133 మంది అభ్యర్థులు పోటీ చేయగా, రెండు లోక్‌సభ స్థానాలకు 14 మంది బరిలో నిలిచారు. అరుణాచల్ ప్రదేశ్ పశ్చిమ లోక్‌సభ స్థానం నుండి కేంద్ర మంత్రి కిరణ్ రిజీజు, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నబమ్ టుకీతో పాటు ఎనిమిది మంది పోటీ చేస్తున్నారు. అరుణాచల్ తూర్పు లోక్‌సభ స్థానంలో సిట్టింగ్ బిజెపి ఎంపి తాపిర్ గావో, పిసిసి ఉపాధ్యక్షుడు బోసిరామ్ శ్రీరామ్‌తో సహా ఆరుగురు బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో బిజెపి రెండు లోక్‌సభ స్థానాలను, 41 శాసనసభ స్థానాలను గెలుచుకుంది. జెడి(యు) ఏడు , ఎన్‌పిపి ఐదు, కాంగ్రెస్ నాలుగు శాసనసభ స్థానాలలో గెలుపొందాయి. పిపిఎ ఒక స్థానం, స్వతంత్రులు రెండు స్థానాలలో విజయం సాధించారు.

## ‘ఉపాధిహామీ’పై బిజెపి కుట్రలు




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకంపై కుట్రలు చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య విమర్శించారు. జూన్ 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గ్రామీణ ఉపాధి హామీ చట్ట రక్షణకు గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలు సవాళ్లు అనే అంశంపై సదస్సుకు హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంవిఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో ఉపాధి కూలీల హక్కులను అరించిందన్నారు. కూలీల డిమాండ్‌కు అనుగుణంగా పనులు కల్పించడం లేదని, తక్కువ మందికి పని కల్పిస్తున్నారన్నారు. ఉపాధి హామీ చట్టంలోని అంశాలను అమలు చేస్తూ కూలీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ముల్కపల్లి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపెల్లి సైదులు, నాయకులు పులుసు సత్యం, నరసాని వెంకటేశ్వర్లు, బెల్లకొండ వెంకటేశ్వర్లు, షేక్ ఫతాన్ మహబూబ్ అలీ, కడెం కుమార్, లక్ష్మి , జి.వెంకటేశ్వర్లు, వనం సోమయ్య, కొల్లూరు బాబు, లింగయ్య పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి పోరాటాలు

సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జంగయ్య




**ప్రజాపక్షం/హయత్ నగర్ :** సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేయాలని, స్థానికంగా ఉన్న ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. బుధవారం సిపిఐ సరూర్ నగర్ మండల సమితి ప్రథమ కౌన్సిల్ సమావేశం కందుల సుధాకర్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ సరూర్‌నగర్ మండలంలో పార్టీకి ఎంతో చరిత్ర ఉందని, అనేక బస్తీలు స్థాపించిన ఘనత సిపిఐదేనని అన్నారు. స్థానిక సమస్యలపై కార్యకర్తలు నిరంతరం పోరాటాలు నిర్వహించాలని, అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చూడాలని కోరారు. రాష్ట్ర నాయకత్వం జిల్లా నాయకత్వం ఇచ్చిన పిలుపుమేరకు మండల కార్యదర్శి కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన తెలిపారు. ప్రజాసంఘాలపైన దృష్టి సాధించాలని ఎక్కడికక్కడ కమిటీలను ఏర్పాటు చేసుకొని ముందుకు వెళ్లాలని కోరారు. కమ్యూనిస్టు పార్టీ ఎప్పటికీ ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా ఉంటుందని, ఎన్నో పార్టీలు పుట్టుకొచ్చి పుట్టగొడుగుల్లా మాయమైపోయాయి కానీ, కమ్యూనిస్టు పార్టీ వందేళ్లు పూర్తి చేసుకునే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. పార్టీలో సభ్యులుగా మీరందరూ ఉన్నందుకు, మీ అందరి సహకారంతో జిల్లా వ్యాప్తంగా భూపోరాటాలు కొనసాగిస్తున్నామని, అనేకమంది పేదప్రజలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని, వారందరికీ కూడా కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని భూపోరాటాలు చేసే సమయం ఆసన్నమైందని, కార్యకర్తలు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్‌రెడ్డి, ప్రమీద, మండల కార్యదర్శి బాతరాజు నరసింహ, సహాయకార్యదర్శి బోయపల్లి రాములుగౌడ్, కమలమ్మ, మద్దిలేటి, భగత్‌సింగ్‌నగర్ సిపిఐ శాఖ కార్యదర్శి జిల్లెల్ల కృష్ణ, గుణగంటి యాదయ్యగౌడ్, యాదగిరి, స్వామి, శ్యామలమ్మ, భాగ్యమ్మ, రమణమ్మ, ఎదిరిస్, బాయ్ శేఖర్, పూజారి అనిత, రూపాని లింగస్వామి, లక్ష్మి, గంగాధర్, శ్రీను, స్వామి, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

### బహుళ అంతస్తుల్లో నిర్వహిస్తున్న

# కళాశాలలపై చర్యలు

ఎఐవైఎఫ్ డిమాండ్




**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న మేడ్చల్ జిల్లాలోని డిఐఈఓ విజ్ఞాన్ వేదాంత్ కళాశాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలంటూ ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి డిమాండ్ చేసింది. బుధవారం కళాశాలకు వెళ్లి ప్రభుత్వ ఆదేశాలకు భిన్నంగా వేసవి సెలవులను సైతం లెక్క చేయకుండా అడ్మిషన్లు చేపట్టటమే కాకుండా తరగతులు తీసుకొంటున్న విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్‌ల నేతృత్వంలో తెలుసుకొని కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ కళాశాలకు ఇంటర్ బోర్డు నుండి అనుమతు లు సైతం లేవని తెలుస్తోందని, పూర్తి స్థాయి అఫిలియేషన్ లేకుండా మౌలిక సదుపాయాలు లేనటువంటి బహుళ అంతస్తు భవనంలో కళాశాల నిర్వహిస్తున్న విషయం బహిరంగంగానే కనపడుతున్నప్పటికీ బోర్డు అధికారులు ఏమీ పట్టించుకోకపోవటం శోచనీయమన్నారు. మరో పక్క విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మాయమాటలు చెప్పి లక్షల రూపాయలు వసూలు చేస్తూ బోర్డు నిబంధనల మేరకు బోధనా సిబ్బంది లేకుండానే తరగతులు తీసుకొంటున్న విషయం తెలుస్తోందన్నారు. వ్యాపారాలు నిర్వహించటానికి కట్టిన బహుళ అంతస్తు భవనాల్లో కనీసం ఫైర్ సేఫ్టీ లాంటి ఏర్పాట్లు లేకుండా కళాశాల నిర్వహించటం తగదన్నారు. అధికారులు జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాల ఎదుట చేసిన ధర్నాలో ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్ మురళి, కిరణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీపై రైతులకు విత్తనాలు

ఎఐకెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బిక్షపతి డిమాండ్




**ప్రజాపక్షం/మోటకొండూరు :** రైతాంగానికి సకాలంలో నాణ్యమైన విత్తనాలు సబ్సిడీపై అందించి, జూన్‌లోపే రైతు రుణమాఫీని అమలు చేయాలని ఎఐకెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోటకొండూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు బుధవారం ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ సురేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున రైతులకు నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ఫర్టిలైజర్ షాపులలో నకిలీ బెడదలను అరికట్టాలని డిమాండ్ చేశారు. రుణ మాఫీ చేసి కొత్త రుణాలను రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. పంటలకు సమగ్ర భీమాను వర్తింపజేయాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఫర్టిలైజర్ ఎరువులను సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కల్లెపు అడివయ్య, ఇక్కిరి సహదేవ్, దొంతిరి అంజిరెడ్డి, చిర బోయిన బాలయ్య, గడ్డం నాగరాజు, పంజాల మురళి, మారుజోడు సిద్దేశ్వర, కట్ట సమరసింహారెడ్డి, ఇక్కిరి సిద్ధులు, ఎర్రంబెల్లి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.




**ఆలేరు :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో వచ్చిన హామీలను అమలు చేయాలని రైతంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆలేరు నియోజకవర్గం కేంద్రంలో రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఎంఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రైతులకు సరిపడా విత్తనాలను సబ్సిడీపై ప్రభుత్వమే అందించాలని కోరారు. జూన్ నెలలో రైతు రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలను అందించాలని డిమాండ్ చేశారు. పంట ప్రణాళికను తయారుచేసి ముందుగానే మద్దతు ధరను బోనస్ ప్రకటించాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల బిక్షపతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల సోమయ్య, అడివయ్య, గడ్డం నాగరాజు, సహదేవ్, అంజిరెడ్డి, బాలయ్య, బాల్రెడ్డి, సిద్దేశ్వర్, మురళి, మోతిలాల్, సిద్ధులు, ఐలయ్య పాల్గొన్నారు.

# ధార్మిక భవనం సమ్మక్క సారలమ్మదే

ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదు

ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తా

మేడారంలో పూజారుల ధర్నా శిబిరం సందర్శించిన మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/తాడ్వాయి:** ధార్మిక భవనం సమ్మక్క సారలమ్మదే అని ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని మంత్రి సీతక్క అన్నారు. వరంగల్ సెంట్రల్ జైలు ఎదుట మేడారం ఆలయం పేరిట కేటాయించిన స్థలంలో నిర్మించిన ధార్మిక భవనం వివాద పరిష్కారం కోసం మేడారం పూజారులు సమ్మక్క సారలమ్మ గద్దెల ముఖ ద్వారం వద్ద బుధవారం నల్ల బ్యాడ్జిలతో ధర్నా చేపట్టారు. దీనికి స్థానిక వ్యాపారులు, భక్తులు, ప్రజాసంఘాలు మద్దతు తెలపాలని పూజారుల సంఘం కోరింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో గిరిజన పూజారులు బుధవారం గేటు ముందు నిరసనకు దిగడంతో భక్తుల దర్శనాలకు ఆటంకం కలుగకుండా దేవాదాయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఈ నిరసన ధర్నాకు పూజారులు తగు జాగ్రత్తలు తీసుకోవడం దేవాదాయ శాఖాధికారులకు తమ పనిసులువుగా చేసుకోడానికి వీలు కలిగింది. పూజార్ల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు విజ్ఞప్తి మేరకు స్థానిక ప్రజలు, వ్యాపారులు, వివిధ సంఘాలు తల్లుల ఆస్తుల పరిరక్షణకై మేము సైతం అన్నట్లుగా తమ వంతు సహాయ సహకారాలు అందించారు. వరంగల్ సెంట్రల్ జైలు ఎదురుగా 1014 గజాల స్థలాన్ని మేడారం ఆలయ సౌకర్యాల నిమిత్తం 1993లో దేవాదాయ శాఖ మేడారం పేరిట కేటాయించిన భూమిలో ఏర్పాటుచేసిన ధార్మిక భవనాన్ని భద్రకాళి ఆలయ అర్చకులు, అధికారులు తమకు దక్కకుండా వేద పాఠశాల పేరుతో దక్కించుకుంటున్నారని మేడారం పూజారులు పలుమార్లు ఎమ్మెల్యే, మంత్రులకు వినతులు సమర్పించినా పట్టించుకోకపోవడంతో విధి లేక న్యాయం జరగాలనే ఏకైక లక్ష్యంతో నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నాకు పూనుకున్నట్లు గిరిజన పూజారులు తెలిపారు. విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క మేడారం చేరుకొని పూజారులతో వరంగల్‌లోని ధార్మిక భవనంపై వివాదం ముసురుకోవడం గురించి ఆరా తీశారు. గతంలో ప్రభుత్వం కేటాయించినట్లు ధార్మిక భవనం మేడారం సమ్మక్క సారలమ్మలకి చెందాలని పూజారులు విన్నవించడంతో సదరు సమస్యపై ముఖ్యమంత్రితో చర్చించి అతి కొద్ది సమయంలోనే ధార్మిక భవనాన్ని మేడారం సమ్మక్క సారలమ్మ కార్మిక భవనంగా నామకరం చేస్తూ సమ్మక్క సారలమ్మ తల్లులకు చెందిన ప్రత్యేక జీవో తీసుకరావడానికి ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి సీతక్క హామీతో సంతృప్తి చెందిన పూజారులు తాము చేపట్టిన నిరసన దీక్షను విరమించారు. ధర్నా కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు కొక్కెర రమేశ్, చందా రఘుపతిరావు, కాక వెంకటేశ్వర్లు, సిద్ధబోయిన స్వామి, సిద్ధబోయిన మునీందర్, దబ్బగట్ల జనార్దన్, పెనుక రాజేశ్వర్‌రావు, గోపాల్‌రావు, అరుణ్, నితిన్‌లతోపాటు తుడుందెబ్బ ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## పెరిగిన రాజకీయ పార్టీలు

(మొదటి పేజీ తరువాయి)

2009తో పోలిస్తే ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో పోటీలో నిలిచిన రాజకీయ పార్టీల సంఖ్య 104 శాతం పెరగడం గమనార్హం. లోక్‌సభ ఎన్నికల్లో బరిలో నిలిచిన మొత్తం 8,337 మంది అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్‌ను ఎడిఆర్ విశ్లేషణ చేసింది. 8,360 మంది అభ్యర్థుల్లో 1,333 మంది అభ్యర్థులు జాతీయ పార్టీలకు చెందిన వారు కాగా, 532 రాష్ట్ర పార్టీలకు చెందిన వారు. మరో 2,580 మంది గుర్తుంపు పొందని పార్టీల నుంచి పోటీ చేస్తుండగా, ఇంకో 3,915 మంది స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. కాగా, అభ్యర్థులపై ఉన్న క్రిమినల్ కేసులను కూడా ఎడిఆర్ విశ్లేషణ చేసింది. జాతీయ పార్టీలకు చెందిన 443 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉండగా, 295 మంది తీవ్ర నేరపూరిత కేసులు దాఖలయ్యాయి. రాష్ట్ర పార్టీలకు చెందిన అభ్యర్థులపై భారీగా క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. 532 మంది అభ్యర్థుల్లో 249 మందిపై నేరపూరిత, మరో 169 మందిపై తీవ్ర నేరపూరిత కేసులు ఉన్నాయి. అదే విధంగా గుర్తింపు పొందని రాజకీయ పార్టీల అభ్యర్థుల్లో తక్కువ మొత్తంలో క్రిమినల్ కేసులు దాఖలయ్యాయి. 2,580 మందికి గానూ 401 మంది పై మాత్రమే నేరపూరి, 316 మందిపై తీవ్ర నేరపూరిత కేసులు ఉన్నాయి. స్వతంత్ర అభ్యర్థుల్లో 550 మంది అభ్యర్థులపై క్రిమినల్, 411 మంది అభ్యర్థులపై సీరియస్ క్రిమినల్ కేసులు దాఖలయ్యాయి. ఆర్థిక పరిస్థితులపై విశ్లేషణ చేయగా, మొత్తం 8,337 మంది అభ్యర్థులకు గానూ 2,572 మంది కోటీశ్వరులు లేదా మిలియనీర్లు. పార్టీ వారీగా చూస్తే జాతీయ పార్టీల అభ్యర్థుల్లో 906 మంది, రాష్ట్ర పార్టీల అభ్యర్థుల్లో 421 మంది, గుర్తింపు పొందని పార్టీల్లో 572 మంది, స్వతంత్ర అభ్యర్థుల్లో 673 మంది కోటీశ్వరులుగా ఉన్నట్లు ఎడిఆర్ విశ్లేషణ చేసింది.

## డ్రగ్స్ సమస్య

(మొదటి పేజీ తరువాయి)

వచ్చినదేనని, రాజ్యాంగాన్ని అంతంచేయాలని బిజెపి భావిస్తోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలు చేస్తూ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అబద్ధాలు చెప్పారన్నారు. మోదీ ప్రభుత్వం నోట్ల రద్దు, జిఎస్‌టి (వస్తువులు మరియు సేవల పన్ను)తో చిన్న వ్యాపారులను, చిన్నమధ్యతరహా వ్యాపారాలను పూర్తిగా నాశనం చేసిందని, అందనీ, అంబానీకి మాత్రమే మేలు చేకూర్చుందని దుయ్యబట్టారు. దేశంలో యువతకు ఉపాధి దొరకని పరిస్థితి నెలకొందన్నారు. అగ్నిపథ్ పథకంపై నిప్పులు చెరిగారు. ఇది జవాన్లు, సైన్యంపై ‘దాడి అని అన్నారు. దేశంలోని జవాన్లను అవమానిస్తున్నారని ఆయన ఆరోపించారు. మోడీ రైతుల కోసం ‘నల్ల చట్టాలు‘ (ప్రస్తుతం రద్దు చేయబడిన వ్యవసాయ చట్టాలు) తీసుకు వచ్చారని, అతని విధానాలు నిరుద్యోగం, ద్రవ్యోల్బణాన్ని పెంచాయని, కార్మికులు, చిన్న వ్యాపారులకు ఏమీ చేయలేదని మండిపడ్డారు. 22 మంది కోటీశ్వరులకు 16 లక్షల కోట్ల రూపాయలను మోదీ మాఫీ చేశారని ఆరోపించిన గాంధీ, విమానాశ్రయాలు, ఓడరేవులు, మౌలిక సదుపాయాలు, సౌర విద్యుత్, రక్షణ పరిశ్రమలన్నీ అదానీ లాంటి వ్యక్తులకు అప్పగించారని ఆరోపించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దాదాపు రూ.70 వేల కోట్ల రైతుల రుణాలను మాఫీ చేసిందని చెప్పారు. ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే, వ్యవసాయ రుణాలను మాఫీ చేయడమేనని, రైతులు దేశానికి వెన్నెముక అని, వారికి రక్షణ కల్పించాలన్నారు.

ఈ ర్యాలీలో హత్యకు గురైన గాయకుడు సిద్ధూ మూసేవాలా తండ్రి బల్కౌర్ సింగ్ కూడా ఉన్నారు. బుధవారం మూసేవాల రెండో వర్ధంతి. మే 29, 2022న పంజాబ్‌లోని మాన్సా జిల్లాలో సిద్ధూ మూసేవాలాగా ప్రసిద్ధి చెందిన శుభదీప్ సింగ్ సిద్ధూ కాల్చి చంపబడ్డాడు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

## ప్రభుత్వ భూమిని కాపాడిన రెవెన్యూ అధికారులు

**ప్రజాపక్షం/నార్సింగి** : గండిపేట మండలం బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ సర్వేనెంబర్ 51 లోని 9.36 కుంటల ప్రభుత్వ భూమిని గండిపేట మండల తహసీల్దార్ కె. శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో నిర్మించిన భవనాలను ప్రహరీని బుధవారం తెల్లవారుజామున పోలీసు బందోబస్తుతో రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ప్రభుత్వ భూమి కబ్జా చేసిన స్థానిక బిఆర్ఎస్ నాయకుడు తన పలుకుబడిని ఉపయోగించుకొని పట్టా పాస్ బుక్‌ను తయారు చేయించుకున్నారు. కాగా ఈ పట్ట పాస్ బుక్కును రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక రద్దు చేశారు. ఈ పాస్ బుక్‌ను రద్దు చేయడంతో ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు ఈ స్థలంలో ప్రభుత్వ సూచిక బోర్డును పాతారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ వాల్యుయేషన్ తప్పులపై విచారణ

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతి డిమాండ్

**ప్రజాపక్షం/వనస్థలిపురం:** ఇంటర్ ప్రశ్నాపత్రాల వాల్యుయేషన్‌లో తప్పులపై విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి కుమార్ డిమాండ్ చేశారు. ఇంటర్ ఫలితాల అనంతరం విద్యార్థులు మార్కులు చూసి షాక్‌కి గురయ్యారని, వాల్యుయేషన్ రీ కౌంటింగ్‌తో పేపర్లు తెప్పించుకుని చూస్తే పేపర్ వాల్యూయేషన్‌లో ఇష్టానుసారంగా పేపర్లు దిద్దారని, వచ్చిన మార్కులు ఒకటైతే ఆన్‌లైన్‌లో ఇంకో రకంగా మార్కులు వేశారని ఆరోపించారు. ప్రశ్నాపత్రాల తప్పుడు వాల్యుయేషన్ వల్ల నష్టపోయిన విద్యార్థులందరికీ ఇంటర్ బోర్డు న్యాయం చేయాలని లేని పక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇంటర్ బోర్డును ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## వక్ఫ్ బోర్డు స్థలాలు రక్షించాలి

### శ్మశానాలకు భూమి కేటాయించాలి : ఎంపి అజీజ్‌పాషా




**ప్రజాపక్షం/హైదరాబాద్:** అన్యాక్రాంతం అవుతున్న వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించాలని ఆల్ ఇండియా ముస్లీం మైనార్టీ ఆర్గనైజేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉన్న వక్ఫ్‌బోర్డు స్థలాల వివాదాలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవతీసుకోవాలని మాజీ ఎంపి అజీజ్‌పాషా సూచించారు. హైదరాబాద్‌లో శ్మశాన వాటికలో సమాధులు తవ్వడానికి స్థలం లేదని, ఒకే సమాధి స్థలంలో మూడు సమాధులను ఏర్పాటు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్‌బోర్డు ఉన్న భూములను స్మశానాలకు కొంత కేటాయించాలని లేనిపక్షంలో ప్రైవేటు భూములను ఖరీదు చేసి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.హిందూ ధర్మాదాయ పద్దతిలో వక్ఫ్‌బోర్డుకు న్యాయపరమైన అధికారాలు కల్పిస్తామని గత ప్రభుత్వం ఇచ్చిన హామిని అమలు చేయడంలో విఫలమైందని ముస్లిం ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎంఎ సిద్దిఖీ అన్నారు. సమావేశంలో దస్తగిరి, రబ్బానీ, ఎండి ఇలియాస్, ముఖ్తార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాంపరింగ్‌కు పాల్పడిన వారిని వదిలిపెట్టొద్దు : చనగాని



**ప్రజాపక్షం/హైదరాబాద్** : ఫోన్ ట్యాంపరింగ్‌కు పాల్పడిన పోలీస్ అధికారులను ఎవ్వరిని వదిలిపెట్టొద్దని టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్, రియాజ్ అన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపరింగ్ కేసులో అరెస్ట్ అయినా అధికారుల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, వారి సర్వీసుల నుంచి తొలగించాలని కోరారు. ఫోన్ ట్యాపింగ్ కేసును బిజెపి, బిఆర్ఎస్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కెసిఆర్ పాలనలో పోలీస్ వ్యవస్థను దిగజార్చారని మండిపడ్డారు.

### గో కాస్మో - ఆర్కిడ్స్ ది ఇంటర్నేషనల్ స్కూల్లో

## అంతరిక్ష పరిశోధనా ప్రదర్శన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గో కాస్మో ఆర్కిడ్స్ ది ఇంటర్నేషనల్ స్కూల్లో 'అంతరిక్ష పరిశోధనా' ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. మే 31 తేదీన ప్రారంభమయ్యే ఈ ప్రదర్శన జూన్ 2వ తేదీ వరకు కొనసాగునుంది. ఈ ఈవెంట్ ఇతర వాటికి భిన్నంగా ఖగోళ అనుభవాన్ని ప్రత్యక్షంగా చూసినట్లు అనుభూతి పొందవచ్చు. ఈ ప్రదర్శనలకు ప్రవేశ రుసుము లేదు. ఈ అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## చంద్రబాబుకు ఘనస్వాగతం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, ఆయన భార్య భువనేశ్వరి విదేశీ పర్యటన ముగించుకుని బుధవారం ఉదయం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం అమెరికా వెళ్లిన చంద్రబాబు దాదాపు పది రోజుల పాటు అక్కడే గడిపారు. చంద్రబాబు రాక నేపథ్యంలో పార్టీ నేతలు పెద్ద ఎత్తున శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని, ఘనంగా స్వాగతం పలికారు.

## తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లు పరిశీలన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాట్లను పరేడ్ గ్రౌండ్స్, ట్యాంక్ బండ్‌లలో ఏర్పాట్లను గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటి మేయర్ శ్రీలత రెడ్డి, ఎంఎల్‌సి బల్మూరి వెంకట్, డిసిసి ప్రెసిడెంట్ రోహిణ రెడ్డి, కార్పొరేటర్ రాజశేఖర్ రెడ్డిలతో కలిసి పరిశీలించారు. పరేడ్ గ్రౌడ్స్‌ను సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. సభాప్రాంగణంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచనలు చేశారు. స్టేజ్ ఎర్పాట్లు, బారికేడింగ్, విద్యుత్, మంచినీటి సరఫరా, సౌండ్ సిస్టం, ఎల్ఇడి స్క్రీన్‌ల ఏర్పాటు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా పార్కింగ్ ఏర్పాట్లు, విఐపి రాకపోకలకు అంతరాయం కలుగకుండా చేపట్టబోయే చర్యల గురించి అధికారులకు సూచనలు చేశారు.

## జలమండలి ఉద్యోగి కుమారుడికి ఇంటర్నేషనల్ కరాటేలో గోల్డ్ మెడల్




**ప్రజాపక్షం/హైదరాబాద్** : జలమండలి ఉద్యోగి కుమారుడు అంతర్జాతీయ కరాటే పోటీలో గోల్డ్ మెడల్ సాధించాడు. డివిజన్ 8 లో టిజి 2 గా పనిచేస్తున్న పురాన్ సింగ్ కుమారుడు శంశాక్ సింగ్ మలేషియాలో జరిగిన అంతర్జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ 2024 పోటీల్లో గెలుపొంది, బంగారు పతకం సాధించాడు. శశాంక్‌ను జలమండలి ఎం.డి. సుదర్శన్ రెడ్డి ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నతంగా కరాటే పోటీలలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. శశాంక్ ప్రస్తుతం సంగారెడ్డిలోని లిటిల్ బర్డ్స్ పాఠశాలలో చదువుతున్నాడు. మూడేళ్ల నుంచి బాల్‌పతి నటరాజన్ ఆధ్వర్యంలో కరాటేలో శిక్షణ తీసుకుంటున్నాడు. శశాంక్ సింగ్‌కు అయిదేళ్ల నుంచి శిక్షణ ఇస్తున్నట్లు తండ్రి పురాన్ సింగ్ తెలిపారు.

# పకడ్బందీగా గ్రూప్-I ప్రిలిమినరీ పరీక్షలు

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక




**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** గ్రూప్–I ప్రిలిమినరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల సముదాయ భవనంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్‌తో కలిసి గ్రూప్–I ప్రిమిలినరి పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ జూన్ 9న నిర్వహిస్తున్న గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్ష తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదేశాలను అనుసరిస్తూ తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మొదటిసారిగా బయో మెట్రిక్ పద్ధతిన పరీక్షలు నిర్వహిస్తున్నరని చెప్పారు. జిల్లాలో మొత్తం సెంటర్లు 93 సెంటర్లలో, 55,692 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి పరీక్షా కేంద్రాలలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని, నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావియ్యరాదని కలెక్టర్ సూచించారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. టాయిలెట్స్, తాగునీరు, ఫాన్స్,లైట్స్, మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల బయోమెట్రిక్ వెరిఫికేషన్ క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎక్కడ కూడా చిన్నపాటి తప్పిదాలు జరగకుండా అధికారులు చూసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. ఎగ్జామ్ క్యాంపస్‌లోకి చీఫ్ సూపరింటెండెంట్‌కు తప్ప, ఎవరికి సెల్ ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతించవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. డిపార్ట్మెంటల్ అధికారులు పరీక్ష రోజున ఉదయం 8.00 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్ష పూర్తయ్యే వరకు కేంద్రం నుండి ఎవరు కూడా బయటకు వెళ్లడానికి వీలు లేదని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రీజినల్ కోఆర్డినేటర్లు డిపార్ట్మెంటల్ అధికారులు,ఫ్లైయింగ్ స్క్వాడ్, సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

### సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన సేవలు

మీసేవా వెబ్ సైట్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకురావచ్చునని కలెక్టర్ కె.శశాంక అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయంలో కమిషనర్ ఇఎస్ డి.రవికుమార్‌తో కలిసి మీసేవా దరఖాస్తుల పరిష్కరించడంలో జాప్యం జరగకుండా చేపట్టవలసిన చర్యలపై సంబంధిత తహసీల్దార్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా, మండల స్థాయిలో జనన, మరణ, కుల, ఆదాయ, కుటుంబ సభ్యుల ధృవీకరణ, రెసిడెన్సీ, ఇతర వెనుకబడిన తరగతుల ధృవీకరణ పత్రాల జారీ చేయుటలో జరుగు జాప్యం అధిగమించుటకు మీసేవా వెబ్ సైట్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు అందించడం జరుగుతుందన్నారు. మీసేవా వెబ్ సైట్, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు అందించే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అధిక సంఖ్యలో వచ్చిన అప్లికేషన్‌లకు సంబంధించి ఫీల్డ్ వెరిఫికేషన్‌ను నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించడం వలన సకాలంలో పౌరులకు పత్రాలను అందించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, తహసీల్దార్లు, ఇడిఎం నాగభూషణం పాల్గొన్నారు.

### రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

ప్రభుత్వం తరపున రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు జిల్లాలోని ప్రాథమిక సహకార సంఘాలు, ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాలలో రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ కె.శశాంక తెలిపారు. అదేవిధంగా మేలు రకాల ప్రత్తి విత్తనాలను సైతం ప్రైవేట్ డీలర్ల ద్వారా అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో పచ్చిరొట్ట, ప్రత్తి విత్తనాల లభ్యతలో కొరత లేదని, రైతు సోదరులు విత్తనాల సరఫరా విషయంలో వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నుండి వ్యవసావిస్తరణ అధికారి వరకు విత్తన సరఫరా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.

## యువత స్వయం ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలి : రాగుల



**ప్రజాపక్షం/వనస్థలిపురం :** యువత స్వయం ఉపాధి అవకాశాలు అలవర్చుకోవాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం వనస్థలిపురంలోని వనస్థ కాంప్లెక్స్‌లో హోమ్లీ కేఫ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భం గా కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ యువత సొంత ఉపాధి ఏర్పాటు చేసుకోవడం పాటు పలువురికి ఉపాధి కల్పించాలని కోరారు. నిరుద్యోగ యువకులకు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, హోమ్లీకేఫ్ నిర్వహకులు అభిషేక్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# వరదనీటి సమస్య పరిష్కరిస్తా

### ఎంఎల్ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/వనస్థలిపురం :** ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో వరద నీటి సమస్యలను పరిష్కరించే విధంగా కృషిచేస్తామని ఎల్‌బి నగర్ నియోజకవర్గ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం వనస్థలిపురం తూర్పు కాలనీలోని హకోర్టు కాలనీ, బిడిఎల్ కాలనీలో కాలనీ వాసులతో కలిసి పర్యాటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎంఎల్ఎ దృష్టికి పలు సమస్యలను తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీ సమస్యలపై పూర్తి అవగహన ఉందని, గతంలోనే ట్రంక్ లైన్ మంజేరు చేయడం జరిగిందని, ట్రంక్ లైన్ నిర్మాణంలో భాగంగా పక్కన ఉన్న ఒక ప్రైవేట్ యాజమాన్యం స్థలం అడగడం జరిగింది. వారు నిరకరించడం జరిగిందని దానితో కొంతమేర పనులు ఆలస్యం జరిగిందని తెలిపారు. ఈ మేరకు నూతన ట్రంక్ లైన్ పనుల్లో భాగంగా ఎత్తుపల్లాలు చూసుకొని పనులు చేయాలని సంబంధిత అధికారులకు సుధీర్‌రెడ్డి సూచించారు. పనుల్లో భాగంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. నియోజకవర్గ పరిధిలోని వరదనీటి సమస్యలను తప్పకుండా పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఈఈ రమేష్ బాబు, ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ వాసులు దీపావళి శ్రవణ్, దీపావళి శ్రీకాంత్, సుధీర్‌రెడ్డి, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, మురళి, శంకర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

## గ్రామీణ స్థాయిలో క్రీడాకారులు రాణించాలి

### కాంగ్రెస్ నాయకులు మాణిక్యం ముదిరాజ్



**ప్రజాపక్షం/షాబాద్ :** గ్రామీణ స్థాయిలో క్రీడాకారులు రాణించేందుకు ప్రభుత్వం సహకారం అందించాలని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మాణిక్యం ముదిరాజ్ అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో గత రెండు రోజులుగా గ్రామంలోని యువకులకు క్రికెట్ టర్నమెంట్ నిర్వహించారు. గ్రామంలోని యువకులంతా నాలుగు టీంలుగా ఏర్పాడి పోటీలో పాల్గొన్నారు. క్రికెట్ పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతికి రూ.10 వేలు, రెండవ బహుమతికి రూ. 5 వేలు మెమోంట్‌తో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో గ్రామీణ క్రీడకారులకు ఆట స్థలాల పేరుతో నామమాత్రంగా మైదానాలు ఏర్పాటు చేశారు అందులో ఎలాంటి మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైందన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి గ్రామీణ క్రీడకారులకు ఎర్పాటు చేసిన ఆట స్థలాల్లో మౌలిక వసతులు కల్పించి ప్రతి రోజు యువకులు ఆడుకునేవిధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామంలో యువ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎసిబి కస్టడీలో ఉమామహేశ్వర్‌రావు

### కీలక విషయాలు రాబట్టిన ఎసిబి అధికారులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** చంచల్‌గూడ జైలులో ఉన్న ఎసిపి ఉమామహేశ్వర్‌రావును ఎసిబి అధికారులు బుధవారం తమ కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఇటీవలే సిసిఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఎసిపి ఉమామహేశ్వర్‌రావును ఎసిబి అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అతని ఇంటితో పాటు బంధువులు, స్నేహితుల ఇళ్లపై సోదాలు నిర్వహించగా సుమారు రెండు కోట్ల రూపాయల వరకు ఆదాయానికి మించిన ఆస్తులను గుర్తించారు. అయితే అతని ల్యాప్‌టాప్‌లో ఉన్న ఆస్తుల వివరాల చిట్టాను ఫొరెన్సిక్ అధికారులతో ఢీకోడ్ చేసి వెలికి తీశారు. దర్యాప్తు చేస్తున్న కేసులలో ఉన్న బాధితులు, నిందితులవద్ద పెద్దఎత్తున డబ్బులు దండుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటిపై మరింత లోతుగా విచారణ చేసేందుకు ఉమామహేశ్వర్‌రావును మూడు రోజుల కస్టడీకి ఇవ్వాలని ఎసిబి అధికారులు ఎసిబి ప్రత్యేక న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈమేరకు వాదనలు విన్న న్యాయస్థానం మూడు రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చింది. దీంతో చంచల్‌గూడ జైలులో ఉన్న ఉమామహేశ్వర్‌రావును ఎసిబి అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. మొదటి రోజు విచారణలో పలు కీలక అంశాలను అతని నుంచి రాబట్టినట్లు తెలిసింది. తన ఆస్తుల ను బినామి వ్యక్తుల పేర్లపై పెట్టినట్లు విచారణలో తెలిపినట్లు తెలిసింది. అలాగే పోలీసుశాఖలో ఉన్న కొంత మంది ఉన్నతాధికారులు తనకు సహకరించారని వెల్లడించినట్లు సమాచారం. అతడికి సహకరించిన అధికారులను ఎసిబి అధికారులు అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయి. ఉమామహేశ్వర్‌రావును విచారించి మరిన్ని విషయాలను రాబట్టాలని ఎసిబి అధికారులు భావిస్తున్నారు.

## ఆస్కార్ విజేత కీరవాణికి ప్రాంతీయత అంటగట్టొద్దు

### టిడిపి నేత సాయిబాబా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆస్కార్ అవార్డు గ్రహీత ఎంఎం కీరణవాణికి ప్రాంతీయత అంటగట్టొద్ధని తెలుగు దేశం సికింద్రాబాద్ లోక్‌సభ అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ జయ జయహే తెలంగాణ గీతానికి ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం.ఎం.కీరణవాణి సంగీతం అందించడాన్ని స్వాగతించాలని కోరారు. త్రిబుల్ ఆర్ సినిమాకు సంగీతం అందించడం ద్వారా ప్రపంచ స్థాయిలో తెలుగువాడైన కీరవాణికి విశేషమైన గుర్తింపు వచ్చిందన్నారు. కొంతమంది బిఆర్ఎస్ నేతలు కీరవాణికి ప్రాంతీయత అంటగట్టడం విడ్డూరంగా ఉందన్నారు. సంగీతం అందించే విషయాన్ని ప్రశ్నించడం చాలా విచారకరమన్నారు. కళకు కులం, మత, ప్రాంతం, భాష, వంటి అసమానతలు ఉండవనే విషయం గుర్తించాలన్నారు. కళాకారుడు ఏ దేశంలో ఉన్నా, ఏ రాష్ట్రంలో ఉన్నా గౌరవించబడుతాడన్నారు. జయ జయహే పాటకు సంగీతం అందించే విషయాన్ని లేని పోని వివాదాన్ని రేపొద్దన్నారు. కళను కళగానే చూడాలని, వివక్షగా చూడటం మంచి పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న డ్రగ్స్ అధికారుల దాడులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అధిక ధరలకు ఔషధాలను విక్రయి స్తున్న ఉత్పత్తి సంస్థలు, ఏజెన్సీలపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డిసిఎ) దాడులను కొనసాగిస్తోంది. గత కొంత కాలంగా పలు ఏజెన్సీలు, మెడికల్‌షాపులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసింది. ఇందులో భాగంగానే షామీర్‌పేట, కాప్రా, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో డ్రగ్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన సాప్‌నిక్స్ లైఫ్ సైన్సెస్ ఉత్పత్తి చేసిన టెస్టా 200 క్యాప్‌సల్స్‌ను రూ.24.77లకు కేంద్రం నిర్ధేశించిన మందును, రూ. 50.30 కి విక్రయిస్తున్నట్టు డ్రగ్స్ అధికారులు గుర్తించారు. అలాగే తప్పుదోవ పట్టించేలా 'డిసిస్ ఆఫ్ ఐ' ఫివర్ ముందను విక్రయిస్తున్న వారిపైన కేసు నమోదు చేశారు. గచ్చిబౌలిలో తగిన అర్హత లేకుండా నిర్వహిస్తున్న స్వరూప్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌పైన కూడా డ్రగ్స్ అధికారులు దాడులు చేశారు. డ్రగ్స్ లైసెన్స్ లేకుండా మందులను విక్రయిస్తున్నారు. దీంతో ఈ క్లినిక్‌లో రూ. 8వేల విలువ చేసే మందులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# ఎస్‌బిఐలో అధికార భాష అమలుపై సమీక్ష

### అత్యుత్తమ పనితీరుకు సత్కారాలు




**హైదరాబాద్ :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ పరిధిలో అధికార భాష అమలులో అత్యుత్తమమైన పనితీరు ప్రదర్శించిన సభ్య కార్యాలయాలకు ఘన సత్కారాలు, బహుమతి ప్రదాన కార్యక్రమాలు జరిగాయి. ఎస్‌బిఐ నగర అధికార భాష అమలు సమితి (బ్యాంక్ అండ్ ఇన్స్యూరెన్స్) 2024–25 సంవతరానికి హైదరాబాద్ మొదటి అర్థ సంవత్సర సమావేశం నగర ప్రధాన కార్యాలయంలో మంగళవారంనాడు జరిగింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్ కుమార్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన రాజ్‌భాష అమలులో వేగాన్ని కొనసాగించేందుకు పురోగతి సాధించేందుకు మార్గదర్శనం చేశారు. హిందీ భాష అమలు కోసం మన ఆలోచనలు, ఆలోచనా ధోరణిని మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. వచ్చే అర్థ సంవత్సరానికిగాను కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. గత అర్థ సంవత్సరంలో సభ్యుల కారర్యాలయాలో టిఓఎల్ఐసి ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ హిందీ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. రాజ్ భాషా షీల్డ్‌లు ఇచ్చి అత్యుత్తమ పనితీరు కనబరచిన సభ్య కార్యాలయాలను సత్కరించారు. ఈ విభాగంలో ఎస్‌బిఐ అమరావతి, ఆర్‌బిఐ ఎల్ఐసి, నేషనల్ హౌసింగ్ బ్యాంక్, సిడ్బీ, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, నాబార్డ్ తెలంగాణ హిందీలో ఉత్తర ప్రదర్శనకు అవార్డులు పొందాయి. హోం మంత్రిత్వశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనిర్బన్ కుమార్ బిస్వాస్ (ఇంప్లిమెంటేషన్), ఆర్‌బిఐ జనరల్ మేనేజర్ రాజేశ్ మహానా,ఆంధ్రప్రదేశ్ నాబార్డ్ జనరల్ మేనేజర్ డా.కె.వి.ఎస్.ప్రసాద్, ఎస్‌బిఐ అమరావతి స్థానిక ప్రధాన కార్యాలయం చీఫ్ జనరల్ మేనేజర్ ఓం నారాయణశర్మ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత టిఓఎల్ఐసి సభ్య కార్యదర్శి, అధికార భాష ఎజిఎం అజయ్ కుమార్ తివారీ స్వాగత ప్రసంగం చేశారు. జిఎం–సిడిఓ జితేంద్ర కుమార్ శర్మ వందన సమర్పణ చేశారు.



## చిన్నారుల తల్లిదండ్రులకు పరామర్శ

**ప్రజాపక్షం/జడ్చర్ల :** నీట మునిగి మరణించిన చిన్నారుల తల్లి తండ్రులను పరామర్శించిన మాజీ మంత్రి డాక్టర్ .చర్లకొల్ల లక్ష్మారెడ్డి ,మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్. నిన్న బిజినేపల్లి వద్ద ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయిన ఇద్దరు బాలుర తల్లిదండ్రులు మతీన్,అజ్మత్. వారి కుటుంబ సభ్యులు పరామర్శించిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ,మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ ,జడ్చర్ల మున్సిపల్ ఛైర్పర్సన్ శ్రీమతి దోరేపల్లి లక్ష్మీ రవీందర్ రెడ్డి ,మాజీ చైర్మన్ వాల్య నాయక్ ,మున్సిపల్ కౌన్సిలర్స్, పార్టీ నాయకులు.

## పామాయిల్ తోటను పరిశీలించిన జెడ్‌పి వైస్‌చైర్మన్

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల మండల పరిధిలోనీ కొడుగల్ గ్రామంలో వేసిన పామాయిల్ తోటలో జడ్పీ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య పరిశీలించారు. బుధవారం నాడు ఆయన మండల పరిధిలోని వివిధ గ్రామాలను పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పామాయిల్ తోటకు అనుకూలంగా సబ్సిడీ ఏర్పాటు చేసినని అందువల్ల రైతులు ఎంతో లాభపడ్డారని సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పామాయిల్ తోటను వర్షాలు కురవడం వల్ల చెట్టు చుట్టూ కలుపు మొక్కలు ఏర్పడే అవకాశం ఉందని ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా కలుపు మొక్కలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తోట యజమానులు, అధికారులు ఉన్నారు.

## ప్యాకింగ్ లేని విత్తనాలు కొనొద్దు

**ప్రజాపక్షం/నర్వ:** వానాకాలం 2024 కు గాను నారాయణ పేట జిల్లాకు 1700 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు కేటాయించగా జిల్లాలోని ఆగ్రో రైతు సేవాకేంద్రాలు ( ఎఆర్ఎస్‌కే) , పి.ఎ.సి.ఎస్ (పిఎసిఎస్) ద్వారా 295 2024 వరకు 999.60 క్వింటాళ్ల విత్తనాలు 60% సబ్సిడీపై (55,77,768 / రూపాయలు సబ్సిడి) 1619 మంది రైతులకు ఇప్పటి వరకు సరఫరా చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్ తెలిపారు. మిలిలిన 700.40 క్వింటాళ్ల విత్తనాలను వచ్చేవారం లోపల రైతులకు సరఫరా చేయబడతాయని, ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కొంతమేర పడినప్పటి ఇంకా పూర్తిస్థాయిలో నేల ఉష్ణోగ్రతలు తగ్గలేదని ఇంకనూ నేల ఉష్ణోగ్రతలు 35 పెబడే ఉన్నయని. ఆయన తెలిపారు. జీలుగ విత్తనాలు వేయడానికి నేల ఉష్ణోగ్రతలు 35 కన్నా తక్కువ ఉండాలని, రైతులు తొందర పడకుండా నేల ఉష్ణోగ్రత తగ్గిన తర్వాతనే విత్తుకోవాలని ఆయన కోరారు. 2024 వానాకాలం జిల్లాలో 1,85,000 ఎకరాలలో పత్తి పంట సాగు అవుతుందన్న అంచనాలలో 70,000 పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం కాగా జిల్లాలో ఇప్పటి 3,62,516 ప్యాకెట్లు 245 విత్తన దుకాణాలలో రైతులకు అందుబాటులో ఉంచడమైనదని చెప్పారు. ఇప్పటికే రైతులు 1,19,197 పత్తి ప్యాకెట్లు కొనుగోలు చేశారన్నారు. ఇంకనూ జిల్లాలో 2,43,319 ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని అన్ని పత్తి హైబ్రిడ్ రకాలను నారాయణపేట జిల్లా నేలలు అనుకూలమైన, బిఈఎసి సిఫారసు చేయబడి, 1922 సాంకేతికతో రూపొందించబడ్డ విత్తనాలు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. దాదాపు అన్ని రకాల పత్తి హైబిడ్ ల దిగుబడి ఇంచుమించుగా ఒకేలా వుంటుందన్నారు. జిల్లాలోని రైతాంగానికి తెలియజేయడం ఏమిటనగా తేలికపాటి నేలలో 50 ఏం.ఎం, బరువు నెలలో 70. ఏం.ఏం.వర్షపాతం పడి నమోదు అయినట్లు అయితే రైతులు విత్తనాలు విత్తుకోవాలని ఆయన సూచించారు. లేనిచో విత్తనం సరిగ్గా మొలకెత్తక ఒరిగి పోతాయని, తద్వారా రైతులు ఆర్థికంగా నష్టపోవలసి వస్తుందన్నారు. విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల నుండి తగిన రశీదును పొంది విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. పంటవేసిన తర్వాత విత్తన సంచులను, బిల్లులను పంటకాలం పూర్తయ్యేంత వరకు జాగ్రత్తగా వుంచుకోవాలన్నారు. లూజ్ విత్తనాలు, ప్యాకింగ్ లేని విత్తనాలను రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయరాదని ఆయన సూచించారు.



## కుంట కబ్జాపై చర్యలు తీసుకోండి

### జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

**ప్రజాపక్షం/బాలానగర్ :** బాలానగర్ మండలం కేతిరెడ్డిపల్లి గ్రామ శివారులో గల సర్వే నెంబర్ 27/4/2/2/2 లో చెరువు కుంటను కబ్జా చేసి ప్రభుత్వ భూమిని ప్రైవేటు భూమిగా ప్రీకాస్ట్ వేసి విక్రయించిన వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని చింతకుంట తండావాసులు, పలువురు నాయకులు కలెక్టర్ కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. బుధవారం ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి భూమికి సంబంధించిన పత్రాలతో పాటు ఫిర్యాదు పత్రాన్ని అందజేయడం జరిగిందని తెలిపారు. 628 ఎకరాల భూమిలో 3 మీటర్ల మట్టిని అక్రమంగా నింపిన విషయంను కలెక్టర్ దృష్టి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. వాస్తవానికి బాలానగర్ మండలం చింతకుంట గ్రామపంచాయితీ ఎర్రకుంట తాండ వాసులము, చింతకుంట లలో చెరువు కుంట ఎ.203 గుంటలు పట్టాదారుడు జడ్చర్ల ఎమ్మెల్యే అనుచరుడు తూడి అనిల్ రెడ్డి అని అందులో పేర్కొన్నారు. మట్టితో పూడ్చివేసి, ఎ.23 గుంటల ప్రభుత్వ భూమికి ప్రీ కాస్ట్ కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేసి ఇతరులకు విక్రయించడం జరిగిందని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు మరియు మైనింగ్ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి కఠిన చర్యలు తీసుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. మైనింగ్ అధికారులకు గతంలో కాంప్లెంట్ చేసినా ఏలాంటి చర్యలు తీసుకోనలేదన్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే చెరువు సర్వే చేసి ప్రభుత్వ భూమి ఎ.203 గుంటలు ప్రీకాస్ట్ కాంపౌండ్ వాల్ తొలగించి వారిపై రెవెన్యూ చట్టం ప్రకారం చర్య తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో కె.నాగేందర్ నాయక్, ఎస్ రవి నాయక్, రమేశ్ నాయక్ రవీందర్ నాయక్, శ్రీనివాస్ నాయక్, లక్ష్మ ణ్ నాయక్, సూర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కూలిన ఇంటి పైకప్పు.. తప్పిన ప్రమాదం

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** గోవర్ధనగిరి గ్రామంలో ముంత కురుమయ్య ... కృష్ణమ్మ అనే నిరుపేద కుటుంబానికి చెందిన నివాస గృహం మంగళవారం సాయంకాలం ఒకసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో వాళ్లు ఇంటి ముందు బయట ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. లేదంటే పెద్ద ప్రమాదం జరిగేదని బాధితులు బోరున విలపించారు. వారికి ఒక సెంటు భూమి కూడా లేదు. భార్య భర్తలు ఇద్దరు కూడా కూలీ పని చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. వారిని తక్షణమే ప్రభుత్వపరంగా ఆదుకోవాలని, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వారు వేడుకోవడం జరిగింది.



# లేచింది మహిళా లోకం..

## సార్వత్రిక ఎన్నికల బరిలో పెరుగుతున్న అభ్యర్థులు




**న్యూఢిల్లీ:** లోక్‌సభకు పోటీ చేస్తున్న మహిళా అభ్యర్థుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) విశ్లేషణ ప్రకారం 2009లో 7 శాతంగా ఉన్న మహిళా అభ్యర్థుల సంఖ్య 2024లో 9.6 శాతానికి పెరిగింది. ఈ సంఖ్య 15 ఏళ్లలో స్థిరంగా పెరగడాన్ని గమనించవచ్చు. ఈ సంవత్సరం, మొత్తం 8,337 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, వారిలో 9.6 శాతం మంది, అంటే 797 మంది మహిళలు ఉన్నారు. 2019లో 9 శాతం, 2014లో 8 శాతం, 2009లో 7 శాతం మహిళా ప్రాతినిధ్యం నమోదైన మునుపటి సాధారణ అసెంబ్లీ ఎన్నికల కంటే పెరుగుదల నమోదైంది. 2009 లోక్‌సభ ఎన్నికలలో 556 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు, మొత్తం 7,810 మంది అభ్యర్థులలో వారు 7 శాతం మంది ఉన్నారు. ఈ సంఖ్య 2014లో 640కి (8,205లో 8 శాతం), 2019లో 716కి (7,928లో 9 శాతం) పెరిగింది. ఈసారి వివిధ ప్రధాన పార్టీలను పరిశీలిస్తే, బిజెపి తరపున 440 మంది పోటీపడుతుండగా, వారిలో 69 మంది మహిళలు. మొత్తం అభ్యర్థులలో ఈ సంఖ్య 16 శాతం. రెండో స్థానంలో కాంగ్రెస్ ఉంది. ఆ పార్టీ తరపున 327 మంది అభ్యర్థులు రంగంలో ఉండగా, 13 శాతం మంది (41 మంది) మహిళలు. ప్రధాన పార్టీల కంటే చిన్న, ప్రాంతీయ పార్టీలు అధికంగా మహిళా అభ్యర్థులను నిలబెట్టడం గమనార్హం. ఉదాహరణకు నామ్ తమిళర్ కచ్చి తరపున పోటీలో ఉన్న 40 మంది అభ్యర్థుల్లో 20 మంది మహిళలు. ఈ పార్టీ 50 శాతం మంది మహిళలకు అవకాశం కల్పించి, లింగ సమానత్వానికి ప్రాధాన్యతనిచ్చింది. లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి)కి చెరి 40 శాతం మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు, ఈ పార్టీలు నిలబెట్టిన ప్రతి ఐదుగురిలో ఇద్దరు మహిళలు. ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (ఎఐఎడిఎంకె), ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తరపున పోటీ చేస్తున్న వారిలో, అతి తక్కువగా, కేవలం 3 శాతం మంది మాత్రమే మహిళలు ఉన్నారు. ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో చెప్పుకోదగ్గ మహిళా ప్రాతినిధ్యం ఉన్న కొన్ని పార్టీలలో జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం), బిజూ జనతాదళ్ (బిజెడి) మహిళలకు, రిజర్వేషన్ కోటాను అనుసరించాయి. ఈ రెండు పార్టీలు ఒక్కొక్కటి 33 శాతం సీట్లను మహిళలకు కేటాయించాయి. రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) 29 శాతం మంది మహిళలను ఎంపిక చేసింది. సమాజ్ వాదీ పార్టీ (ఎస్‌పి)కి 20 శాతం, ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (ఎఐటిఎంసి)కి 25 శాతం చొప్పున మహిళా ప్రాతినిధ్యం ఉంది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) లోక్‌సభ అభ్యర్థుల్లో 13 శాతం మంది మహిళలు ఉండగా, బహుజన్ సమాజ్ పార్టీకి 8 శాతం మంది ఉన్నారు. డిఎంకె, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) వరుసగా 14, 7 శాతం చొప్పున మహిళలకు అవకాశం కల్పించాయి. జనతాదళ్ (యునైటెడ్/జెడియు), శివసేనకు చెరి 13 శాతం మంది మహిళా అభ్యర్థులు ఉండగా, అప్నా దళ్ (సోనేలాల్) ఇద్దరు మహిళలను బరిలోకి దించింది. తెలుగుదేశం పార్టీ, బిఆర్‌ఎస్ తరపున చెరి 6 శాతం మంది మహిళలకు అవకాశం కల్పించాయి. ఎన్‌సిపి (శరద్ పవార్) 8 శాతం, శివసేన (యుబిటి) 10 శాతం చొప్పున మహిళలకు టికెట్లు ఇచ్చాయి. మొత్తంమీద గతంలో పోలిస్తే పరిస్థితి మెరుగైనట్టు స్పష్టమవుతున్నది. పార్టీల మధ్య ఏకాభిప్రాయం కోసం 27 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును ఇటీవల పార్లమెంటు ఆమోదించిన విషయం తెలిసిందే. ఆ బిల్లు ప్రకారం, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. అయితే, ఆ చట్టం ఇంకా అమల్లోకి రాలేదు. ఈసారి ఎన్నికల్లో మొత్తం 8,337 మంది అభ్యర్థులు ఉండగా, వారిలో 9.6 శాతం (797) మంది మహిళలు. ఏప్రిల్ 19న జరిగిన తొలి దశ ఎన్నికల్లో 1,618 మంది అభ్యర్థులు పోటీ చేయగా 135 మంది మహిళలు మాత్రమే ఉన్నారు. ఏప్రిల్ 26న జరిగిన రెండో విడతలో 1,192 మంది అభ్యర్థులు ఉండగా అందులో 100 మంది మహిళలు ఉన్నారు. ఈనెల 7న జరిగిన మూడో దశ పోలింగ్‌లో 123 మంది మహిళలు సహా 1,352 మంది అభ్యర్థులు ఉన్నారు. 13న జరిగిన ఫేజ్ 4లో 1,710 మంది పోటీదారులలో 170 మంది మహిళలు ఉన్నారు. 20న జరిగిన ఫేజ్ 5లో అతి తక్కువగా 695 మంది అభ్యర్థులు పోటీపడగా, వారిలో 82 మంది మహిళలు ఉన్నారు. ఆరవ దశ 6లో 866 మంది అభ్యర్థులకు గాను 92 మంది మహిళలు ఉన్నారు. జూన్ 1న జరగనున్న చివరి దశలో 904 మంది అభ్యర్థులు, 95 మంది మహిళలు మాత్రమే ఉన్నారు. కాగా, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు.

## లోక్‌సభకు మళ్లీ పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎంపిల

# ఆస్తులు పెరిగాయ్

### ఐదేళ్లలో సగటున 43 శాతం జంప్

**న్యూఢిల్లీ:** ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో 324 మంది సిట్టింగ్ ఎంపిలు మళ్లీ బరిలోకి దిగారు. గత ఐదేళ్ల కాలంలో, వారి ఆస్తి సగటున 43 శాతం పెరిగింది. అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) నివేదికను అనుసరించి, 2019లో ఈ ఎంపిల సగటు ఆస్తులు దాదాపు రూ. 21.55 కోట్లు కాగా, ప్రస్తుత ఎన్నికల సమయానికి, గణనీయంగా రూ.30.88 కోట్లకు పెరిగిందని. కేవలం ఐదేళ్ల వ్యవధిలో ఎంపిల ఆస్తులు రూ. 9.33 కోట్లు పెరగడం విశేషం. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి పోటీ చేస్తున్న ఎంపిల ఆర్థిక వృద్ధిని నివేదిక విశ్లేషించింది. 2019. 2024 లోక్‌సభ ఎన్నికల మధ్య పార్టీల వారీగా సగటు ఆస్తుల తులనాత్మక విశ్లేషణ ఈ పెరుగుదలను స్పష్టం చేస్తున్నది. ప్రధాన పార్టీలలో, బిజెపి తరపున తిరిగి పోటీ చేసిన 183 మంది ఎంపిల (రూ. 18.40 కోట్ల నుంచి రూ. 25.61 కోట్లు) సగటు ఆస్తుల్లో 39.18 శాతం వృద్ధి నమోదైంది. కాగా, 36 మంది కాంగ్రెస్ ఎంపిలకు ఇది 48.76 శాతం (రూ. 44.13 కోట్ల నుంచి రూ. 65.64 కోట్లు)గా ఉంది. డిఎంకెకు చెందిన పది మంది ఎంపిలు తిరిగి పటీ చేస్తుండగా, వారి ఆస్తులు 19.96 శాతం (రూ. 30.93 కోట్ల నుంచి రూ. 37.10 కోట్లు)క పెరిగింది. అదే విధంగా ఎనిమిది మంది శివసేన ఎంపిలకు ఆస్తులు 48.13 శాతం, అంటే, రూ. 19.77 కోట్ల నుంచి రూ. 29.28 కోట్లకు చేరుకున్నాయి. సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) తరపున ఐదుగురు ఎంపిల ఆస్తులు 20.53 శాతం, రూ. 20.56 కోట్ల నుంచి రూ. 24.78 కోట్లకు పెరిగాయి. అదే విధంగా ఎనిమిది మంది యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ ఎంపిల ఆస్తులు 84.13 శాతం, రూ. 28.66 కోట్ల నుంచి రూ. 52.78 కోట్లకు చేరుకున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) నుంచి 16 మంది మళ్లీ పోటీ చేస్తుండగా, వారి ఆస్తులు సగటున 53.84 శాతం, అనగా, రూ. 15.69 కోట్ల నుంచి రూ. 24.15 కోట్లకు పెరిగింది. జనతాదళ్ (యునైటెడ్)కు చెందిన 11 మంది ఎంపిల ఆస్తుల్లో సగటు పెరుగుదల 35.54 శాతంగా ఉంది. వీరి ఆస్తులు రూ. 4.55 కోట్ల నుంచి రూ. 6.17 కోట్లకు చేరింది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక ఎంపి తిరిగి పోటీ చేస్తుడగా, ఆస్తి 14.34 శాతం (రూ. 12 కోట్ల నుంచి రూ. 14 కోట్లు) పెరిగింది. ముగ్గురు భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్) ఎంపిల ఆస్తి ఏకంగా 52.94 శాతం, అంటే, రూ. 38 కోట్ల నుంచి రూ. 59 కోట్లకు చేరింది. ముగ్గురు ఎన్‌సిపి (శరద్ పవార్) ఎంపిల ఆస్తులు రూ. 48 కోట్ల నుంచి రూ. 58 కోట్లకు, ముగ్గురు భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్) ఎంపిలకు 52.94 శాతం (రూ. 38 కోట్ల నుంచి రూ. 59 కోట్లు), ఒక జనతాదళ్ (సెక్యులర్) ఎంపికి 317 శాతం (రూ. 9 కోట్ల నుంచి రూ. 40) కోటి) చొప్పున ఆస్తులు పెరిగాయి. అదే విధంగా, బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) ఎంపిలు 25.37 శాతం (రూ. 8.46 కోట్ల నుంచి రూ. 10.61 కోట్లు), శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే) ఎంపిల ఆస్తుల విలువ 68.4 శాతం (రూ. 7.01 కోట్ల నుంచి రూ. 11.80 కోట్లు) పెరిగింది. తెలుగుదేశం పార్టీ ఎంపిల ఆస్తుల విలువ సగటున 143.2 శాతం (రూ. 18.90 కోట్ల నుంచి రూ. 45.97 కోట్లు), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఎంపిల ఆస్తులు 104.9 శాతం (రూ. 13.07 కోట్ల నుంచి రూ. 26.78 కోట్లు) చొప్పున పెరిగినట్టు ఎడిఆర్ నివేదిక స్పష్టం చేస్తున్నది.

## ఉప ఎన్నిక కౌంటింగ్ నిష్పక్షపాతంగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నిక కౌటింగ్ ఎన్నికల నిబంధనల ననుసరించి నిష్పక్షపాతంగా ,సజావుగా ,పారదర్శకంగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి కలెక్టర్ జి.రవి నాయక్ అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహబూబ్‌నగర్ స్థానిక సంస్థ నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నిక కౌటింగ్ ప్రక్రియపై కౌటింగ్ సూపర్వైజర్లు ,కౌటింగ్ అసిస్టెంట్లకు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణా కార్యక్రమం నిర్వహించి అవగాహన కలిగించారు .రిటర్నింగ్ అధికారి ,మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపులో సిబ్బంది షెడ్యూలు సమయం కంటే ముందే రావాలని ,సమయానికి రిపోర్ట్ చేయాలని ,సెల్ ఫోన్లను తీసుకురావద్దని చెప్పారు . ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాధాన్యతా క్రమం ప్రకారం ఓటర్లు ఓటు వేస్తారని ,కాబట్టి కౌటింగ్ లో భాగంగా మొదట ప్రారంభ లెక్కింపు చేపడతామన్నారు .కౌటింగ్ కోసం ఐదు లను ఏర్పాటు చేశామన్నారు ప్రారంభం లెక్కింపులో మొత్తం 10 పోలింగ్ కేంద్రాల్లో నమోదైర ఓట్లను లెక్కిస్తారని అన్నారు. ప్రాథమిక లెక్కింపులో చెల్లిన ఓట్లు చెల్లని ఓట్ల వర్గీకరణలో పరిపూర్ణంగా అవగాహన కలిసి ఉండాలన్నారు .ప్రారంభ లెక్కింపు అనంతరం మొదటి ప్రాధాన్యత ప్రకారం ప్రతి అభ్యర్థి సాధించిన ఓట్లను లెక్కిస్తామని అన్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు అనంతరం చెల్లుబాటు ఆయన ఓట్ల సంఖ్య ఆధారంగా గెలుపు కోసం కావలసిన కోటాను నిర్ధారిస్తామని అన్నారు .ఎవరైనా అభ్యర్థి కోటాకు సరిపడు ప్రకటిస్తామని ,ఏ అభ్యర్థికి కోటాకు కావలసిన ఓట్లు రానట్లయితే తదుపరి ఎలిమినేషన్ ప్రక్రియను చేపట్టి తదుపరి ప్రాధాన్యత క్రమం ఆధారంగా ఓట్ల లెక్కింపు జరుపుతామని అన్నారు .ఈ ప్రక్రియ ఏదేని అభ్యర్థి కోటాను సాధించేవరకు చేపడతామన్నారు .ఏ అభ్యర్థికీ కోటా రానట్లయితే చివరికి మిగిలిన అభ్యర్థి గెలుపొందినట్లుగా ప్రకటిమన్నారు . ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్ రావు,నారాయణ పేట అదనపు కలెక్టర్ మాయాంక్ మిట్టల్ ,షాద్ నగర్ అర్.డి.ఓ వెంకట మాధవ రావు,మహబూబ్‌నగర్ అర్.డి.ఓ నవీన్ ఇతర అధికారులు పాల్గొన్నారు .



## జూన్ 3నుండి 19వరకు బడిబాట

**ప్రజాపక్షం/వనపర్తి ప్రతినిధి :** జూన్ 3 నుండి 19 వరకు జరిగే బడిబాట కార్యక్రమం ద్వారా అత్యధిక విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపడుతున్న మరమ్మతు పనులు, ఏకరూప దుస్తులు, పుస్తకాల పంపిణీ, బడిబాట కార్యక్రమంపై విద్యాశాఖ అధికారులతో పాటు ఇంజనీరింగ్ , జడ్పిసిఈఓ ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 3 నుండి బడిబాట కార్యక్రమం ప్రారంభమవుతుందని, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతున్నందున విద్యార్థుల నమోదు భారీగా జరగాలని ఆదేశించారు. బడి బయట పిల్లలు ఉండకుండా చూడాలన్నారు. పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు పూర్తి చేయడంతో పాటు బడిబాట కార్యక్రమం పకడ్బందిగా నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను అత్యధికంగా చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడేది లేదన్నారు. కేజిబివిలు, సంక్షేమ పాఠశాలల్లో సైతం అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మరమ్మత్తు పనులు, మౌలిక సదుపాయాలు, పుస్కాల పంపిణీ, ఏకరూప దుస్తుల పంపిణీ , బడిబాట కార్యక్రమంపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ , పంచాయతీ రాజ్ కార్య నిర్వహక ఇంజనీరు మల్లయ్య, జడ్పీ సీఈఓ యాదయ్య, డిఆర్డీఓ నాగేంద్ర, డిఈలు,ఏఈలు పాల్గొన్నారు.

## ఉదయం 7 నుంచి 11 వరకు ఎన్‌రోల్‌మెంట్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతంచేయడం కోసం బడిఈడు పిల్లలను బడుల్లో చేర్పించడం, విద్యార్థుల నమోదును పెంచడంకోసం రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల పరిధిలో జూన్3 నుంచి 19వతేదివరకు బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు డిఇఓ గోవిందరాజులు బుధవారం తెలిపారు. జూన్3నుంచి 19వ తేదివరకు ప్రతిరోజు ఉదయం 7నుంచి 11గంటలవరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను చేపడుతామని అన్నారు. జూన్ 12నుంచి బడులు పునఃప్రారంభమవుతాయని ఈసందర్భంగా పండుగ వాతావరణంలో బడులను తెరవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఉచిత పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న బోజనం, నాణ్యమైన విద్య, పాఠశాల విద్యార్థుల గత విజయాలను వివరించి పిల్లలను ఆకట్టుకునే ప్రయత్నం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని వినతి

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** ఇంటర్ వార్షిక పరీక్షల విధుల్లో పాల్గొన్న వారికి రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆన్‌లైన్ ద్వారా వినతి పత్రం పంపించినట్లు వనపర్తి జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, కార్యదర్శి వెంకట్ రెడ్డి తెలిపారు.

**మూల్యాంకనం కేంద్రాల వద్ద దశల వారీ కార్యక్రమాలు ...**

ఇంటర్ వార్షిక పరీక్షల్లో పాల్గొన్న వారికి రెమ్యూనరేషన్ చెల్లించాలంటూ వచ్చే నెల జూన్ 1వ తేదీ నుంచి మూల్యాంకనం కేంద్రాల వద్ద దశలవారి కార్యక్రమాలను నిర్వహిస్తామని అధ్యక్షులు సి. కృష్ణయ్య, కార్యదర్శులు వెంకట్ రెడ్డి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని కోరారు.

## అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలి : బిఎస్ఎఫ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ఇంటర్‌బోర్డు అధికారుల నిర్లక్ష్యం, ఇంటర్‌బోర్డు ప్రశ్నపత్రాల వాల్యుయేషన్ చేసినవారి అలసత్వం వహించడంవలన తప్పులుగా ప్రశ్నాపత్రాలు దిద్దడంవలన వేలాదిమంది విద్యార్థులకు నష్టం వాటిల్లిందని బహుజన విద్యార్థిసమైక్య జిల్లా అధ్యక్షుడు కె.రామకృష్ణ అన్నారు. తప్పుగాపేపర్లుదిద్ది వేలాదిమంది విద్యార్థులకు నష్టంచేసిన అధ్యాపకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## పాఠశాలల్లో మౌలిక వసతులు సిద్ధం కావాలి

### జిల్లా కలెక్టర్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** పాఠశాలలు పునః ప్రారంభం అయ్యే నాటికి పాఠశాలల్లో మౌలిక వసతులు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం పాన్‌గల్ మండల పరిధిలోని దావాజీపల్లి, దొండాయిపల్లి, రాయినిపల్లి గ్రామాల్లో సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా చేపట్టిన మరమ్మతు పనులు, మౌలిక సదుపాయాలు వేగవంతంగా పూర్తి చేయడమే కాకుండా నాణ్యతతో కూడిన పనులు జరగాలని ఆదేశించారు. దావాజీపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి కలెక్టర్ రికార్డులను పరిశీలించారు. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ బాయి, ఎంపీడీఓ కోటేశ్వర్ , ఎంపీఓ రఘురాం, ఎంఈఓ లక్ష్మ ణ్ నాయక్ , పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ , ఏపిఓ కురుమయ్య, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మండలపరిధిలోని జిల్లెల్ల గ్రామంలో ఇటీవల మరణించిన వికలాంగుల సంఘంనేత పెరుమాళ్లకృష్ణ కుటుంబానికి మాజీసర్పంచ్ జిల్లెల్ల రాములు వ్యక్తిగతంగా రూ.44వేల రూపాయలు అందించారు. గ్రామ నాయకులు 30వేల రూపాయలు మృతుని భార్య అలివేల, కూతురు నిత్యకు అందజేశారు. కార్యక్రమంలో హనుమాన్ దేవాలయం చైర్మన్ కొమ్మగొని రవిగౌడ్, వైస్‌చైర్మన్ వీరెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు గుమ్మకొండ బాల్‌జంగయ్య, మహేంద్రం, హోంగార్డుల సంఘం అధ్యక్షుడు కృష్ణ, నాయకులు బాల్‌జంగయ్య, యాదయ్య, దారపాండు, ప్రభాకర్, జంగయ్య, వినయ్, వెంకటయ్య, రాజు, పెద్ద యాదయ్య, సుల్తాన్, రమేష్, రాములు, శ్రీశైలం పాల్గొన్నారు.

**కల్వకుర్తి మండల సర్పంచుల సంఘం..**



కల్వకుర్తి మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు ఎముక జంగయ్య ఆధ్వర్యంలో రూ.10 వేలు వారి కుటుంబానికి ఆర్థిక సాయంచేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పాండుగౌడ్, ముత్యాలరమేష్, గుమ్మకొండ ఆనంద్, గుమ్మకొండవిష్ణు, గుమ్మకొండలవకుమార్, కొప్పులశివ, నాపశివసేన, గుమ్మకొండవినయ్, గుమ్మకొండలక్ష్మ య్య, చిన్నరాములు పాల్గొన్నారు.



## మైనింగ్ పనులను నిలిపివేయాలి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండల పరిధిలోని చీపునుంతల గ్రామపరిధిలో అక్రమ మైనింగ్ తవ్వకాలు జరపడంద్వారా చుట్టుపక్కల వ్యవసాయ భూములలోని బోరుబావులు కుంగిపోవడంతోపాటు తీవ్రంగా పరిసర ప్రాంతం పొల్యూషన్‌తో రైతులు పండించే పంటలుకూడా సర్వనాశనమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీపునుంతల గ్రామ రైతులు తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్ బాలాజిసింగ్‌ను కలిసి గ్రామంలో సర్వేనెంబర్ 22లో 42 ఎకరాల భూమి ఉన్నదని అందులో 32 ఎకరాలకు గతంలో మైనింగ్ తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం జరిగింది. అట్టికాలం పూర్తయిన శ్రీమిక్స్ మైండ్స్ అండ్ మినరల్ కంపెనీ యజమాని బొద్దం జంగారెడ్డి అక్రమ మైనింగ్ తవ్వకాలు చేపడుతున్నారని రైతులు విన్నవించారు. ఇకనైన రైతుల సమస్యలను పరిగణలోకి తీసుకొని అక్రమంగా మైనింగ్ పనులను నిలిపివేసే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తలకొండపల్లి కాంగ్రెస్‌పార్టీ మాజీ మండల అధ్యక్షులు మహేష్, మాజీవార్డుమెంబర్ శ్రీశైలంగౌడ్, యాదిలాల్, రైతులు పాల్గొన్నారు.

## ఆదర్శపాఠశాలల పనులు పరిశీలన

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ మండలంలోని తూడుకుర్తి గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను జిల్లా అదనపు కలెక్టర్ లోకల్‌బాడిస్ కుమార్‌దీపక్ పరిశీలించారు. బుధవారం గ్రామంలోని జడ్పిహెచ్‌ఎస్, సిపిఎస్, పిఎస్‌హెచ్‌సి, పిఎస్ ఉర్దూమీడియం పాఠశాలలకు కావాల్సిన కనీస వసతులను పరిశీలించారు. త్వరలో ప్రారంభంకానున్న విద్యా సంవత్సరం దృష్టిలో ఉంచుకొని పాఠశాలలకు కావాల్సిన కనీస సౌకర్యాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపిడిఓ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఏఈ సంపత్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, వకుళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** మండల కేంద్రమైన వీపనగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైనట్లు మండల వైద్యాధికారి డా. వంశీకృష్ణ, ఆప్తాలమిక్ అసిస్టెంట్ మురళి తెలిపారు. ఈ వైద్య శిబిరానికి ఉమ్మడి వీపనగండ్ల చిన్నంబావి మండలాల నుంచి మొత్తం 60 మంది కంటి రోగులు రాగా వారికి కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం 38 మందికి కంటే ఆపరేషన్లు అవసరమైనట్లు గుర్తించడం జరిగిందని వారు తెలిపారు.

## రక్తదాన శిబిరం



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ అధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంన్ని వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ బాస్కర్‌గౌడ్ ,వికారాబాద్ సిఐ రాఘువిన సిబ్బందితో కలిసి ఆయన రిబ్బన్ కట్ చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజిక సేవలో భగంగా ప్రభుత్వ అసుపత్రి సిబ్బంది సహకరంతో జిల్లాలోని ఎక్సైజ్ సిబ్బంది ,షాప్ యాజమనులు ,సామన్య ప్రజలు రక్తదాన కార్యక్రమంలో 100మందకి పైగా రక్త ధానం చేయడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూర్ .పరిగి కొండగల్ ,మెమిన్‌పేట్ సిఐలు ,ఎస్ఐలు పాల్గోన్నారు.

## పాఠ్య పుస్తకాల పంపిణీ

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రం నుండి మండలాలకు మండల విద్యాధికారులకు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఈనెల 27నుండి పని పూర్తియ్యే వరకు పాఠ్యపుస్తకాలు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. 2705 2024 నుండి 29వరకు రెసిడెన్సియల్ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపబడ్డాయి అని అన్నారు. 30నుండి మండల స్థాయి పాయింట్లకు పంపిణీ చేయబడును అని అన్నారు. ఈ విద్యసంవత్సరం జున్ 12న పున ప్రారంభంవరకు ఫార్టు1 పాఠ్యపుస్తకాలను పం ఫిణీ చేయడం జరుగుతుందని అని తెలిపారు. అక్టోబర్‌లో ఫార్ట్2 పుస్తకాలు వాస్తయాని తెలిపారు.
ఇప్పటివరకు జిల్లా 365040 రవడం జరిగింది అని జిల్లా మేనేజర్ వెంకటగిరి తెలిపారు.

## ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/దుండిగల్ :**ట్రాపిక్‌తో నరకయాతన పడుతున్నాం అంటూ దుండిగల్ మున్సిపాలిటి మల్లంపేట్ గ్రామ చుట్టు ప్రక్కల కాలనీల వాసులు ప్లేకార్డులు ప్రదర్శిస్తూ రోడ్డనా ఎక్కారు. బాచుపల్లి చౌరస్తా నుండి మల్లంపేట రింగ్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ లేక పోవడంతో రోజు ట్రాపిక్ స్థంభించి పోతుందనీ గంటల తరబడి రోడ్డు పై నిలబడి ఉండాల్సి వస్తుందని, గ్రామంలో రోడ్డు గుంతలు పడి ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకున్న వారే కరువయ్యారని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇక్కడ ఎక్కువగా ఐటి ఎంప్లాయిస్ నివసిస్తున్నారని వారు ఐటెక్ సిటీకి వెళ్లడానికి ఇదే ప్రదాన రహదారి అవడం, తీవ్రమైన ట్రాపిక్ తో సమయానికి ఉద్యోగాలకు చేరుకోలేకపోతున్నామని, ఎన్ని సార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకున్న దాఖలాలు లేవని వాపోతున్నారు. రోడ్డు పై కంకర పోసి మూడు నెలలవుతున్నా నిర్మాణం చేయడం లేదని దీంతో తీవ్రమైన దుమ్ముతో అనారోగ్యం పాలవుతున్నామని వర్షాకాలం లో సరైన డ్రైనేజి వ్యవస్థ లేక రోడ్డు పై వెల్తున్న వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయనీ సమస్యలు పరిష్కరించాలని అన్నారు.

## స్కూల్ ప్రారంభించిన చైర్మన్ చంద్రారెడ్డి



**ప్రజాపక్షం/నాగారం:** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి శ్రీనివాస నగర్ కాలనీలో కిడ్జీ స్కూల్‌ను బుధవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యాన్ని చైర్మన్ చంద్రారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.స్కూల్ సిబ్బంది చైర్మన్,వైస్ చైర్మన్‌లను పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్,నాయకులు పంబల్ల రమేష్,స్కూల్ ప్రిన్సిపాల్ వి మంజు,బోదాసు లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు మంత్రికి ఆహ్వానం



**ప్రజాపక్షం/చర్లపల్లి:** హెచ్‌బి కాలనీ డివిజన్ పరిధిలోని శ్రీరంగ గిరి శ్రీ గోదా తాయారు రంగనాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను జూన్ 6వ తేదీ నుండి 11వ తేదీ వరకు త్రిదండి శ్రీమన్నారాయణ చేతుల మీ దుగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమం,సైన్స్ టెక్నాలజీ శాఖమంత్రి దామోదర రాజనర్సింహను ఆలయ చైర్మన్ డాక్టర్ ధనంజయ ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఎస్ఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిటీని అభినందించిన ఎంఎల్ఏ బిఎల్ఆర్



**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాప్రా డివిజన్ పరిధిలోని సిల్వర్ క్రిస్ట్ అసోసియేషన్ నూతనంగా ఏర్పడిన కమిటీ ఉప్పల్ ఎంఎల్ఏ బండారి లక్ష్మారెడ్డికి బొకె అందజేసి శాలువాతో సత్కరించి మర్యాద పూర్వకంగా క్యాంపు కార్యాలయంలో కలిశారు. నూతన కమిటీ సభ్యులను ఎంఎల్ఏ అభినందనలు తెలిపారు. కాలనీ అభివృద్ధి కృషి చేస్తానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్ గౌడ్, సిల్వర్ క్రిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రజిత, కిరణ్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రి నర్సింగ్ హోమ్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :**వికారాబాద్ పట్టణంలోని గాయంత్రి నర్సింగ్ హోమ్‌లో ముదు రోజుల క్రితం వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతి చెందారు . ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌ను సిపిఎం అధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు గాయత్రి నర్సింగ్ హోమ్‌పై పిర్యాదు చేయడం తో జిల్లా వైద శాఖ అధికారి పాల్వన్‌కుమార్ ఆసుపత్రిని తనిఖీ చేశారు . గాయత్రి నర్సింగ్ హోమ్‌లో జిల్లాలోనే అత్యధిక సీజేరియన్ జరిగినట్లు గుర్తించడం జరిగింది అని తెలిపారు. రోగుల యొక్క కేషీట్స్ కూడా అసంపూర్తిగా నమోదు చేసినట్లు గుర్తించడం జరిగింది అని జిల్లా అధికారి అన్నారు. ఆసుపత్రిలో జరిగిన ప్రసవాలు అన్ని కుడా సీజేరియన్ ప్రసవాలు కావడానికి గల కారణాలు తెలియజేయాలని ఆసుపత్రి యాజమన్యానికి నోటీసులు ఇవ్వడం జరిగింది అని అన్నారు. ఈ సందర్భంగా అయాన మాట్లాడుతూ జిల్లాలోని గైనకాలజిస్టులు ఖచ్చితంగా సాధారణ ప్రసవలను ప్రోత్సాహించాలని , పేషేంట్ వివరలను తప్పనిసారిగా పోందుపర్చలని సూచించారు. 2010 యాక్ట్ ప్రకారం సెక్షన్ సి నిబంధనలు ఉల్లంఘించిన ఆసుపత్రిలపై గైనకాలజిస్టులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

# నకిలీ విత్తనాలపై అప్రమత్తం

### కలెక్టర్ నారాయణరెడ్డి






**ప్రజాపక్షం/ వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లాలోని రైతులకు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని, బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో వానాకాలం నకిలీ విత్తనాలు కొని రైతులు నష్ట పోకుండా వ్యవసా అధికారులు అవగాహన కార్యక్రమలు నిర్వహించాలని, సీడ్ పత్తి విత్తనాల కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ వాఖ గుర్తింపు పొందిన డీలర్ల దగ్గరే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విడిగా ఉన్న సంచుల్లో విత్తనాలను కోనుగోలు చేయరదని సంబంధిత కంపెనీ లేబుల్ ఉన్న ప్యాకెట్లను కొనాలని తెలపారు. కొనుగోలు చేసిన విత్తనాలఖాళి ప్యాకేట్లను, బిల్లులను పంటకాలం పూర్తియ్యే వరకు భద్రంగా ఉంచుకుంటే ఒక వేల నకిళి విత్తనాలు కారణంగా దిగుబడి రాన్నప్పుడు సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకోవడానిఇ అవకాశం ఉంటుందన్నారు. నకిలీ విత్తనాల అమ్మే వారిగురించి రైతులు,ఇతర పౌరులు ఎవరైనా సరే సమచారం ఇస్తే వ్యవసాయ అధికారులు టాస్క ఫార్స్ యంత్రంగం సహయంతో వారిపై చర్యలు తీసుకుంటామని అందుకే ముందు జాగ్రత్తగా విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వ్యవసాయ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. జిల్లా ఎస్‌పి కోటిరెడ్డి మాట్లాడుతూ రైతులకు సామావేశాలు ఏర్పాటు చేసి విత్తనాల కొనుగోలుపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని ,టస్క్ ఫార్స్ టీముల సమన్వయ తో ముందుకు వెళ్లలని అన్నారు. రైతులా దగ్గర కు వెళ్లి ఏ కంపెని విత్తనాలు కొన్నరని వివరాలు అడిగి తెలుసుకోవాఇలన్నారు. ఎన్పోర్సు మెంపట పోగ్రామ్స్ జరగాలన్నారు. చక్‌పోస్టల దగ్గర చెకింగ్ ఏర్పాటుచేయడం జరిగిందఅన్నారు. సమన్వయము తో పని చేయలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ ఆర్‌డిఓ వసుచంద్ర తదితరులు పాల్గోన్నారు. వికారాబాద్ జిల్లాలో వానాకాలంలో పత్తిల 2,63,500ఎకరాలకు సాగు అవుతుందని అంచనావేయడమైనది పత్తి సాగుబడి 5,45,000 పత్తి విత్తనాల ప్యాకెట్లు అవసరమగును 2,58,500 ప్యాకెట్లు జిల్లాలో నిల్వ ఉండగా 17,500ప్యాకెట్లు విక్రయం జరిగింది. పత్తి విత్తనలపై అవగాహన కార్యక్రమలు నిర్వహించడం జరిగిందన్నారు.

## పేదప్రజల మరుగుదొడ్లు కూల్చడం అన్యాయం

### సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్



**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ గ్రామంలో 5వ వార్డులో గత 30 సంవత్సరాల క్రితం కట్టిన మరుగుదొడ్లు అధికారులు రోడ్డుకు అడ్డంగా ఉన్నాయనే నెపంతో కూల్చడం అన్యాయమని నేడు సీపీఐ నాయకులు కూల్చిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డ్రైనేజీ, రోడ్డు వేసినప్పుడు లేని ఇబ్బంది అధికారులు హడావిడిగా ఇరుకు రోడ్లని చెప్పి ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూల్చివేయ్యడం దారుణమని దీని వెనుకాల స్థానిక బిఆర్ఎస్ కౌన్సిలర్ డి.ఆనంద్ ప్రోద్బలం ఉందని స్థానికులు చెపుతున్నారని అలా ఎలా కూల్చివేస్తారని స్థలాని పరిశీలించిన అనంతరం మునిసిపల్ కమిషనర్‌ను కలిశారు. కమిషనర్ మాట్లాడుతూ స్థానికులే మాట్లాడి కూల్చివేసుకున్నారని మాకు సంబంధం లేదు అనే విదంగా మాట్లాడారని, సిపిఐ నాయకులు అదే వీధిలో ఇంకా ఇరుకుగా ఉన్న రోడ్ల పై మాత్రం ఉన్న నిర్మాణాలను కూల్చివేయ్యాలదని ప్రశ్నించారు. వెంటనే వారికి న్యాయం చెయ్యాలని లేకపోతే బాద్యుల పై చర్య తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, సీపీఐ కార్యవర్గ సభ్యులు హరినాథ్ రావ్, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, మునిసిపల్ అధ్యక్షుడు రాములు, సీపీఐ నాయకులు ప్రభాకర్, శాఖ కార్యదర్శి భిక్షపతి పాల్గొన్నారు.

## కబ్జాలతో నిమ్మలవానికుంట కనుమరుగు

### పహానిలో సర్వే నంబర్ 660 ప్రకారం రికార్డుల్లో నిమ్మలవానికుంట శిఖం



**ప్రజాపక్షం/దుండిగల్ :**దుండిగల్ గండి మైసమ్మ మండల పరిధిలో ఎక్కడ చూసినా కబ్జాలకు నిలయంగా మారింది. కుంటలు చెరువులు ప్రభుత్వ భూమి ఏదైనా సరే కబ్జాలకు శ్రీకరం చుట్టేస్తున్నారు. పూర్తిగా వివరాల్లోకి వెళితే దుండిగల్ మండలం పరిధిలోని, బౌరంపేట సర్వే నంబర్ 660లో నిమ్మలవానికుంట ఉన్నట్టు రెవెన్యూ రికార్డుల్లో స్పష్టంగా ఉన్నా కుంటస్థలంలోనే ఏకంగా బహుళ అంతస్తు నిర్మాణం చేపట్టారు. మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల చూసి చూడనట్టుగా వ్యవహరిస్తూ కబ్జాదారుడికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బౌరంపేట పరిధిలోని సర్వే నంబర్ 660 లోని లేక ఐడి 2800తో కూడిన నిమ్మలవానికుంట విస్తీర్ణం 1 ఎకరా 15 గుంటలు ఇటీవల వందల కొద్ది టిప్పర్ల మట్టిని నింపడంతో పూర్తిగా కనుమరుగయ్యింది. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే కుంటలు చెరువులు కనుమరుగవుతున్నాయంటూ పలువురు ఆరోపిస్తున్నారు. నిమ్మలవానికుంట లో ఎటువంటి అనుమతులు లేకుండా 150 గజాల స్థలంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణం చేపడుతున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించి జరుగుతున్న నిర్మాణంలో నిర్మాణదారుడు కేవలం ఒక ఫీట్ మాత్రమే భఫర్ లోకి ప్రవేశించి నిర్మాణం చేపడుతున్నట్లు తేల్చారు. కుంట భఫర్ నుండి మరో 9 అడుగుల వరకు ఎటువంటి నిర్మాణం చేపట్టరాదు. ఎటువంటి అనుమతి లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణం జరుగుతున్నా మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. దుండిగల్ మున్సిపల్ నుండి భవన నిర్మాణం అనుమతులు పొందలేదని వాదనలు కూడా ఉన్నాయి. నేటికైనా అధికారులు సమగ్ర విచారణ జరిపి కుంటను కాపాడి భావితరాలకు ఉపయోగపడే విధంగా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## గూడు లేని పేదలకు ఇచ్చేందుకు లేని ప్రభుత్వ స్థలాలు, ప్రైవేటు కళాశాలకు ఎక్కడిది..?

### ప్రశ్నించిన సిపిఐ నేతలు



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** గూడు లేని పేద ప్రజలకు లేని ప్రభుత్వ స్థలాలు ప్రైవేటు విద్యా సంస్థలకు ఇవ్వడానికి ఏ విధంగా ఉన్నాయని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సిపిఐ నేతలు ప్రశ్నించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం, దేవేందర్ నగర్ లోని కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రైవేటు కళాశాలకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి ఉమామహేశ్‌లు మాట్లాడుతూ గాజులరామారం సర్వేనంబరు 343తో మరి కొని సర్వేనంబర్లలోని ఎకరాల కొద్ది ప్రభుత్వ స్థలాన్ని కేఎల్ యూనివర్శిటీకి కేటాయించినట్లు వచ్చిన వార్తలపై క్లారిటీ ఇవ్వాలని, నిజంగానే యూనివర్శిటీకి ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తే నిరుపేద ప్రజలకు అరవై గజాల స్థలాన్ని ఇవ్వడానికి రెవెన్యూ అధికారులకు వచ్చే అడ్డంకులు, ఆంక్షలు కోట్లాది రూపాయల వ్యాపారం చేసే ప్రైవేటు విద్యా సంస్థలకు ఏ విధంగా కేటాయిస్తారని ప్రశ్నించారు. యూనివర్శిటీకి ఎకరాల కొద్ది ప్రభుత్వ స్థలం కేటాయించడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. వెంటనే యూనివర్శిటీకి స్థలాన్ని కేటాయిస్తే దానిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులకు, ప్రభుత్వానికి, కబ్జాదారులకు డబ్బులు కావాలంటే ఇళ్లు లేని వారి దగ్గర వసూలు చేసి ఇస్తామని దుయ్యబట్టారు. ఇట్టి చర్యను ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో భూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు హరినాథ్ రావు, శ్రీనివాస్, రాములు, ప్రభాకర్ పాల్గొన్నారు.

# హరితహారం పేరు మార్చిన ప్రభుత్వం



**పక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లాలో హరితహారం కార్యక్రమనికి బదులుగా మహోత్సవం పేరట నిర్వహించేందు అధికార యంత్రాంగం సిద్ధమువుతుంది. బిఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిది విడుతలుగా హరితహారం కార్యక్రమంన్ని నిర్వహించారు. ప్రభుత్వ శాఖలను భగస్వాములను చేసి శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. పదో విడుతలో మొక్కలు నటేందుకు సిద్ధం అవుతున్నారు. వారం పదిరోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి ,అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ సారి వన మహోత్సవం కార్యక్రమంన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యం,విద్యశాఖ 11.000 ,పశుసంవర్ధక 5000,ఉద్యాన 2,00,000, పరిశ్రమల 10,000,అటవీ 3,50,000, డీఆర్‌డిఓ 14,00,000,డీపిఓ4,00,000, గనులు 50,000, పౌరసరఫరాలు 2000, ఎక్సైజ్15000, వ్యవసాయ 2,50,000, మార్కెటింగ్ 500, పోలీస్10,000.లక్ష్యలపెట్టుకున్నారు. వికారాబాద్ జిల్లాలో 581 నర్సరీల్లో అటవీ శాఖ గ్రామీణభివృద్ధి శాఖల అధ్వర్యంలో మొక్కలు పెంచుతున్నారు. గ్రామీణఅభివృద్ధి శాఖ పర్యవేక్షణలో 566 గ్రామ పంచాయతీలు నర్సరీలు ఉన్నాయి. వీటిలో 38,30,000 మొక్కలను పెంచుతున్నారు. ఇందులో ముఖ్యంగా, కాచ్చకయ,వేదురు, రావి, మర్రి దానిమ్మ ,నిమ్మ గోరింటాకు, తదితర మొక్కలను పెంచుతున్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటలు , వికారాబాద్ మున్సిపలిటికి 80వేలు,తాండూర్ మున్సిపలిటీకి 70 వేలు, కొడంగల్‌మున్సిపలిటీకి 35వేలు , పరిగి మున్సిపాలిటీకి 30వేలు మొక్కలు నాటే లక్ష్యలను నిర్దేశించారు. ,20మండలాల్లో 29లక్షలపైగా మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 16 ప్రభుత్వ శాఖలకు నాలుగు మున్సిపాలిటిల బాద్యతలు అప్పగించారు. వికారాబాద్ జిల్లాలో ఏట హరితహారం లక్ష్యం తగ్గుతుంది. మొదటి విడుతలక్ష్యం 70లక్షల మొక్కలు 2023లో 40లక్షల మొక్కలు నాటారు. ఈ సారి మరింత తగ్గినట్లు తెలుస్తుంది. గత సంవత్సరం అధికారులు చేప్తున్నా హరితహారం మొక్కల లెక్కల ప్రకరం 50 శాతం మొక్కలు మాత్రమే బతికినట్లు తెలుస్తుంది. డిఆర్‌డిఏ గ్రామ పంచాయతీల్ల 15లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకుంది. ముఖ్యంగా వికారాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్నా జిల్లా కావడంతో పర్యావరణ పరిరక్షణకు అధికారులు ప్రత్యేక దృష్టి సాధించారు. అన్ని శాఖ సమన్వయంతో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి.సీఎం పదోవిడుత హరిత హరం కు సిద్ధం కావాలని అదేశించారు .కలెక్టర్ పర్యవేక్షి స్తున్నారు.లక్ష్యం పూర్తి చేయడినికి సిద్దంగా ఉన్న అని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

### జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :**వికారాబాద్ జిల్లాలో జున్ 2న జరిగే రాష్ట్ర తెలంగాణఅవతరణ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను అదేశించారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులకుపలు సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులు ,ప్రజలు ,అధికారులు సమన్వమంతో రాష్ట్ర అవతరణ ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. జిల్లా వ్యాపత్గంగా అన్ని కార్యాలయాలలో ఉదయం 8.30 గంటలకు పతాకావిష్కరణ జరగాలని అదేశించారు. 2న అమరవీరులకు నివాళ్లులర్పించినఅనంతరం తొమ్మిదిగంటలకు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించబడినని కలెక్టర్ కార్యాలయలంఓ త్రాగనీరు , టెంట్లు ,కుర్చీలు డయాస్ ,సౌండ్ సిస్టం,విద్యుత్ తదితర అన్ని ఏర్పాటు చేయాలని అధికారులను అదేశించారు.

## నూతన ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అడ్మిషన్‌లు ప్రారంభం




**ప్రజాపక్షం / బోంరాస్‌పేట:** ఏన్నో ఏళ్ల కల విద్యార్థులకు వరం.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చోరవతో మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అడ్మిషన్‌లు ప్రారంభం కావడం ఈ విద్యా సంవత్సరం నుంచే కళాశాల తరగతి గదులు కూడా కొనసాగుతుండటంతో మండల ప్రజలతో పాటు విద్యార్థిని విద్యార్థులు ఎంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బుధవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్‌నాయక్ నేతృత్వంలో అడ్మిషన్‌లను ప్రారంబించారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతు ఈ విద్యాసంవత్సరం నుంచే మండల కేంద్రంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్మీడియట్ తరగతి గదులను ప్రారంబించడం జరుగుతుందని అన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఉచిత పాఠ్య పుస్తకాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మండల విద్యాధికారి రాంరెడ్డి, ఎంపీడీవో శ్రీదేవి, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ విజయ్‌కుమార్‌లతో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గోన్నారు.

## వడ్డీ వ్యాపారి నాగేష్‌గౌడ్‌ను అరెస్ట్ చేయాలి



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** శామీర్‌పేట మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన రుద్రబోయిన మహేందర్ వడ్డీల వ్యాపారి దూడల నాగేష్‌గౌడ్ (ఆలియాస్ శామీర్‌పేట నాగేష్‌గౌడ్) వేదింపులు భరించలేక మంగళవారం సెల్ఫీ వీడియో తీసుకుని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం పాఠకులకు విధితమే.. కాగా బుధవారం మృతుడి కుటుంబీకులు గ్రామస్థులు మహేందర్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున తుర్కపల్లి జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ ముందు ఉదయం నుంచి మద్యాహ్నం వరకు శాంతియుతంగా ధర్నాకు దిగారు. రాజీవ్ రహదారిపై పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ మహేందర్‌కు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ధర్నా చేశారు. మహేందర్ తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చిన తర్వాత కూడ వడ్డీల వ్యాపారి దూడల నాగేష్‌గౌడ్ తనను వేదింపులకు గురిచేస్తున్నాడని, ఇంటికి తాళం వేస్తానని బెదిరిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని సూసైడ్ నోట్ రాసిసెల్ఫీ వీడియో తీసుకుని తన చావుకు కారణం దూడల నాగేష్‌గౌడ్ అని బోరున విలపిస్తూ మహేందర్ ఫోన్‌లో తీసుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, కుటుంబీకులు, బందువులు మహేందర్ కుటుంబానికి అండగా నిలిచారు. దూడల నాగేష్‌గౌడ్‌ను అరెస్ట్ చేయాలని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ గ్రామస్థులు డిమాండ్ చేశారు. దూడల నాగేష్‌గౌడ్ అరాచకాలతో అధిక వడ్డీలతో ప్రజలు మోసపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని గతంలో ఇలాంటి సంఘటనలు జరిగినా దూడల నాగేష్‌గౌడ్‌కు కనికరం లేదని బాధితులుఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

**దూడల నాగేష్‌గౌడ్‌ను అరెస్ట్ చేస్తాం**
**తుర్కపల్లి జీనోమ్ వ్యాలీ సిఐ యాదయ్య**

మహేందర్ తీసుకున్న సెల్ఫీ వీడియో ఆధారంగా దూడల నాగేష్‌గౌడ్ ఆలియాస్ (శామీర్‌పేట నాగేష్‌గౌడ్) వేదింపుల కారణంగా మహేందర్ మృతి చెందాడని కుటుంబీకుల ఆరోపణల మేరకు వచ్చిన పిర్యాదుతో దూడల నాగేష్‌గౌడ్‌ను ఖచ్చితంగా అరెస్ట్ చేస్తామని బాధితులకు తప్పకుండా న్యాయం చేస్తానని తుర్కపల్లి జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ సిఐ యాదయ్య బాధితులకు భరోసిచ్చారు. బాధిత కుటుంబీకులకు సిఐ ఇచ్చిన హామీ మేరకు గ్రామస్థులు శాంతించి ధర్నాను విరమించి అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

# క్రీడ

## రికార్డు ధరకు న్యాయం చేసిన ఆసీస్ ఆటగాళ్లు



**న్యూఢిల్లీ :** ఈ ఏడాది ఐపిఎల్ సీజన్‌లో ఎంతో మంది ప్లేయర్లు ఊహించని స్థాయిలో ఆడి తమ తమ జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించారు. రెమ్యూనరేషన్‌తో సంబంధం లేకుండా చక్కటి ఆటతీరుతో ఆకట్టుకున్నారు. అయితే ఈ సారి కొంత మంది ప్లేయర్లు మాత్రం మినీ వేలంలో అత్యధిక ధర పలికినప్పటికీ క్రీజులో మాత్రం పేలవ ఫామ్‌తో అభిమానులను నిరాశపరిచారు. కానీ ఈ ఐపిఎల్ ఆరంభంలో మాత్రం రికార్డు రేటు పలికిన ఓ ఇద్దరు ఆటగాళ్లు మొదట్లో నిరాశపరిచేలా కనిపించినప్పటికీ, చివరిలో తమ అద్భుతమైన పెర్ఫామెన్స్‌తో అదరగొట్టి అందరినీ అబ్బురపరిచారు.

### కెకెఆర్ మెయిన్ పిల్లర్ - మిచెల్ స్టార్క్

ఐపిఎల్ సీజన్ 17 కోసం జరిగిన మినీ వేలంలో ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్‌ను ప్రముఖ ఐపిఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.24.75 కోట్లకు కొనుగోలు చేసింది. భారీ అంచనాలతో స్టార్క్‌ను బరిలోకి దింపిన కెకెఆర్ జట్టుకు తొలుత నిరాశే మిగిలింది. అయితే తొలి రెండు మ్యాచ్‌ల్లో ఒక్క వికెట్ కూడా తీయలేదు. పైగా రెండు మ్యాచ్‌ల్లో కలిపి వంద పరుగులు సమర్పించుకున్నాడు. జట్టు బౌలింగ్ విభాగాన్ని ముందుండి నడిపిస్తాడని ఎన్నో ఆశలు, అంచనాలు పెట్టుకున్న సమయంలో స్టార్క్ ఇలాంటి ఫామ్ కనబరిచే సరికి అటు కోల్‌కతా జట్టుతో పాటు ఇటు అభిమానులు కూడా నిరాశచెందా రు. అయితే లీగ్ దశ ఆరంభంలో అతడ్ని అంచనా వేసినవారిని అవాకయ్యే లా చేశాడు. కీలక మ్యాచ్‌ల్లో అదరగొట్టి జట్టుకు అండగా నిలిచాడు. ముఖ్యంగా ప్లేఆఫ్ రేసులో నిలకడగా రాణించాడు. ఆ తర్వాత సన్‌రైజర్స్‌తో జరిగిన తొలి క్వాలిఫయర్ మ్యాచ్‌లో మూడు వికెట్లతో తన సత్తా చాటాడు. అలా తన రేటుకు అతడు పూర్తి న్యాయం చేసి జట్టు విజయంలో భాగమయ్యాడు.

### కెప్టెన్సీలో దిట్ట - సన్‌రైజర్స్ కొత్త వెలుగు కమిన్స్

ఈ ఏడాది సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు అద్భుత పెర్ఫామెన్స్‌తో చెలరేగిపోయింది. మొదటి మూడు మ్యాచుల్లో అంతంత మాత్రంగా ఆడిన ప్లేయర్లు, ఆ తర్వాత వేగం పుంజుకుని ఎన్నో కొత్త రికార్డులను సృష్టించారు. దీనికంతటికి కారణం ఆ జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్. 11 ఏళ్లుగా ఉన్న ఐపిఎల్ అత్యధిక స్కోరు రికార్డును ఈ సీజన్‌లోనే సన్‌రైజర్స్ రెండుసార్లు బద్దలు కొట్టింది. జట్టును ఇలా మార్చే విషయంలో కమిన్స్ కీలక పాత్ర పోషించారు. అంతే కాకుండా వ్యక్తిగతంగానూ జట్టుకు మంచి ఇన్నింగ్స్. 16 మ్యాచ్‌ల్లో 18 వికెట్లు పడగొట్టాడు. కొన్ని మ్యాచ్‌ల్లో బ్యాటుతోనూ అదరగొట్టాడు. ప్లేఆఫ్స్ దశలో జట్టు నిలకడ తప్పినప్పటికీ కమిన్స్ మాత్రం సూపర్ ఫామ్‌లో కొనసాగాడు. ఫైనల్స్‌లోనూ 24 పరుగులతో అతడే టాప్ స్కోరర్. బౌలింగ్‌లోనూ ఒక వికెట్ కూడా పడగొట్టాడు.

## ఐసిసి ర్యాంకుల్లో దూసుకెళ్లిన భారత యువ క్రికెటర్లు



**న్యూఢిల్లీ :** టి20 ప్రపంచ కప్ ముంగిట భారత క్రికెటర్లకు ఉత్సాహాన్నిచ్చేలా ఐసిసి ర్యాంకుల్లో ప్రతిభ చూపారు. భారత యువ క్రికెటర్లు అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్ ఐసిసి ర్యాంకుల్లో ముందుకొచ్చారు. టి20 ఫార్మాట్‌లో తాజాగా ఐసిసి ర్యాంకులను ప్రకటించింది. అక్షర్ పటేల్ (660 పాయింట్లు) ఒక స్థానాన్ని మెరుగుపర్చుకుని మూడో ర్యాంక్‌కు చేరాడు. అర్ష్‌దీప్ సింగ్ మూడు స్థానాలు పైకి ఎగబాకి 16వ ర్యాంకును అందుకొన్నాడు. ఈ జాబితాలో రవి బిష్ణోయ్ (659) ఐదో స్థానంలో ఉన్నాడు. టి20 బ్యాటింగ్ విభాగంలో మాత్రం సూర్యకుమార్ యాదవ్ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ప్రస్తుతం అతడు 861 పాయింట్లతో తొలి ర్యాంకులో నిలిచాడు. ఆ తర్వాత ఇంగ్లాండ్ బ్యాటర్ ఫిల్ సాల్ట్ (788), రిజ్వాన్ (769), బాబర్ అజామ్ (761), మార్‌క్రమ్ (733) టాప్ 5లో ఉన్నారు. భారత యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ (714) ఒక స్థానాన్ని మెరుగుపర్చుకుని ఆరో ర్యాంకుకు చేరాడు. ఆల్ రౌండర్ల జాబితాలో టీమ్‌ఇండియా నుంచి టాప్ 5లో ఎవరూ లేరు. శ్రీలంక క్రికెటర్ హసరంగ (228) టాప్ ర్యాంకర్. వరల్ కప్‌లో భారత జట్టు వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్య (185) ఒక్కడే ఆరో స్థానంలో నిలిచాడు.

## బుమ్రా ఒక్కడే నిలకడగా యార్కర్లు సంధించే బౌలర్: బ్రెట్ లీ

**న్యూఢిల్లీ :** టి20 ప్రపంచ కప్‌లో అందరి దృష్టి భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాపైనే ఉందనడంలో సందేహం లేదు. ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన పేసర్లు ఉన్నప్పటికీ.. బుమ్రా వద్ద ఉన్న ప్రత్యేకత వారెవరికీ లేదనేది మాజీ క్రికెటర్ల మాట. అతడు సంధించే యార్కర్లను అడ్డుకోవడం హేమాహేమీ బ్యాటర్లకే సాధ్యపడదు. ఈ పొట్టి కప్‌లో బుమ్రాను ఎదుర్కోవడం చాలా కష్టమని ఆస్ట్రేలియా మాజీ పేసర్ బ్రెట్‌లీ వ్యాఖ్యానించాడు. డెత్ ఓవర్లలో అతడి బౌలింగ్ పదును మరింత ఎక్కువగా ఉంటుందని తెలిపాడు. 'ఇటీవల కాలంలో బుమ్రాలా నిలకడగా యార్కర్లు వేసిన బౌలర్లను చూపించండి. అతడిలా మరింతమంది యార్కర్లను వేయడం చూడాలని ఉంది. కొందరు వేస్తున్నారు కానీ డెత్ ఓవర్లలో ఎక్కువగా సంధించడం లేదనేది నా అభిప్రాయం. ఈ ఐపిఎల్ సీజన్‌లో చాలాసార్లు 200+ స్కోర్లు నమోదయ్యాయి. పేసర్లు ఇంకాస్త వైవిధ్యంగా బంతులేయడం అలవాటు చేసుకోవాలి. స్కూప్ షాట్లతో బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాలని అనుకొనే బ్యాటర్లను ఎదుర్కోవాలంటే యార్కర్లే కీలకం. వికెట్ల వెనక, థర్డ్‌మ్యాన్ దిశగా ఫీల్డర్లను పెట్టి అప్పుడు ఆ బంతిని వేస్తే.. షాట్ కొట్టేందుకూ బ్యాటర్లు బెంబేలెత్తిపోతారు. గతంలో 180 నుంచి 200 కొడితే చాలా మంచి స్కోరుగా భావించేవాళ్లం. ఇప్పుడు మాత్రం 260+ కొట్టినా గెలిచేవరకూ నమ్మకం ఉండటం లేదు. అందుకే, బ్యాటింగ్‌కు బౌలింగ్‌కు, బ్యాలెన్స్ చేయాల్సిన అవసరం లేకపోలేదు' అని బ్రెట్ లీ వ్యాఖ్యానించాడు. ఐపిఎల్‌లో ఆర్‌సిబికి ప్రాతినిధ్యం వహించిన ఇంగ్లాండ్ బ్యాటర్ విల్ జాక్స్ టీమ్‌ఇండియా క్రికెటర్ విరాట్ కోహ్లీపై ప్రశంసలు కురిపించాడు. అతడినుంచి చాలా విషయాలను నేర్చుకున్నట్లు జాక్స్ తెలిపాడు. 'కోహ్లీ నుంచి మొదట గెలవాలనే యాటిట్యూడ్‌ను నేర్చుకున్నా. ప్రతిరోజూ మెరుగైన ప్రదర్శన చేయడంపై దృష్టిసారించా. చాలామంది అతడితో కలిసి పనిచేయడం చాలా కష్టంగా ఉంటుందని చెప్పారు. కానీ అతడితో ఉంటే చాలా సులువుగా అనిపించింది. ప్రతీ బంతిని 100 శాతం అంచనా వేసి బాదేందుకు ప్రయత్నిస్తాడు. లక్ష్య ఛేదనలో కోహ్లీతో కలిసి ఆడటం ఎప్పుడూ మజానిస్తుంది. అవసరమైన సమయంలో రిస్క్ తీసుకోవడానికీ వెనుకాడడు' అని జాక్స్ వివరించాడు.

# రీల్

## బుజ్జి అండ్ భైరవ యానిమేషన్ సిరీస్

### స్ట్రీమింగ్ కంటే ముందే స్క్రీనింగ్




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ కల్కి 2898 AD ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాతో ప్రభాస్ బాక్సాఫీస్ వద్ద మరోసారి తన సత్తా చాటడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ సినిమాను దర్శకుడు నాగ్ అశ్విన్ సైన్స్ ఫిక్షన్ మూవీగా అత్యద్భుతమైన వీఎఫ్‌ఎక్స్‌తో రూపొందించినట్లు ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్ చూస్తే తెలుస్తోంది. ఈ సినిమాలో భైరవ పాత్రలో ప్రభాస్ నటిస్తుండగా, అతడికి తోడుగా బుజ్జి అనే రోబోటిక్ కారు ఉండనుంది. ఇక ఈ సినిమా రిలీజ్ కంటే ముందే కల్కి చిత్ర యూనిట్ ప్రేక్షకులకు అదిరిపోయే ట్రీట్ ఇవ్వనుంది. బుజ్జి అండ్ భైరవకి సంబంధించిన యానిమేషన్ సిరీస్‌ను అమెజాన్ ప్రైమ్ లో మే 31 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. అయితే అంతకంటే ముందే, అభిమానులు దీనిని ఎక్స్ పీరియన్స్ చేయవచ్చు. ఈ యానిమేషన్ సిరీస్ కు సంబంధించిన మొదటి ఎపిసోడ్ ను మే 30న ప్రపంచవ్యాప్తంగా స్క్రీనింగ్ చేయనున్నారు. హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, బెంగళూరు సహా దుబాయ్, లండన్, ఆస్ట్రేలియా, అమెరికా వంటి ప్రాంతాల్లో ఈ స్క్రీనింగ్ ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించిన ఓ స్పెషల్ పోస్టర్ ను మేకర్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో బుజ్జి, భైరవలను యానిమేషన్ రూపంలో చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## విశ్వంభర సెట్స్‌లో అజిత్



మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో, డైరెక్టర్ వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ మూవీ విశ్వంభర. వచ్చే ఏడాది జనవరి 10వ తేదీన వరల్డ్ వైడ్‌గా థియేటర్లలో రిలీజ్ కాబోతున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంకి సంబందించిన షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. అయితే కోలీవుడ్ స్టార్ నటుడు అజిత్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ గుడ్ బ్యాడ అగ్లీ హైదరాబాద్‌లో షూటింగ్ జరుపుకుంటుంది. అయితే హీరో అజిత్ తాజాగా విశ్వంభర సెట్స్‌లో అడుగు పెట్టారు. అజిత్ స్పెజ్ ఎంట్రీ తో చిత్ర బృందం సంతోషం వ్యక్తం చేయడం జరిగింది. అయితే మెగాస్టార్ చిరంజీవితో అజిత్ ఉన్నటువంటి ఫోటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది. తమ అభిమాన హీరోలను ఒకే ఫ్రేమ్‌లో చూడటం పట్ల ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విశ్వంభర చిత్రం లో త్రిష కృష్ణన్ కథానాయికగా నటిస్తుండగా, అషికా రంగనాథ్, రమ్య పసుపులేటి, ఈషా చావ్లా తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఆస్కార్ అవార్డు విన్నర్ ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

## అక్టోబర్‌లో రానున్న 'గేమ్ ఛేంజర్'



స్టార్ డైరెక్టర్ శంకర్ – మెగాపవర్ స్టార్ 'రామ్ చరణ్ తేజ్' కాంబినేషన్ లో రాబోతున్న పాన్ ఇండియా సినిమా గేమ్ ఛేంజర్. కాగా 'గేమ్ ఛేంజర్' సినిమా రిలీజ్ పై తాజాగా దిల్‌రాజు కూతురు హన్షిత రెడ్డి క్లారిటీ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ.. 'గేమ్ ఛేంజర్ సినిమాను అక్టోబర్‌లో రిలీజ్ చేయనున్నట్లు హన్షిత రెడ్డి వెల్లడించారు. హన్షిత రెడ్డి ఇంకా మాట్లాడుతూ.. 'ఈ సినిమా స్టోరీ డిఫరెంట్‌గా ఉంటుందని ఆమె తెలిపారు. దర్శకుడు శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. కాగా హన్షిత రెడ్డి 'బలగం'తో పాటు పలు చిత్రాలకు సహ నిర్మాతగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో అంజలి, శ్రీకాంత్, ఎస్‌జె సూర్య, నవీన్ చంద్ర వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## సెప్టెంబరు 27న లక్కీ భాస్కర్




మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం లక్కీ భాస్కర్. దుల్కర్ సల్మాన్, సీతారామం చిత్రంతో తెలుగు ఆడియెన్స్‌లో విపరీతమైన క్రేజ్ ను సొంతం చేసుకున్నారు. ఇప్పుడు ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఎంతో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో గుంటూరు కారం ఫేమ్ మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ చిత్రం లో మరొక బ్యూటీ అయేషా ఖాన్ కూడా కనిపించనుంది. లేటెస్ట్ న్యూస్ ఏంటంటే, ఈ చిత్రం రిలీజ్ డేట్‌ను ఫిక్స్ చేసుకుంది. సెప్టెంబర్ 27వ తేదీన వరల్డ్ వైడ్‌గా థియేటర్లలోకి రానుంది. అదే విషయాన్ని మేకర్స్ సరి కొత్త పోస్టర్ ద్వారా వెల్లడించారు. అయితే అదే రోజు పవన్ కళ్యాణ్ యొక్క ఓజి థియేటర్ల లోకి రానుంది. తెలుగు, మలయాళం, హిందీ, తమిళ భాషల్లో రిలీజ్ కానున్న ఈ చిత్రంను సితార ఎంటర్టైన్మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్ లపై నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

## హిమాచల్‌లో పర్యాటకాన్ని దెబ్బతీసిన బిజెపి : ప్రియాంక



**సిమ్లా :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హిమాచల్ ప్రదేశ్‌లోని పర్యాటక రంగం సహా చిన్న, మధ్య తరహా వ్యాపారాలను దెబ్బతీస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. నోట్ల రద్దు, వస్తు, సేవా పన్ను (జిఎస్‌టి) అమలు వల్ల రాష్ట్ర పర్యాటక రంగం దెబ్బతిందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చిన్న, మధ్య తరహా వ్యాపారాలపై దృష్టి సారించి పర్యాటక రంగాన్ని బలోపేతం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. బుధవారం హిమాచల్‌లోని కులులో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలోని ఓడరేవులు, విమానాశ్రయాలు, బొగ్గు గనుల వంటి ప్రభుత్వ ఆస్తులను 'తన పారిశ్రామికవేత్తల స్నేహితులకు ధారాదత్తం చేశారని ఆరోపించారు. ఈ రోజుకు కూడా హిమాచల్‌లో కోల్ట్ స్టోరేజీలు అదానీ ఆధీనంలోనే ఉన్నాయన్నారు. అతనే ఆపిల్స్ రేటు, ఆపిల్ పండించేవారి భవిష్యత్తును నిర్ణయిస్తారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆరోపించారు. యుఎస్ నుండి వచ్చే యాపిల్స్‌పై దిగుమతి సుంకాన్ని తగ్గించారని, వ్యవసాయ పనిముట్లు, ఇతర పరికరాలపై విధించిన జిఎస్‌టిని స్థానిక ఉత్పత్తిదారులు చెల్లిస్తున్నారని ప్రియాంక పేర్కొన్నారు. కొవిడ్ వ్యాక్సిన్ కారణంగా ప్రజలు ఇప్పుడు చనిపోతున్నారని, తయారీదారు నుండి 52 కోట్ల రూపాయల విరాళాన్ని బిజెపి తీసుకుందని గాంధీ ఆరోపించారు. 55 ఏళ్లు అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ అత్యంత ధనిక పార్టీగా అవతరించలేకపోయిందని, కేవలం పదేళ్లలో బిజెపి ప్రపంచంలోనే అత్యంత ధనిక పార్టీగా అవతరించిందని ఆమె అన్నారు. కాగా, మండి పార్లమెంటరీ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థి విక్రమాదిత్య సింగ్‌కు మద్దతు కోరుతూ జరిగిన బహిరంగ ర్యాలీలో గాంధీ మాట్లాడుతూ ఇండియా కూటమి అధికారంలోకి వస్తే, రాష్ట్రంలోని పేద మహిళలకు ప్రతి నెలా రూ. 10,000 ఇస్తామని హామీనిచ్చారు. మోదీ జీ హిమాచల్‌ను తన రెండవ ఇల్లు అని పిలుస్తారు, కానీ అతను రాష్ట్రానికి ఎటువంటి ప్రత్యేక ప్యాకేజీని ఇవ్వలేదు లేదా రుతుపవనాలను జాతీయ విపత్తుగా ప్రకటించలేదు అని మండిపడ్డారు. అందుకు బదులుగా రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ఆయన అన్ని ప్రయత్నాలు చేశారని ఆమె అన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో బిజెపికి అనుకూలంగా ఓటు వేసి ఆ తర్వాత పార్టీలో చేరిన ఆరుగురు కాంగ్రెస్ తిరుగుబాటుదారుల రాజకీయ సంక్షోభాన్ని ఆమె ప్రస్తావించారు. వారు ఇప్పుడు బిజెపి అభ్యర్థులుగా అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్నారన్నారు.

## ఢిల్లీలో రెండు అగ్ని ప్రమాదాలు

### 16 కార్లు దగ్ధం, ఐదు దుకాణాలకు నష్టం

**న్యూఢిల్లీ :** ఢిల్లీలో బుధవారం వేర్వేరుచోట్ల రెండు అగ్ని ప్రమాదాలు సంభవించాయి. ఢిల్లీ మధు విహార్ ప్రాంతంలో పౌర అధికారులు నిర్వహించే పార్కింగ్ ప్రదేశంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 16 కార్లు దగ్ధం అయ్యాయి. ఉత్తర ఢిల్లీ చాందినీచౌక్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదు దుకాణాలకు నష్టం జరిగింది. రెండు గంటల వ్యవధిలో ఈ మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదాల్లో ఎవరూ గాయపడలేదు. మధు విహార్ పార్కింగ్ ప్రదేశంలో మధ్యాహ్నం 1.17 గంటలకు అగ్ని ప్రమాదం జరిగింది. తక్షణం తొమ్మిది అగ్నిమాపక దళాలను రంగంలోకి దించారు. మంటలను అదుపు చేయడానికి నాలుగు గంటలు సమయం పట్టింది.

## దేశ రక్షణకోసం వందసార్లు జైలు కెళ్ళేందుకు సిద్ధం

### ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్



**జలంధర్ :** దేశ రక్షణకోసం వందసార్లు జైలుకు వెళ్ళడానికైనా తాను సిద్ధమేనని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. దేశాన్ని రక్షించడానికి జైలుకు వెళ్ళడం తాను గర్వంగా భావిస్తానని అన్నారు. బుధవారంనాడు పిటిఐ వీడియోస్ కోసం ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్‌తో తనను తాను ముడిపెట్టుకున్నారు. ''నేను భగత్‌సింగ్ అనుచరుణ్ణి, దేశాన్ని రక్షించవలసి వస్తే నేను వందసార్లు జైలుకు వెళతాను'' అన్నారు. జూన్ 1వ తేదీతో సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు ఇచ్చిన తాత్కాలిక బెయిలు గడువు ముగిసిపోతుంది. ఈ గడువు ముగియగానే ఆయన తిరిగి 2వ తేదీన తీహార్ జైలుకు వెళ్ళి రిపోర్టు చేయవలసి ఉంది ఐతే తాను వైద్య పరీక్షలు చేయించుకోవాలని, తనకు ఇచ్చిన గడువు పొడిగించాలని కూడా ఆయన ఒక విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ ఎక్సైజు విధానంలో అవినీతి జరిగిందన్న ఆరోపణలపై మార్చి నెలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఆయనను అరెస్టు చేశారు. గడచిన కొద్దిరోజులలుగా ఆయన పంజాబ్ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం చేశారు. 18వ లోక్‌సభకు జూన్ 1తో ముగిసే ఎన్నికల తర్వాత ఫలితాల్లో బిజెపికి 200 కంటే తక్కువ సీట్లే వస్తాయని అన్నారు. ''ఇండియా'' కూటమి 300 సీట్లు పైగా జూన్ 4వ తేదీన వచ్చే ఫలితాల్లో సంపాదించుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తూ, ''వారు (బిజెపి) ఏం చెబుతున్నారంటే, కేజ్రీవాల్ అవినీతికి పాల్పడ్డాడని..కానీ అక్కడ కనీసం ఒక్కటి కూడా ఆధారం లేదు, ప్రజలు ఏం చెబుతున్నారంటే, కేజ్రీవాల్ గనుక అవినీతికి పాల్పడితే ఇక ప్రపంచలో ఎవ్వరూ నిజాయితీపరులు ఉండరు అని'' కేజ్రీవాల్ అన్నారు. ''వారు (బిజెపి) ఏమన్నారంటే, రూ.100 కోట్లు దోచుకున్నారని. వారు 500 ప్రదేశాల్లో దాడులు చేశారు, కానీ వారికి ఒక్క పైసా కూడాఎక్కడా దొరకలేదు, మరి ఆ రూ.100 కోట్లూ గాల్లో, అనంత శూన్యంలోకి మాయం ఐపోయాయా?'' అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. కాగా ప్రధామంత్రి నరేంద్రమోదీ ఒక టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తన దగ్గర సాక్ష్యాలు దొరకలేదనీ, ముడుపుల డబ్బులు దొరకలేదనీ కేజ్రీవాల్ చెబుతున్నాడనీ, మరి అలాటప్పుడు ఎందుకు ఆయన్ను అరెస్టు చేశారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశ్నించారని గుర్తుచేస్తూ, '' వారి వద్ద ఈ కేసులో ఎలాంటి ఆధారాలూ లేవనీ, ఎలాంటి డబ్బా స్వాధీనం కాలేదని ప్రధానమంత్రి దేశం ఎదుట అంగీకరిస్తే ఒక అది ఒట్టి నకిలీ కేసు అనీ, బూటకపు కేసు అనే అర్థమని కేజ్రీవాల్ అన్నారు. మోదీ ప్రజల కోసం చేయలేని పనులు తాము చేయడంవల్లనే తమను అరెస్టు చేశారన్నారు ''పంజాబ్‌లో, ఢిల్లీలో ప్రజలకు విద్యుత్ ఉచితం చేశాం, మేం మంచి ఆసుపత్రులు నిర్మించాం, మొహల్లా క్లినిక్స్ నిర్మించాం, మేం చేసిన ఇలాంటి పనులు ప్రధామంత్రి చేయలేకపోయారు, అందువల్ల కేజ్రీవాల్‌ను జైలులో పెట్టారు'' అని ఆయనఅన్నారు. వారి నియంతృత్వానికీ, గూండాగిరీకి వ్యతిరేకంగా గొంతెత్తి ప్రశ్నించినందువల్లనే అరెస్టు చేశారన్నారు. ''వాళ్ళు నా నోరు మూయించాలనుకున్నారు, నన్ను దెబ్బతీయాలనుకున్నారు, నా గొంతు బలవంతంగా నొక్కేయాలనుకున్నారు, కానీ ఏ శక్తీ నన్ను ఆపలేకపోయింది'' అని కేజ్రీవాల్ అన్నారు. ''నేను తిరిగి జైలుకు వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాను, నేను అందుకు గర్వపడతాను, నా దేశాన్ని కాపాడటంకోసం జైలుకు వెళతాను'' అన్నారు. బిజెపి విజయం సాధించిన తర్వాత పంజాబ్‌లో భగవంత్ మాన్ ప్రభుత్వం ఇక ఎంతోకాలం మనుగడ సాగించబోదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ మధ్య చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, పంజాబ్‌లో ఉన్న మూడు కోట్ల మంది ప్రజలనూ అమిత్ షా బెదిరిస్తున్నారనీ, జూన్ 4 తర్వాత పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని రద్దు చేస్తామని భయపెడుతున్నారని కేజ్రీవాల్ అన్నారు. ''ఈవిధమైన గూండాగిరీని మీరు ఇంతకుముందు ఎన్నడైనా చూశారా? ఎక్కడైనా చూశారా? ఈ గూండాగిరీకి వ్యతిరేకంగా నేను గొంతెత్తుతున్నాను, ఈ విధమైన గూండాగిరీకి వ్యతిరేకంగానే నేను జైలుకు వెళుతున్నాను'' అని కేజ్రీవాల్ అన్నారు. పంజాబ్ రాష్ట్రంలో ఆప్ పార్టీకి 92 మంది ఎంఎల్‌ఎలు ఉన్నారనీ 117 సీట్లు గల అసెంబ్లీలో భారీ మెజారిటీ ఉందని అన్నారు. ''వారు లంచాలు ఇచ్చి మా ఎంఎల్‌ఎలను వేరు చేయగలరా? వారికి లంచాలు ఇవ్వగలరా? బెదిరించగలరా? ఏంచేస్తారు వాళ్ళు? అని ప్రశ్నించారు. పంజాబ్ ప్రజలు జూన్ 4న తగిన సమాధానం చెబుతారన్నారు. 400 సీట్లు ఇవ్వాలన్న బిజెపి నినాదాన్ని ప్రస్తావిస్తూ, ప్రభుత్వాన్ని 300 సీట్లతో నడపవచ్చు, మరి వారికి ఎందుకు 400 సీట్లు కావాలి? దేశంలో ప్రజలు ద్రవ్యోల్బణం, నిరుద్యోగంతో విసిగిపోయారు, ప్రధానమంత్రి నుండి వారు ఒక పరిష్కారాన్ని కోరుకుంటున్నారు, కానీ టీవీల్లో చూస్తే ప్రతిపక్షాలపై ప్రధానమంత్రి తిట్ల పురాణం తప్ప ఏమీ కనిపించడంలేదు, ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు, ఈ విధంగా తిడితే వారికి ఓట్లు వస్తాయా? మోదీకి ప్రజల సమస్యలు తెలియవు, ఆయన తన ప్రపంచంలో తాను బ్రతుకుతున్నాడు, నాకైతే తెలియదు, ఆయన ఎలాంటి ప్రపంచంలో బతుకుతున్నాడో'' అని కేజ్రీవాల్ విమర్శించారు.

## కరణ్ కాన్వాయ్ ఢీకొని ఇద్దరు మృతి



**గోండ :** మహిళ రెజ్లర్లపై లైంగిక వేధింపులు కారణంగా బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ నిత్యం వార్తల్లో నిలిచారు. అయితే తాజాగా ఆయన మరోసారి వార్తల్లోకి ఎక్కారు. ఆయన కుమారుడు, కైసర్ గంజ్ ఎంపి అభ్యర్థి, బిజెపి నేత కరణ్ భూషణ్ సింగ్.. ప్రయాణిస్తున్న కాన్వాయ్ గోండ నగర సమీపంలో ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టింది. ఈ ఘటనలో వారిద్దరు అక్కడికక్కడే మరణించారు. దీంతో కరణ్ భూషణ్ సింగ్‌పై బాధిత కుటుంబానికి చెందిన చందా బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కరణ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం ఉదయం 9 గంటలకు తన కుమారుడు రెహాన్ (17)తోపాటు మేనల్లుడు షాహెజాద్ (24) మందులు కోనుక్కుని రావడానికి బైక్‌పై మెడికల్ షాప్‌కు వెళ్లారని.. ఆ క్రమంలో కరణ్ ప్రయాణిస్తున్న కాన్వాయ్ ఎదురుగా వస్తూ.. వారి బైక్‌ను ఢీ కొట్టిందని ఆమె తన పిర్యాదులో పేర్కొంది. ఇదే ఘటనలో ఓ వృద్ధురాలు సైతం తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే స్పందించి ఆమెను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీస్ ఉన్నతాధికారి వెల్లడించారు. అయితే ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఆ కన్వాయిలో కరణ్ భూషణ్ సింగ్ ఉన్నట్లు ఆధారాలు లేవని తెలిపారు. కానీ ఈ ప్రమాద ఘటనలో కరణ్ కారు డ్రైవర్ను అరెస్ట్ చేశామని పోలీసులు చెప్పారు. ఇక ఈ ప్రమాదానికి కారణమైన వాహనం.. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కుటుంబం నడుపుతున్న నందిని నగర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ పేరు మీద ఉందని పోలీసులు వివరించారు. మహిళ రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడంటూ బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్‌పై చాలా కాలంగా ఆరోపణలు ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా ఢిల్లీ కోర్టు సైతం ఆయనపై కేసు నమోదు చేసింది. సదరు ఆరోపణల నేపథ్యంలో బ్రిజ్ భూషణ్‌ను బిజెపి అగ్రనాయకత్వం పక్కన పెట్టింది. ఆయన కుమారుడి కరణ్ భూషణ్ సింగ్‌కు కైసర్ గంజి లోక్‌సభ అభ్యర్థిగా బిజెపి బరిలో దింపింది. మహిళ రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడంటూ బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్‌పై చాలా కాలంగా ఆరోపణలు ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా ఢిల్లీ కోర్టు సైతం ఆయనపై కేసు నమోదు చేసింది. సదరు ఆరోపణల నేపథ్యంలో బ్రిజ్ భూషణ్‌ను బిజెపి అగ్రనాయకత్వం పక్కన పెట్టింది. ఆయన కుమారుడి కరణ్ భూషణ్ సింగ్‌కు కైసర్ గంజి లోక్‌సభ అభ్యర్థిగా బిజెపి బరిలో దింపింది.

## 8 మందిని నరికి చంపిన కుటుంబ పెద్ద

### ఆపై తానూ ఆత్మహత్య

**చింద్వారా :** మధ్యప్రదేశ్ చింద్వారాలో ఓ వ్యక్తి తన కుటుంబంలోని ఎనిమిది మందిని గొడ్డలితో నరికి చంపాడు. ఆపై అతడు కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, బోదల్ కఛార్ గ్రామానికి చెందిన దినేశ్ సరియం(26) మొదట తన భార్యను గొడ్డలితో నరికి ఆపై తల్లి, సోదరుడు, సోదరిని, వారి పిల్లలను ఒక్కొక్కరిని హత్య చేశాడు. ఆ తర్వాత నిద్రిస్తున్న ఇద్దరు మేనకోడళ్లను గొడ్డలితో గొంతు కోసి చంపేశాడు. అనంతరం తన మేనమాన కుమారుడి(10)పై దాడి చేస్తుండగా అతడి నుంచి తప్పించుకుని ప్రాణాలను కాపాడుకోవడానికి పారిపోయాడు. ఆ తర్వాత ఇంటి పక్కన వారికి జరిగినదంతా చెప్పాడు. అనంతరం స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడు కోసం వెతకడానికి ప్రయత్నించారు. అయితే అతడు చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడని పోలీసులు తెలిపారు. అయితే ఈ ఘటన తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో జరిగిందని ఆ బాలుడు తెలిపాడు. ఇక దినేశ్‌కు మే 21నే వివాహం జరిగిందని పోలీసులు తెలిపారు. నిందితుడు మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు దర్యాప్తు తెలిసిందని పోలీసులు పేర్కొన్నారు. ఘటన పట్ల మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వెంటనే చింద్వారాకు వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించాలని మంత్రి సంపతీయ ఊకేను ఆదేశించారు.

## భూతలంపై శత్రు లక్ష్యాలు ఛేదించే రుద్ర క్షిపణి ప్రయోగం సక్సెస్




**న్యూఢిల్లీ :** దేశ వైమానిక దళం యుద్ధంలో భూతల లక్ష్యాలను సులభంగా ఛేదించగల ''రుద్ర ఎం–2'' క్షిపణి ప్రయోగాన్ని భారత రక్షణ పరిశోధనా అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఓ) బుధవారంనాడు విజయవంతంగా ప్రయోగించింది. గగనతలం నుండి భూతలంపైన ఉన్న శత్రు లక్ష్యాలను ఈ క్షిపణి విజయవంతంగా ధ్వంసం చేయగలదని ఈ ప్రయోగం ద్వారా రుజువైంది. ఒడిశా తీరంలో భారత వైమానికదళ జట్ యుద్ధ విమానం ఎస్‌యు–30 ఎంకె–1 నుండి ప్రయోగించిన ఈ క్షిపణులు విజయవంతంగా లక్ష్యాలను ఛేదించాయి. రుద్ర ఎం – 2 క్షిపణిని దేశీయ పరిజ్ఞానంతో తయారు చేశారు. శత్రు దేశాలు వివిధ రకాల ఆయుధాలను దేశంమీద ప్రయోగించినప్పటికీ వాటిని ఈ రుద్ర క్షిపణి ఛేదించగలదు. బుధవారం ఉదయం 11.30 గంటలకు చేసిన ఈ ప్రయోగం విజయవతమైనట్లు రక్షణ మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఎలక్ట్రో ఆప్టిక్ వ్యవస్థలు, రాడార్లు, టెలిమీటర్ స్టేషన్లు వివిధ ప్రాంతాల్లో ఈ క్షిపణి ఫలితాలను నమోదు చేశాయని, విజయవంతమైనట్లు నివేదికలు వచ్చాయని పేర్కొంది. ఈ సందర్భంగా రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ డిఆర్‌డిఓ సిబ్బందిని, శాస్త్రవేత్తలను చ భారత వైమానిక దళ సిబ్బందిని అభినందించారు. అదేవిధంగా డిఆర్‌డి ఛైర్మన్, సెక్రటరరరీ సమీర్ వి కామత్ డిఆర్‌డిఓ సిబ్బందిపై ప్రశంసలు కురిపించారు.